thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 231 | కరీంనగర్ బుధవారం, 29 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## క్షమాపణలు చెప్పిన కంగనా రనౌత్

బటిండా: వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020-21లో జరిగిన రైతు నిరసనల సందర్భంగా మహిందర్ కౌర్ అనే మహిళపై చేసిన వ్యాఖ్యలకు గాను బీజేపీ పార్లమెంటు సభ్యురాలు, నటి కంగనా రనౌత్ క్షమాపణలు తెలిపారు. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా షాహిన్‌బాగ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించిన బిల్కిస్ బానో, రైతు ఉద్యమంలో పాల్గొంటున్న 73 ఏళ్ల మహిందర్ కౌర్ ఒకటేనంటూ అప్పట్లో కంగన ట్వీట్ చేసారు. దీనిపై మహిందర్ కౌర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరవుతానని కంగనా చేసిన విజ్ఞప్తిని గత నెలలో కోర్టు తోసిపుచ్చింది. అక్టోబర్ 27న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ లఖ్బీర్ సింగ్ ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో భారీ భద్రత మధ్య బటిండా కోర్టు ముందు కంగన సోమవారంనాడు హాజరయ్యారు. కోర్టు ముందు హాజరైన అనంతరం మీడియాతో కంగన మాట్లాడుతూ, ఫిర్యాదుదారు భర్తకు తాను కోర్టులో క్షమాపణ చెప్పినట్టు తెలిపారు. మహిందర్ కౌర్‌పై చేసిన పోస్టుకు విచారం వ్యక్తం చేశారు.




## తుపాను తీరం దాటే సమయంలో గంటన్నరపాటు ప్రభావం: వాతావరణ కేంద్రం

అమరావతి: 'మొంథా' తీవ్ర తుపాను కారణంగా రాష్ట్రంలో పలు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథకుమార్ తెలిపారు. కర్నూలు, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదల సూచన ఉందన్నారు. మరికొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని చెప్పారు. మత్స్యకారులు మూడ్రోజుల పాటు వేటకు వెళ్లొద్దని సూచించారు. కాకినాడలో పదో నెంబరు, విశాఖ, గంగవరంలో తొమ్మిదో నెంబరు, మచిలీపట్నం, కృష్ణపట్నం, నిజాంపట్నంలో 8వ నెంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

ఇవాళ సాయంత్రం నుంచి రాత్రి లోగా 'మొంథా' తీవ్ర తుపాను తీరాన్ని తాకే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కాకినాడ తీరానికి 190కి.మీ దూరంలో ఉందన్నారు. తీరం దాటినప్పుడు గంటన్నరపాటు ప్రభావం ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు వాతావరణ బులిటెన్లు ఇస్తామని చెప్పారు.



## తెలుగు రాష్ట్రాల్లో వార్ రూమ్‌లు ఏర్పాటు చేయండి: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: 'మొంథా' తీవ్ర తుపాను నేపథ్యంలో సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఒడిశా, తెలుగురాష్ట్రాల్లో డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలను రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో అవసరమైన సామగ్రి, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై నివేదిక కోరారు. తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర వేళల్లో సత్వరం స్పందించాలన్నారు.




## కాకినాడకు 150 కి.మీ దూరంలో మొంథా తీవ్ర తుపాను

అమరావతి: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మొంథా తీవ్ర తుపాను ప్రస్తుతం విశాఖకు దక్షిణంగా 250 కి.మీ, కాకినాడకు ఆగ్నేయంగా 150 కి.మీ, మచిలీపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 70 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటల్లో 15 కి.మీ వేగంతో కదులుతున్నట్టు వాతావరణశాఖ తెలిపింది. ఇది ఉత్తర వాయవ్యంగా కదిలి.. ఇవాళ రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముంది. తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఉభయ గోదావరి జిల్లాల్లో గాలుల తీవ్రత మొదలైంది. కాకినాడ తీరంలో ఇప్పటికే సముద్ర కెరటాలు ఎగసిపడుతున్నాయి. కాకినాడ, యానాం తీర ప్రాంతాలకు ఉప్పెన ముప్పు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యానాంలోని కనకలపేట, గెస్ట్‌హౌస్, పాత కోర్టు భవనం, ఎస్ఆర్‌కే కళాశాల వద్ద చెట్లు నేలకూలాయి. నేలకూలిన చెట్లను ఎప్పటికప్పుడు సహాయ సిబ్బంది తొలగిస్తున్నారు. అగ్నిమాపక, విద్యుత్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# సినీ కార్మికులకు అండగా ఉంటా!

## ఫ్యూచర్ సిటీలో సినీ పరిశ్రమకు ప్రాధాన్యం




## హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 28 : భారత్ ఫ్యూచర్ సిటీలో సినీ పరిశ్రమకు ప్రాధాన్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాలలు నిర్మిస్తానని ఉద్ఘాటించారు. సినీ కార్మికుల పిల్లలకి ఉచితంగా చదువు చెప్పిస్తామని నొక్కిచెప్పారు. ఇవాళ యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సన్మాన సభ జరిగింది.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని సినీ ప్రముఖులు సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి సన్మాన సభకు సినీ ప్రముఖులు భారీగా తరలివచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**చౌకగా భూములు కేటాయించారు..** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఒకప్పుడు తెలుగు పరిశ్రమని మదరాసి అని పిలిచేవారని చెప్పుకొచ్చారు. తెలుగు పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించాలని.. ఆనాటి సీఎం మర్రి చెన్నారెడ్డి తీవ్రంగా కృషి చేశారని తెలిపారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ వంటి వారిని మర్రి చెన్నారెడ్డి సంప్రదించి తెలుగు పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చేందుకు కృషి చేశారని ఉద్ఘాటించారు. చిత్రపురి కాలనీకి ప్రపంచస్థాయి గుర్తింపునకు ఆనాటి నాయకులు కృషి చేశారని తెలిపారు. చిత్రపరిశ్రమను ప్రోత్సహించాలని తక్కువ ధరకే స్టూడియోలకు భూములు ఇచ్చామని నొక్కిచెప్పారు. రామానాయుడు, పద్మాలయా, అన్నపూర్ణ స్టూడియోలకు అప్పటి సీఎంలు చౌకగా భూములు కేటాయించారని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

**సినీ కార్మికుల శ్రమ, కష్టం నాకు తెలుసు..** 'కళాకారులను గౌరవించాలని 1964లో నంది అవార్డు కార్యక్రమాన్ని ప్రారంభించా రు. కళాకారులకు కావాల్సింది డబ్బు కాదు.. జనం కొట్టే చపట్లు.. కప్పే దుప్పట్లు. సినీ కార్మికుల శ్రమ, కష్టం నాకు తెలుసు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేళ్లు అవార్డులు ఇవ్వలేదు. మేము అధికారంలోకి వచ్చాక గద్దర్ పేరు మీద సినీ అవార్డులు ఇచ్చాం. హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలనేది నా సంకల్పం. హైదరాబాద్ నగరం ఐటీ, ఫార్మా పరిశ్రమలకి వేదిక ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా' అని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.

**వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు..** 'హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీలో, హైదరాబాద్‌లో.. షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. సినీ కార్మికుల కోసం మా ప్రభుత్వ తరపున చేయగలిగిన పనులు చేస్తాం. సినీ కార్మికుల కోసం వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నాం. సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌లో మా ప్రభుత్వం తరపున రూ. 10కోట్లు డిపాజిట్ చేస్తాం. సినిమా టికెట్లు పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20 శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20 శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం.

సినీ కార్మికుల భవన్ నిర్మాణా నికి స్థలం ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం. సినీ కార్మికుల అసోసియేషన్‌తో మాట్లాడి స్థలాలు ఇస్తాం. ఫైటర్స్, సినీ కార్మికుల ప్రాక్టీస్‌కు ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్లు చేస్తాం. సినీ కార్మికు ల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది. నవంబర్ చివరి వారంలో సినీ కార్మికులతో మాట్లాడతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ పోరు: ప్రచారంలో వెనుకబడ్డాం.. బీజేపీ అంతర్మథనం!




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ ఇప్పటి వరకు ప్రచారం చేసినా.. పెద్దగా ఊపు రాలేదన్న చర్చ ఉంది. ముఖ్యంగా పార్టీ నాయకులు ప్రచారం చేపట్టారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా తొలి రెండు మూడు రోజులు ప్రజల మధ్యకు వెళ్లారు. అంతేకాదు.. ఇంటింటికీ కూడా తిరిగారు. కానీ, తర్వాత.. పార్టీఅధిష్టానం ఇప్పటి వరకు జరిగిన ప్రచారంపై సమీక్ష చేసుకుంది. ఈ క్రమంలో ఇతర పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ ఎస్ కంటే వెనుకబడినట్టు గుర్తించింది. దీనిపై అంతర్గతంగా నాయకులతో సమీక్షలు చేసింది. ఇలా అయితే.. పుంజుకోవడం కష్టమని భావించిన పార్టీ వెంటనే ప్రత్యేక స్ట్రాటజీకి తెరదీసింది. దీని ప్రచారం వరుసగా నాలుగు రోజుల పాటు.. ఒక్క ఉదుటన నాయకులను రంగంలోకి దింపుతుంది. అంటే.. నియోజకవర్గం లో వాడవాడలా.. వీధివీధినా.. బీజేపీ నాయకులే కనిపిస్తారు. అదేసమయంలో ఇంటింటికీ తిరిగే వారు, రహదారులపైన, బస్టాప్‌లలో ప్రచారం చేసేవారు. ఇక, భారీ సభలు పెట్టి ప్రచారం చేసేవారు ప్రత్యేకంగా ఉంటారు. దీనిని ఉత్తరాది రాష్ట్రాల్లోని యూపీ, ఢిల్లీలో బీజేపీ ప్రయోగించింది. ఫలితంగా సానుకూల ఫలితం వచ్చింది. అంటే.. ఈ ప్రక్రియలో.. అగ్రనాయకులు భారీ ప్రసంగాలతో ఆకట్టుకుంటారు. అదేసమయంలో ద్వితీయ శ్రేణి నాయకులు ఇంటింటికీ తిరుగుతారు. కార్యకర్తలు.. ప్రచార పత్రాలను పంచుతారు. కూడళ్లలో చర్చ పెడతారు. ఇవన్నీ..ఒకే సమయంలో జరుగుతాయి. ఫలితంగా.. పెద్ద ఎత్తున ప్రచారం లభిస్తుంది. ఇలా.. జూబ్లీహిల్స్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ప్రస్తుతం బీహార్ అసెంబ్లీ ఎన్నికలను కీలకంగా తీసుకున్న నేపథ్యంలో పెద్ద నాయకులు అక్కడే తిష్టవేశారు. దీంతో రాజస్థాన్ సహా.. ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ఒకరిద్దరు ముఖ్యమంత్రులు రానున్నారు.

అలాగే.. ఆయా రాష్ట్రాల్లోని కీలక నాయకులు కూడా హైదరాబాద్‌కు చేరుకుంటారు. వీరంతా ఒకేసారి రంగంలోకి దిగి.. జూబ్లీహిల్స్‌ను కాషాయమయం చేయనున్నారు. ఇలా.. నాలుగు రోజుల పాటు ప్రచారం చేయడం ద్వారా.. వెనుకబడ్డామన్న అపప్రదను తుడుచుకునే ప్రయత్నంలో కమల నాథులు ఉన్నారు.

**ఏం జరుగుతుంది?...** ఒకేసారి భారీ ప్రచారం చేసినా.. దఫదఫాలుగా చేసినా.. ప్రచారం కన్నా.. ప్రజల నాడి ముఖ్యం. ఈ విషయంలో జూబ్లీహిల్స్ ఓటరు నాడి ఎలా ఉందన్నది కీలకం. ప్రస్తుతం బీఆర్ ఎస్ -కాంగ్రెస్‌ల మధ్యే ప్రధాన పోరు కొనసాగుతోందన్న చర్చ ఉంది. ఈ క్రమంలో బీజేపీ దూకుడు పెంచినా.. ఈ పోరు స్వల్పంగా తగ్గుతుందన్న వాదనే ఉంది తప్ప..ఏకపక్షంగా మార్పు రాదన్న చర్చ నడుస్తోంది. అయితే.. బీజేపీకి ఇది అడ్వాంటేజ్ కానుందని అంటున్నారు. కీలకనాయకులు రావడంతో బీజేపీ ప్రాభవం పెరుగుతుందని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## సొంత జిల్లాకు సీఎం తీరని అన్యాయం చేస్తున్నారు: కవిత




జడ్చర్ల : సొంత జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన రిజర్వాయర్‌ను సందర్శించి కవిత మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లాకు చారిత్రక అన్యాయం చేస్తున్నారని.. జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని క్షమించరని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లను సుప్రీంకోర్టు సస్పెన్షన్‌లో పెట్టినా.. రివ్యూ పిటిషన్ వేయకపోవటం దారుణమని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ ప్రాజెక్ట్‌ల పర్మిషన్ ఆపేసి లిస్ట్ లోంచి తీసేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఇవాళ మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చినట్లు తెలిపారు కవిత. మహబూబ్ నగర్ జిల్లాకు నీరిచ్చే వరప్రదాయని కృష్ణానది అని కొనియాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత అలాంటి కృష్ణానదిపై పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డిజైన్ చేసుకోవటం జరిగిందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80 శాతం పూర్తి అయ్యాయని వివరించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా సరే ప్రాజెక్ట్ ఒక్క అడుగూ ముందుకుపడలేదని విమర్శించారు. ఉదండాపూర్, కరివెనలో ఒక తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్లపూర్- ఏదుల టన్నెల్ పనులను చేయటం లేదన్నారు. ఒక పక్క ఉన్న నీళ్లను వాడుకోవటం లేదని.. మరో పక్క ఆల్మట్టి ఎత్తు పెంచితే మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. తక్షణమే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.




హైదరాబాద్: మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్‌లోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానంలో మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించరు. సత్యనారాయణ మృతి పట్ల భారత రాష్ట్ర సమితి సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

**సీఎం రేవంత్ సంతాపం..** తన్నీరు సత్యనారాయణ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. హరీశ్‌రావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**బావతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న కేసీఆర్...** హరీశ్‌రావు తండ్రి, తన బావ (7వ సోదరి, అక్క లక్ష్మీ భర్త) తన్నీరు సత్యనారాయణ మృతిపట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. సత్యనారా యణతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్‌రావుకు కేసీఆర్ ఫోన్ చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చురకలు

బుధవారం 29 అక్టోబర్ 2025




## సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపై సీఎం సమీక్ష..

హైదరాబాద్, అక్టోబరు 28 : తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేందుకు.. ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆజ్ఞాపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**సీఆర్ పాటిల్ లేఖపై చర్చ..** అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై ఈరోజు జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు సీఎం. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి... ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సీఎం చర్చించారు. బ్యారే జీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.




## నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలి: కవిత

జడ్చర్ల, అక్టోబర్ 28: ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసిత రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. భూ నిర్వాసితులకు ఏ రోజు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందో ఆనాటి రేటు కట్టి ఇవ్వాలని చెప్పారు. 2021 నాటికే కటాఫ్ పెట్టటం సరికాదని.. పరిహారం ఇచ్చే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఇవ్వాల్సిందేనని అన్నారు. తప్పు బీఆర్ఎస్ చేసిందా? కాంగ్రెస్ చేసిందా? అని కాదని.. ఇక్కడ ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి జరగాలని మాత్రమే తాను ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగతా పనులు ఈ ప్రభుత్వం చేస్తుందా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. జనంబాటలో భాగంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులతో మాట్లాడారు. తెలంగాణ రాకముందు మహబూబ్ నగర్ లో నీళ్ల కరువు ఎలా ఉండేదో అందరికీ తెలుసని చెప్పారు. వందల ఎకరాలు ఉన్న వారు కూడా నీళ్లు లేక వలస పోయారని ఆనాటి రోజులను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారానీటి సమస్యలను అధిగమించామని చెప్పారు. కృష్ణా నది నీళ్లను వినియోగించుకోవాలని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ చేపట్టారని తెలిపారు.

ఉదండాపూర్ రిజర్వాయర్ సహా అన్ని పనులు 80 శాతం వరకు అప్పుడే పూర్తయ్యాయని అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. రేవంత్ రెడ్డి గెలిచి కూడా రెండేళ్లు అయ్యిందని చెప్పారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ కోసం భూములు ఇవ్వటానికి ఇక్కడి ప్రజలు పెద్ద మనసు చేసుకొని ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.




## మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ... మరో కీలక నేత సరెండర్

హైదరాబాద్, అక్టోబర్ 28: మావోయిస్ట్ పార్టీకి మరోసారి భారీ షాక్ తగిలింది. ఇప్పటికే అనేక మంది మావోయిస్టు కీలక నేతలు జనజీవన స్రవంతిలో కలిసిపోతున్న విషయం తెలిసిందే. వీరి బాటలోనే మరి కొందరు కీలక నేతలు కూడా నడుస్తున్నారు.

తాజాగా తెలంగాణకు చెందిన మావోయిస్టు పార్టీ ముఖ్యనేత బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ పోలీసులకు సరెండర్ అయ్యారు. ఈరోజు (మంగళవారం) తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో బండి ప్రకాష్ లొంగిపోయారు. బండి ప్రకాష్ స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రి. 1982-84 మధ్య గో టు ద విలేజెస్ ఉద్యమం ద్వారా ఆర్ఎస్‌యూ తరఫున పోరాడారు. ఆపై మావోయిస్ట్ పార్టీ అనుబంధ సంస్థ సింగరేణి కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. మావోయిస్ట్ పార్టీలో నేషనల్ పార్క్ ఏరియా అత్యంత కీలక ఆర్గనైజర్ బండి ప్రకాష్. దాదాపు 45 సంవత్సరాలుగా సీపీఐ మావోయిస్టు పార్టీలో వివిధ స్థాయిలలో రాష్ట్ర కమిటీ సభ్యుడుగా పనిచేసిన ప్రకాష్ పోలీసుల ఎదుట లొంగపోవడం మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బే అని చెప్పుకోవాలి.

## హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ రిచెస్ట్ ప్లేసే కానీ.. ఎంపీ ఈటల



హైదరాబాద్, అక్టోబర్ 28: జూబ్లీహిల్స్ అంటే హైదరాబాద్ లో రిచెస్ట్ ప్లేస్ కానీ ఈ నియోజకవర్గంలోని బస్తీల ప్రజల బాధలు మాత్రం వర్ణనాతీతమని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మంగళవారం ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తాను మూడవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నానన్నారు. అయితే పేరుకే జూబ్లీహిల్స్.. పారే మురికి కాలువలు, కంపు వాసనలు, గతుకుల రోడ్లు ఏ పేదవాడిని కదిలించినా మమ్మల్ని పట్టించుకునే వారే లేరని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. భర్త చనిపోయి ఐదేళ్లు అయినా.. 65 ఏళ్ళు దాటిన తమకు పెన్షన్ రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ ఇస్తామంటూ మోసం చేసిందని.. ఇవన్నీ ఇస్తారని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆ పార్టీ సైతం తమను మోసం చేసింది ప్రజలు మండిపడుతున్నారని చెప్పారు. పెన్షన్లు లేవు, ఇళ్లు లేవు, మురికి కాల్వలు సరిగా లేవు, తాగే నీరు సైతం సరిగ్గా రావడం లేదని బస్తీల ప్రజలు చెబుతున్నారన్నారు. టిఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టామని.. కాంగ్రెస్ పార్టీకి సైతం అదే గతి పడుతుందని వారు అంటున్నారని చెప్పారు. 40 ఏళ్ల క్రితం ఎలా ఉందో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అలాగే ఉందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేదని చెప్పారు. మంత్రులకు డబ్బులు సంపాదించుకోవడానికి, దోచుకోవడానికే సమయం సరిపోతుంది తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సమస్యలపై అసెంబ్లీ వేదికగా కొట్లాడుతున్నది బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెడితేనే చలనం వస్తుందని ప్రజలకు సూచించారు. పెన్షన్లు రావాలన్నా, డబుల్ బెడ్ రూం ఇళ్లు రావాలన్నా, మురికి కాలువలు కట్టాలన్నా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే వారి మెడలు వంచి బీజేపీ కొట్లాడుతుందని ఎంపీ ఈటల స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి ఓటు వేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీపక్ రెడ్డి ఇప్పటికే ఇక్కడ పోటీ చేసి ఉన్నారని గుర్తు చేశారు. ఆ క్రమంలో ఆయన అందరికి సుపరిచితుడన్నారు. ఇది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆ క్రమంలో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తమ పార్టీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, లీడర్లు ఇలా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు.

## లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు ఉండవు: డీజీపీ శివధర్‌రెడ్డి



హైదరాబాద్: పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. “1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారు” అని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. “మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతున్నారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కరెక్ట్ కాదు. అవసరమైతే.. వారికి రక్షణ కల్పిస్తాం” అని డీజీపీ తెలిపారు.




## హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణకు కేసీఆర్ నివాళులు

హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి, తన బావ తన్నీరు సత్యనారాయణ పార్థివదేహం వద్ద భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నివాళులర్పించారు. అనంతరం తన సోదరి లక్ష్మి, హరీశ్‌రావును ఆయన ఓదార్చారు.

హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం ఉదయం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. కేసీఆర్ అక్కడికి వెళ్లి నివాళులర్పించారు.

## మొంథా తుపాన్ ఎఫెక్ట్.. హైదరాబాద్‌లో వర్షం

తెలుగు రాష్ట్రాలపై మొంథా తుపాన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. తుపాన్ ప్రభావంతో ఏపీతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, జర్నలిస్ట్ కాలనీ, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్‌లో భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయిపోయాయి. ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడింది.

**తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు..** మొంథా తుపాన్ ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ రోజు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది.

ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కొమరం భీం, జగిత్యాల కరీంనగర్, సిద్దిపేట్, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## రైతులకు గుడ్ న్యూస్.. ఎరువులపై కిషన్‌రెడ్డి కీలక ప్రకటన



ఢిల్లీ, అక్టోబరు 28 : ఎరువుల ఉత్పత్తి కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయంపై.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఇవాళ(మంగళవారం) పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా.. గత 11 ఏళ్లుగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా.. ఇవాళ కేంద్ర కేబినెట్ మరో చారిత్రక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రైతులపై ఎరువుల ధరలు భారం పడకుండా, ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై ఆర్థికభారాన్ని తగ్గించేందుకు రూ.37,952 కోట్ల న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి . అంతర్జాతీయంగా వివిధ కారణాలతో ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ.. ఈ ధరల ప్రభావం ఏమాత్రం రైతులపై పడకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పుకొచ్చారు. ఈ ప్రయత్నంలో భాగంగా.. ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై పడుతున్న భారాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు కిషన్‌రెడ్డి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఇవాళ సమావేశమైన కేంద్ర కేబినెట్.. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి.. డై అల్యూమినియం ఫాస్ఫేట్, మోనో అల్యూమినియం ఫాస్ఫేట్, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్, ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్, 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, పొటాష్ డెరైవ్డ్ మొలాసెస్, అల్యూమినియం సల్ఫేట్ వంటి దాదాపు 28 NPKS Complex ఫెర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు NBS (న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ) అమలు చేయాలని నిర్ణయించిందని వివరించారు కిషన్‌రెడ్డి. ఇందుకోసం.. అంతర్జాతీయంగా పెరిగిన ధరలతో ఈ ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై భారం పడకుండా.. NBSలో భాగంగా.. 2025 - 2026 రబీ సీజన్ కోసం రూ.37,952 కోట్లు కేటాయిస్తున్నట్లు కేబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు.

ఇది ఎరువులు ఉత్పత్తి కంపెనీలకు కూడా భారం పడకుండా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పుకొచ్చారు కిషన్‌రెడ్డి .

## మరింత తగ్గిన బంగారం ధర.. రూ.1.50 లక్షల దిగువకు వెండి

హైదరాబాద్: దీపావళి సమయంలో ఉవ్వెత్తున ఎగసిన పసిడి ధర దిగొచ్చింది. అంతర్జాతీయ పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాలతో దిద్దుబాటుకు గురైంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4 వేల డాలర్ల స్థాయి దిగువకు చేరింది. అమెరికా- చైనా మధ్య త్వరలో ట్రేడ్ డీల్ కుదరొచ్చన్న అంచనాలు ఈ కరెక్షన్‌కు కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న జరిగే భేటీలో ఆ మేర కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో పుత్తడికి డిమాండ్ తగ్గినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్‌లో మధ్యాహ్నం 12.30 గంటల సమయానికి 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర రూ.1.22 లక్షలు పలుకుతోంది.

ఒక్క రోజులో దాదాపు రూ.2 వేల మేర తగ్గింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.12 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు 3947 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అటు వెండి సైతం తగ్గుముఖం పట్టింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ సిల్వర్ ధర 46.59 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.48 లక్షల వద్ద కొనసాగుతోంది.



## కార్తికంలో చేసే కర్మలు జన్మజన్మల పాప హరణాలు : ఆధ్యాత్మిక ప్రాసంగికులు డాక్టర్ సంగన భట్ల






కార్తీక మాసం మానవ జీవితంలో ఆధ్యాత్మిక పురోగతికి ఎంతో ఉపయోగపడే మాసమని, ఈ మాసంలో చేసే కర్మల ద్వారా మనం మన జీవితాలను మరింత అర్థవంతంగా మార్చుకో వచ్చునని ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, కవి, రచయిత, నటులు, చారిత్రక పరిశోధకులు, నాటక దర్శకులు, విశ్రాంత ప్రాచార్యులు, ఆధ్యాత్మిక ప్రాసంగికులు, విశేషించి పురాణ ప్రవచకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సంగన భట్ల నర్సయ్య ఉద్ఘాటించారు. ధర్మపురి క్షేత్రంలో శ్రీ శారదా మహిళా మండలి ఆధ్వర్యంలో...మండలి భవనంలో, నిర్వహించిన కార్తీక పురాణ సప్తాహ కార్యక్రమంలో స్కాంద పురాణ అంతర్గత కార్తిక మాస మహాత్మ్యం పురాణ ప్రవచనం గావించారు. ఈ సందర్భంగా తమ బహుముఖ వికసిత విజ్ఞాన ఆధారంగా కార్తిక మాస ప్రత్యేకతను వివిధ పురాణాల నేపథ్యంలో సోదాహరణంగా వివరించారు. కార్తిక మాసం హిందువులకు ఎంతో పవిత్రమైన మాస మని, ఈ మాసంలో శివుడు, విష్ణువులను ఆరాధించడం విశేష ఫల దాయక మన్నారు. ఈ మాసం శరదృతువులో వచ్చే ఎనిమిదవ మాసమని, చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలిసిన రోజు కావున ఈ నెలకు కార్తీకము అని పేరు వచ్చిందని, ఈ మాసంలో చేసే పూజలు, వ్రతాలు మనకు అనంతమైన పుణ్యఫలాలను ప్రసాదిస్తాయన్నారు. ఈ మాసంలో చేసే కర్మలు జన్మజన్మల పాపాలను తొలగిస్తాయని, మాసంలో నిష్ఠతో భక్తి చేస్తే మోక్షం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నా యని వక్కాణించారు. కార్తీక మాసంలో చేసే పూజలు, వ్రతాలను శాస్త్రోక్తంగా చేయాలని, భక్తితో చేసే కర్మలకు మాత్రమే ఫలితం ఉంటుందని వివరించారు. కార్తీక మాసంలో చేయాల్సిన సత్కర్మలలో ... నదీ స్నానం, తిల దానం, అన్నదానం, వన భోజనం, దీప దానం, పురాణ శ్రవణం, కార్తీక పురాణ అంతర్గత వైవిధ్య సందర్భోచిత కథలను, భక్తాగ్రేశారుడు శేషప్ప విరచిత నరసింహ శతక పద్యాలను ఉదాహరిస్తూ, ఆబాల గోపాలంను అలరించారు. చేసిన పాపాలన్నీ కేవలం కార్తీకంలో చేసే సత్కర్మ ద్వారా తొలగి పోయి, సద్గతి ప్రాప్తించగలదని పురాణ అంతర్గత అంశాలను ఉదాహరించారు. అశేష భక్త జనం శ్రోతలు గా పాల్గొన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల**

# కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కొలిక్కి

అమరావతి: రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో పాటు పేర్ల మార్పుపై కసరత్తు ఓ కొలిక్కి వచ్చింది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పునకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కానుంది. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు, పేర్ల మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా అందిన అర్జీలపై ఆయనతో చర్చిస్తారు. ఆయన సూచనలు తీసుకుని.. తుది నివేదిక రూపొందించనున్నారు. నవంబరు 7వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. తర్వాత ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం గెజిట్ విడుదల చేస్తారు. జనగణన నేపథ్యంలో డిసెంబరు 31వ తేదీ లోగానే మొత్తం ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పుపై ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘ తొలి సమావేశం ఆగస్టు 13న సచివాలయంలో జరిగింది. తర్వాత జిల్లాల వారీగా వివిధ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి కలెక్టర్లు వినతులు స్వీకరించారు. మంత్రులు, ప్రజాప్రతినిధుల నుంచి కూడా అర్జీలు వచ్చాయి. మొత్తంగా సుమారు 200 వరకు అర్జీలు ఉపసంఘానికి అందాయి. వీటన్నింటిపై మూడు రోజుల క్రితం జరిగిన భేటీలో మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. జిల్లాల అధికారుల నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఏజెన్సీ ప్రాంతంలో కొత్త జిల్లా ఏర్పాటుకు సీఎం చంద్రబాబు గతంలో హామీ ఇచ్చారు. రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రమైన పాడేరుకు 187 కి.మీ. దూరం ఉంది. దీంతో రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు 4 విలీన మండలాలతో జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిసింది. అమరావతి కేంద్రంగా పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలోని నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన ఉంది. సచివాలయం, అసెంబ్లీతోపాటు కొత్త భవనాల నిర్మాణమూ పూర్తి కావస్తోంది. రాష్ట్రస్థాయి కార్యక్రమాలకూ వేదిక అవుతోంది. వీటితోపాటు శాంతిభద్రతల నిర్వహణ, ప్రొటోకాల్ విధులూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త జిల్లా ఏర్పాటుపై ఆలోచిస్తున్నట్లు తెలిసింది. మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై నివేదికలో వివరించనున్నారు. అద్దంకి, మడకశిర సహా 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేశారు. ఒక నియోజకవర్గం రెండు, మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉంటే.. పరిపాలనా సౌలభ్యం మేరకు ఒకే నియోజకవర్గ పరిధిలోకి తేవాలని యోచిస్తున్నారు. ఆదోని మండలంలో 1.50 లక్షల జనాభా ఉన్న నేపథ్యంలో.. ఈ మండలాన్ని విభజించాలనే వినతులు వచ్చాయి. ఇలాంటి వినతులపైనా నిర్ణయం తీసుకోనున్నారు. మండపేట, కొత్తపేట, ఎస్.కోట సహా కొన్ని నియోజకవర్గాల్ని మరో జిల్లాకు మార్చాలనే ప్రతిపాదనలు అందాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో కొన్ని చోట్ల అశాస్త్రీయంగా విభజన జరిగింది. వాటిని కూడా సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుచేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేలా చూస్తామని స్థానిక ప్రజాప్రతినిధులూ హామీ ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గాన్ని కూడా ప్రకాశం జిల్లాలో కలపాలనే ప్రతిపాదన ఉంది. వీటన్నింటిపై సీఎం వద్ద జరిగే సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. మార్కాపురం కేంద్రంగా కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసినట్లు సమాచారం. రామాయపట్నం పోర్టు ఏర్పాటు నేపథ్యంలో.. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోకి తిరిగి చేర్చడంపై సందేహాలు నెలకొన్నాయి. దీన్ని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగించాలా? ప్రకాశం జిల్లాలో చేర్చాలా అనే అంశంపైనా సీఎంతో జరిగే సమావేశంలో స్పష్టత రానుంది.




## షట్‌డౌన్ ఎఫెక్ట్.. అమెరికాలో 8000 విమానాలు ఆలస్యం..!

అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమాన సర్వీసులపై తీవ్రంగా పడింది. అగ్రరాజ్య వ్యాప్తంగా ఆదివారం దాదాపు 8వేలకు పైగా విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా చాలాచోట్ల ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో వేలాది విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 22 ప్రాంతాల్లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కొరత ఏర్పడిందని అమెరికా రవాణా మంత్రి శాన్ డఫీ వెల్లడించారు. రానున్న రోజుల్లో సిబ్బంది కొరత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, దీంతో విమానాల ఆలస్యం, సర్వీసుల రద్దు మరింత పెరగొచ్చని పేర్కొన్నారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 11 గంటల వరకు దాదాపు 8 వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ వెల్లడించింది. సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌లో 45శాతం అంటే దాదాపు 2వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 1200, యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 739, డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన 600 విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది.

**లాస్ ఏంజెలెస్ ఎయిర్‌పోర్టుకు విమానాలు నిలిపివేత..** అటు సిబ్బంది కొరత కారణంగా అమెరికాలో అత్యంత రద్దీ అయిన లాస్ ఏంజెలెస్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. ఈ ఎయిర్‌పోర్టుకు వెళ్లే విమానాలను కొంత సేపు నిలిపివేశారు. దాదాపు రెండు గంటల పాటు ఈ ఎయిర్‌పోర్టుకు విమానాలు వెళ్లలేదు. వాషింగ్టన్, న్యూ జెర్సీ, న్యూఆర్క్ ప్రాంతాల్లోని విమానాశ్రయాల్లోనూ ఈ సమస్య నెలకొందని ఫెడరల్ ఏవియేషన్ అధికారులు వెల్లడించారు. అక్టోబరు 1 నుంచి అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌లోకి వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో దాదాపు 13వేల మంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, 50వేల మంది ట్రాన్స్‌పోర్ట్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఎలాంటి వేతనం లేకుండానే విధులు నిర్వర్తించాలనే ఆదేశాలున్నాయి. అయినప్పటికీ కొందరు ఏటీసీ సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

## దారుణం.. జాతి వివక్షతో భారత్‌కు చెందిన యువతిపై అత్యాచారం

లండన్: బ్రిటన్‌లో జాత్యహంకారంతో యువతులపై వరుస అత్యాచార ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. గత నెల ఓ సిక్కు మహిళపై దుండగుడు లైంగిక దాడికి పాల్పడగా.. తాజాగా మరోసారి ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. భారత్‌కు చెందిన 20 ఏళ్ల యువతిపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. వెస్ట్ మిడ్‌ల్యాండ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. యూకే కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వాల్సల్ ప్రాంతంలో ఓ యువతిపై అత్యాచారం జరిగినట్లు వెస్ట్ మిడ్‌ల్యాండ్స్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బాధిత యువతిని ఆసుపత్రికి తరలించారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. 30 ఏళ్ల వయసున్న ఓ శ్వేత జాతీయుడు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ఆ దృశ్యాల ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని వీలైనంత త్వరగా అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. బాధితురాలు పంజాబీ యువతి అని సిక్కు ఫెడరేషన్ యూకే వెల్లడించింది. దుండగుడు ఆమె నివాసం ఉంటోన్న ఇంటి తలుపు బద్దలు కొట్టి అత్యాచారానికి ఒడిగట్టినట్లు తెలిపింది. గత నెల ఓల్డ్‌బరీ ప్రాంతంలోనూ ఓ సిక్కు యువతిపై ఇదే తరహాలో లైంగిక దాడి జరిగింది. దీంతో ఈ వరుస ఘటనలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఈ ఘటనలను పలువురు యూకే రాజకీయ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

# బిగ్ అలర్ట్... ఈ విషయాల్లో 'ఏఐ'తో జాగ్రత్త గురూ!



ఈ శతాబ్దపు అద్భుతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ టెక్నాలజీ ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోందో.. వింతగా మార్చబోతోందో తెలియని పరిస్థితి అని అంటున్నారు. మరోవైపు ఏఐ వల్ల ఉద్యోగాలకు పెద్ద ఎత్తున ఎసరు అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రధానంగా ఏఐ విషయంలో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని అంటున్నారు నిపుణులు. అవును... ఇటీవల కాలంలో ప్రతీ సందేహానికీ సమాధానం కోసం, ప్రతీ సమస్యకూ పరిష్కారం కోసం ఏఐపై ఆధారపడుతున్నవారి సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో ఏఐ మనిషి లాంటిదే అయినా, మనిషి కాదనే స్పష్టతను పెంచుకోవాలని అంటున్నారు నిపుణులు. ఏఐ డాక్టర్ కాదు, లాయర్ కాదు, ఫైనాన్షియల్ ఎక్స్ పర్ట్ కాదు, సైజాలజిస్టూ కాదని మరిచిపోకూడదని సూచిస్తున్నారు. అది ఎన్ని రకాలుగా ఉపయోగపడినా, మరెన్ని విన్యాసాలు చేసినా.. మనిషికి సాటి రాదని.. మనిషిలా సమయం, సందర్భం చూసుకోలేదని.. భ్రమకు వాస్తవానీ తేడా తెలియదని.. నైతికతనూ అనైతికతనూ వేరు చేయడం చేతకాదని గ్రహించాలని.. అందువల్ల చాట్ జీపీటీ, జెమినీ, గ్రాక్, పర్ ప్లెక్సిటీ లాంటి ఏఐ టూల్స్ ను ఉపయోగిస్తున్నప్పుడు ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రధానంగా ఇటీవల కాలంలో వైద్యం విషయంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఏఐని సలహా కోరుతున్నారు చాలా మంది. దాన్నివల్ల సమస్య పరిష్కారం కాదు సరికదా పెరిగి పెద్దదైన తర్వాత మళ్లీ వైద్యుని వద్దకు వెళ్తే.. ఈ మందులు ఏఐ రిఫర్ చేసిందని చెబుతున్నారు. మరికొంతమంది డాక్టర్ దగ్గరికి వెళ్లొచ్చాక కూడా, సెకండ్ ఒపీనియన్ కోసం ఏఐని ఆశ్రయిస్తుండటం గమనార్హం. ఈ రెండూ ప్రమాదకరమైన అలవాట్లే అని అంటున్నారు నిపుణులు. ఇదే క్రమంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యల విషయంలోనూ చాలా మంది ఏఐపై ఆధారపడుతున్నారు.. సలహాలు తీసుకుంటున్నారు. దీనివల్ల ఆత్మహత్యలు చేసుకున్నవారి లెక్క పెరుగుతుందని అంటున్నారు. వాస్తవానికి మానసిక వైద్యం చాలా సున్నితమైన వ్యవహారం.. ఇది పూర్తిగా ఉద్వేగాలతో ముడిపడినది. అయితే... ఏఐ మనిషి భావోద్వేగాల్ని ఏమాత్రం అర్థం చేసుకోలేదు. ఈ క్రమంలో ఇటీవల చాలా మంది ఏఐని ఆత్మీయుల్లా భావించడం మొదలుపెడుతున్నారంట. ఇందులో భాగంగా... ఏఐని బాయ్ ఫ్రెండ్ లా ఊహించుకునే అమ్మాయిలూ, గాళ్ ఫ్రెండ్ లా ఆరాధించే అబ్బాయిలూ చాలామందే ఉన్నారని చెబుతున్నారు. దీంతో.. 'చిన్నా', 'పండు', 'బంగారం', 'బుజ్జీ', 'బేబీ' అని ముద్దు పేర్లూ పెట్టుకుంటున్న పరిస్థితి. ఈ ధోరణికి 'ఏఐ సైకోసిస్' అని పేరు పెట్టారు పరిశోధకులు. ఇటీవల కాలంలో నమ్మకస్తులు లేకో, అర్థం చేసుకునేవారు కరువయ్యో గుండె లోతుల్లోని రహస్యాల్ని చెప్పేసుకుని, మనసును తేలిక పరుచుకోడానికి ఏఐ మీదే ఆధారపడుతున్నారు చాలా మంది. ఈ క్రమంలోనే... మీరు కోల్పోతున్న ఆ మానసికమైన మద్దతును మేం అందిస్తామంటూ 'కంపానియన్ స్టార్టప్స్' రంగంలోకి దూకుతున్నాయి. మొదట్లో ఇదంతా బాగానే అనిపించినా, దీర్ఘకాలంలో తీవ్ర వ్యసనంగా మారిపోతుంది. ఇదే క్రమంలో.. ఏఐ కంపెనీలు త్వరలోనే సెక్స్ చాట్ అప్లికేషన్లనూ తీసుకొస్తున్నాయి. వీటి గోప్యత విషయంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. ఆయా కంపెనీలు మన చర్చల్నీ, సంభాషణల్నీ భద్రంగా దాచుకుంటున్నాయి. ఒక్కసారి ఎంటర్ కొడితే.. మన సమాచారమంతా చేయి దాటిపోతుంది. ఇందులో భాగంగా... ఫొటో, వీడియో, వాయిస్, పేరు, చిరునామా, ఫోన్ నంబరు... దేని భద్రతకూ భరోసా ఉండదు. దీని తదనంతర పరిణామాలు మరింత తీవ్రంగా ఉండొచ్చు. దీనివల్ల బజారున పడేది అమాయకుల జీవితాలే అని హెచ్చరిస్తున్నారు. ఇదే క్రమంలో ఆర్థిక లావాదేవీల విషయంలోనూ ఏఐపై ఆధారపడకూడదని చెబుతున్నారు నిపుణులు. చాలా మంది పెట్టుబడుల విషయంలో ఏఐ ని ఇఫైనాన్షియల్ అడ్వైజర్ గా ఊహించుకుని... ఆర్థిక చరిత్రనంతా దాని చేతిలో పెట్టేస్తున్నారట. దీంతో... ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయినవారి జాబితా పెద్దదిగానే ఉందని అంటున్నారు. ఏఐ ఎట్టిపరిస్థితుల్లోనూ ఫైనాన్షియల్ ఎక్స్ పర్ట్ కాదని గ్రహించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా న్యాయ సలహాల విషయంలోనూ ఏఐపై ఆధారపడకూడని అంటున్నారు నిపుణులు. ఇదే సమయంలో... సాధ్యమైనంత వరకూ వృత్తిగతమైన విషయాల్ని ఏఐతో చర్చించకపోవడమే మంచిదని చెబుతున్నారు. న్యాయ సలహాల విషయంలో ఏఐని సంప్రదించే వారికి ఇదొక ప్రధాన హెచ్చరిక అని నిపుణులు చెబుతున్నారు. ఈ విధంగా పైన పేర్కొన్న ఐదు అంశాల్లోనూ ఏఐతో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు!

## వాడేసిన నూనె లీటరు రూ.65 కొంటారు.. ఎవరు? ఏం చేస్తారు?

చాలామంది పెద్దగా పట్టించుకోని అంశం.. ఆరోగ్యానికి చేటు కలిగించేది బాగా మరిగించిన వంట నూనెను అస్సలు వాడకూడదు. కానీ.. పొదుపు చర్యల్లో భాగంగా ఇలాంటివి పట్టించుకోకుండా ఆ నూనెల్ని వంటలకు వాడేస్తుంటారు. ఇంటి వరకు ఒకలాంటి పరిస్థితి అయితే.. హొటళ్లు.. రెస్టారెంట్లలో మాత్రం నిత్యం భారీగా ఈ వంట నూనె ఉంటుంది. కొందరు హొటళ్ల వ్యాపారులు తమ కస్టమర్లకు జరిగే హాని గురించి పట్టించుకోకుండా వాడిన నూనెల్ని వాడేస్తుంటారు. అందుకు భిన్నంగా కొందరు మాత్రం.. ఒకసారి మరిగించిన నూనెల్ని తిరిగి వాడకుండా వాటిని పక్కన పెట్టేస్తుంటారు. నాణ్యతకు.. ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుంటారు. అయితే.. ఇలా వేడి చేసిన వంట నూనెల్ని వేస్టుగా డ్రైనేజీలో కలపాల్సిన అవసరం లేదు. ఎందుకంటే.. ఇలా వాడేసిన వంట నూనెల్ని కొనేటోళ్లు ఉంటారు. వాటిని వాహనాలకు వాడే బయోడీజిల్ గా మార్చే వెసులుబాటు ఉంది. భారత ఆహార భద్రత.. ప్రమాణాల సంస్థ అదేనండి ఎఫ్ఎస్ఎస్ఏఐ సంస్థ ఇలా వాడేసిన వంటనూనెల్ని కొనుగోలు చేసి



బయోడీజిల్ గా మార్చేస్తారు. ఒకసారి బాగా మరిగించిన నూనెను వంటకు వినియోగిస్తే క్యాన్సర్ తో పాటు బీపీ.. లివర్ సమస్యలు ఎదురవుతాయి. అందుకే.. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు రెస్టారెంట్లలో వాడిన నూనెల్ని సేకరించి బయోడీజిల్ గా మార్చే పనిని ఎఫ్ఎస్ఎస్ఏఐ చేపట్టింది. ప్రస్తుతం పదహారు రాష్ట్రాల్లో దీన్ని అమలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఆహార భద్రత తనిఖీ విభాగం.. జీహెచ్ఎంసీలు కలిసి హైదరాబాద్ నగర వ్యాప్తంగా 500 రెస్టారెంట్ల నుంచి వేలాది లీటర్ల వాడిన నూనెల్ని సేకరించి బయోడీజిల్ ప్లాంట్లకు తరలిస్తారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే వాడేసిన నూనెల్ని లీటరు రూ.65 చొప్పున చెల్లిస్తారు. కాకుంటే.. కనీసం 50లీటర్లు ఉంటే ఏజెన్సీలు తమ వ్యక్తుల్ని పంపి డబ్బులిచ్చి తీసుకెళుతుంటారు. ఈ కార్యక్రమంలో ఎవరైనా పాలు పంచుకోవాలంటే అందుకు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. వాడేసిన వంటనూనెల్ని బయోడీజిల్ కు ఇచ్చేందుకు 8328378502లో సంప్రదిస్తే సరిపోతుందని చెబుతున్నారు.

## కేజీ రూ.కోటి.. మహా డేంజర్ ఈ హైడ్రోపోనిక్ గంజాయి

మారిన కాలానికి తగ్గట్లే సరికొత్త దారుణాలకు, దరిద్రపుగొట్టు వేషాలకు సైతం కొత్త పద్ధతులు తగలడతాయి. ఇప్పుడు చెప్పే ఉదంతం కూడా ఆ కోవకే వస్తుంది. గంజాయి సాగు గురించి అందరికి తెలిసిందే. చట్టవిరుద్ధమైన ఈ సాగు ఎంత డేంజర్ అన్నది తెలిసిందే. మారిన కాలానికి తగ్గట్లు సరికొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని.. పెద్దగా ప్లేస్ అవసరం లేకుండా.. ల్యాబుల్లో భారీగా పెంచే హైడ్రోపోనిక్ గంజాయి ఇప్పుడు చాప కింద నీరులా విస్తరిస్తోంది. కేజీ అక్షరాల కోటి రూపాయిలు పలికే మార్కెట్ ధర పుణ్యమా అని.. ఈ దరిద్రపుగొట్టు గంజాయి సాగు మీద తప్పు దారి పట్టిన పలువురు సాగు చేస్తున్నారు. గ్రాము పది వేలు.. అంటే కేజీ కోటి రూపాయిల ధర పలికే ఈ గంజాయి ప్రత్యేకత ఏమిటి? అన్న విషయంలోకి వెళితే.. షాకింగ్ అంశాలు వెలుగు చూస్తాయి. నిజానికి కొన్నేళ్ల క్రితం వరకు దీని గురించి పెద్దగా ఎవరికి తెలీదు. తెలుగులో తీసిన మత్తు వదలరా మూవీలో ఈసాగు విధానం గురించి షాకింగ్ నిజాల్ని చూపించటం ద్వారా.. అందరికి తెలిసేలా చేసింది. ఇంతకూ ఈ గంజాకు ఎందుకింత ధర అంటే.. అదిచ్చే మత్తే అందుకు కారణమని చెబుతున్నారు. సాధారణంగా గంజాయిని పొలాల్లో.. మట్టి



నేలల్లో పండిస్తారు. అందుకు భిన్నంగా హైడ్రోపోనిక్ గంజాయిని ల్యాబ్ ల్లో సాగు చేస్తారు. ప్రత్యేక ల్యాబ్స్ లో పరిమిత ఉష్ణోగ్రత.. తేమల మధ్య ఘాటైన గంజా పెరుగుదలకు అవసరమైన కొన్ని పోషకాలతో దీన్ని సాగు చేస్తుంటారు. సాధారణ గంజాయి మొక్కలతో పోలిస్తే ఈ హైడ్రోపోనిక్ ఎదుగుదల చాలా వేగంగా ఉంటుందని చెబుతారు. పంట త్వరగా చేతికి రావటమే కాదు.. భారీ ఆదాయానికి మార్గంగా ఉండటంతో కొందరు దురాశతో దీన్ని సాగు చేసే ట్రాప్ లో చిక్కుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఈ హైడ్రోపోనిక్ గంజా ఇచ్చే మత్తు భారీగా ఉంటుందని.. ఇందులోని టీహెచ్ సీ – టెట్రాహైడ్రోకానబినాల్ మత్తును ఇస్తుంది. సాధారణ గంజాయితో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయిలో టీహెచ్ సీ 30 శాతం అధికంగా ఉండటంతో మత్తు ఎక్కువగా ఉంటుంది. ఈ గంజాయితోనే హాష్ఆయిల్.. హాషిష్ ను తయారు చేస్తుంటారు. అధిరక టీహెచ్ సీ శాతం ఉండే హైడ్రోపోనిక్ గంజాయి మొక్కల నుంచి తీసే హాష్ ఆయిల్.. హాషిస్ మత్తు ఎక్కువగా ఉండటంతో పాటు.. దీని ఖరీదు కూడా కిక్ ఎక్కించేలా ఉండటంతో ఈ దుర్మార్గపు బాట పట్టిన పలువురు అడ్డంగా బుక్ అవుతున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా గంజాయిని భారీగా పట్టుకుంటున్నారు పోలీసులు.

# చురకలు సంపాదకీయం

## నవంబరు 1 నుంచి బ్యాంకుల్లో కీలక మార్పులు

మారుతున్న కాలానికి తగ్గట్లు మార్పులు చేసుకోవటమే కాదు.. ఏళ్లకు ఏళ్లుగా ఎంతో మంది బ్యాంకు ఖాతాదారులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలకు పరిష్కారాన్ని చేపేలా నిర్ణయం తీసుకోవటమే కాదు.. వాటి అమలు నవంబరు 1 నుంచి షురూ కానుంది. ఇప్పటివరకు బ్యాంకు ఖాతాదారుడికి జరగరానిది జరిగినప్పుడు ఆ ఖాతాను సెటిల్ చేసే విషయంలో వారసులకు పెద్ద సవాలుగా ఉండేది. లాకర్ ఉంటే అది మరింత పెద్ద సమస్య. నవంబరు ఒకటి నుంచి ఈ తరహా కష్టాలకు చెక్ పెట్టేలా నిర్ణయాలు తీసుకోవటం తెలిసిందే. ఈ మార్పులకు సంబందించి బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టం 2025ను ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది. ఇంతకూ మరో నాలుగైదు రోజుల్లో బ్యాంకులకు సంబంధించి వచ్చే మార్పులు ఏమిటన్న విషయంలోకి వెళితే.. – ఇప్పటివరకు బ్యాంకు ఖాతాకు ఉండే నామినీల సంఖ్యకు నాలుగుకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నలుగురిని ఒకేసారి లేదంటే ఒకరి తర్వాత ఒకరు చొప్పున నామినేట్ చేయొచ్చు. ఈ మార్పు కారణంగా జరగరానిది జరిగితే సెటిల్ మెంట్ తేలిక కానుంది. కాబట్టి.. బ్యాంకు ఖాతాలు ఉన్న వారు ఎవరైనా సరే.. తమ నామినీల సంఖ్యను పెంచేసుకోవచ్చు. – లాకర్ల.. సేఫ్ కస్టడీలోని వస్తువులకు సంబంధించిన విషయంలోనూ నామినేషన్ కు అవకాశం ఉంది. బ్యాంక్ ఖాతాదారుడు ఇచ్చిన వరుస క్రమం ప్రకారం మాత్రమే నామినీలకు లాకర్లను నిర్వహించే అధికారం ఉంటుంది. – బ్యాంకు ఖాతాదారుడు తన డిపాజిట్ లేదంటే లాకర్ లోని వస్తువుల్లో ఏ నామినీకి ఎంత మొత్తం (ఎంత శాతం) చెల్లించాలన్న విషయాన్ని ముందే బ్యాంక్ కు తెలియజేసే వీలుంది. అయితే.. ఇది నలుగురికి మాత్రమే పరిమితం అవుతుంది. – కొత్త నిబంధనలతో క్లెయిమ్ ల పరిష్కార ప్రక్రియ వేగంగా పారదర్శకంగా జరగనుంది. క్లెయిమ్ ల పరిష్కారంలో అలసత్వం.. వివాదాలకు చెక్ పడనుంది. కొత్త చట్టం ప్రకారం నామినేషన్ల కోసం ఒకే అప్లికేషన్ ను ఫాలో అవుతాయి. దీంతో.. డాక్యుమెంటేషన్ తేలిక కానుంది. – జాయింట్ బ్యాంకు ఖాతాల విషయానికి వస్తే.. పరస్పర అంగీకారంతో నామినీ వివరాల్ని ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకునే వీలుంది. దీని కారణంగా ఖాతాదారుడికి జరగరానిది ఏమైనా జరిగినా క్లెయిమ్ సెటిల్ మెంట్ ఈజీ అవుతుంది. – బ్యాంకులు సైతం ఈ మార్పులను తప్పని సరిగా ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే రికార్డుల్ని అప్డేట్ చేయాల్సి ఉంటుంది. దీంతో మానవ తప్పిదాలకు అవకాశం ఉండదు. బ్యాంకుల మీద జవాబుదారీతనం కూడా పెరుగుతుంది.

# భగవత్ స్వరూపం... ఉసిరి

హిందూ దేశంలో ఏటా జరుపుకునే పబ్బాలలో, పండగలలో ఒక్కొక్కనాడు ఒక్కో వృక్ష పూజ ఆచరణలో ఉంది. బిల్వపత్రం, శమీ వృక్షం, ఆమ్ర పుష్పం, అలాగే అమలక ఫల వినియోగం చేయడం సాంప్రదాయ సిద్ధంగా వస్తున్నది. కార్తీకం నుండి చైత్రం వరకు ఆరు మాసాలలో అమలకిని పచ్చిదానిని ఏదో విధంగా వాడాలని పెద్దల నిర్దేశం. ఏడాదిలో వచ్చే ఏకాదశులు విష్ణువు చర్యలను బట్టి శయనైకాదశి, పరివర్తనైకాదశి, ప్రబోధిన్యేకాదశి, వ్రత నియమాలను బట్టి నిర్జలైకాదశి, ఫలైకాదశి, వీర పూజనాన్ని బట్టి భీష్మైకాదశి, ఇంద్రికాదశి ఏర్పడగా, ఒక "పండు" (ఉసిరిక)తో సంబంధించి ఏర్పడింది ఒక్క అమలకి ఏకాదశి మాత్రమే. స్మృతి కౌస్తుభం, కృత్యసార సము చ్చయం, తిథితత్వం మున్నగు గ్రంథాలు కార్తీక మాసంలో అమలకి వృక్ష మూలాన ఉసిరిక కాయలతో, ఉసిరిక పత్రితో దైవారాధన చేయాలని, తులసితో పాటు కాయతో ఉసిరిక కొమ్మను పూజించాలని, ఉసిరిక చెట్టు నీడన అన్నం వండాలని, ఉసిరిక పండ్లు కలిపిన నీటితో స్నానం చేయాలని, పూర్ణిమ నాడు ఉసిరిక ఫల దానం చేయాలని, శిరస్సు, ముఖం, హస్తం, దేహమందు ఉసిరిక పండు ధరించాలని వివరిస్తున్నాయి. ఉసిరిక చెట్టు నీడ సోకే కొలనులో స్నానం చేయాలని, ఉసిరిక మాని కింద అరుగు మీద ఆవాసం, పూజ, భోజనం చేయాలని పెద్దల ఉవాచ. అలాగే ఫాల్గుణ మాసంలో మళ్ళీ ఉసిరిక వినియోగం ఉంది. "అమలకే వృక్షే జనార్ధనః అని అమదేర్ జ్యోతిషి మున్నగు గ్రంథాలు పేర్కొంటు న్నాయి. అమలక వృక్షం జనార్ధన స్వరూపమని, దాని కింద ఏకాదశి వ్రతాన్ని ఆచరించాలని ఫాల్గుణ శుక్ల ద్వాదశి నాడు అమలకీ వ్రతం చేస్తారని చతుర్వర్గ చింతామణి తెలుపుతున్నది. సంస్కృతంలో అమలకానికి గల పర్యాయ అమలకం గుణమును ధరించునదిబీ పదాలు... రాత్రి దాది వంటిదిబీ వయస్థ – వయస్సున నిలుపునది, ఫలరవ సారవంత మైనది. అమృత అమృతం వంటిది. శీతఫలి– శీతవీర్యము కలది. ప్రాణమును నిలుపునది కనుక ఉసిరికాయ అను నది సార్ధక నామమని కొందరి భావన. ఒక పేద ఇల్లాలు ఉసిరి కాయలు భిక్ష పెట్టగా, ఆది శంకరులు కనకధారా స్తవం చెప్పి బంగారు ఉసిరికాయల వర్షం కురిపించారని చెపుతారు. ఇక వైద్యోపయోగానికి వస్తే..షడ్రసాల్లో ఉప్పు తప్ప మిగతా అన్ని రసాలు దీనిలో ఉన్నాయి. ఇది మహత్తర ఓషధీ గుణం కలది. అమృతా ఫలమనే గ్రంథంలో దాని ఔషధీ గుణాలు, ఫల జాతులు గ్రంథంలో సర్వాంగాల యొక్క వైద్య, పారిశ్రామిక ఉపయోగాలు, వాగ్భ టంలో దీని రసాయనిక, కాయకల్పాది చికిత్స ఉప యోగాలు విపులీ కృతమై ఉన్నాయి. "కరతలామల కము"




అనేసామెత తెలియని వారుండరు. అనగా అరచేతిలోని ఉసిరికాయ. ప్రాచీన ఆర్యజ్యోతిర్వి ద్వాంసులు ఉసిరి కాయను భూగోళమునకు ఉపమగ చూపించారు. అంటే అరచేతి అమలకము వలె గోళ సర్వస్వమును తెలుసుకున్న వారైనట్లు చెప్పారు. విషయ పరిజ్ఞానం సంపూర్ణంగా ఉంటే కరతలా మలకమనే సామెతను ఉపయోగిస్తారు. సర్వ ప్రపంచ సదృశమై, భగవత్ స్వరూపమై ఉన్నందనే ఆమలకము దానమునకు ముఖ్యముగా వ్యవహరించ బడుతున్నది.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**


# ప్రకృతి వైపరీత్యాల పై అవగాహన అవసరం - 1971 అక్టోబర్ 29... విషాదం మిగిల్చిన ఒడిషా తుఫాను సంఘటన

1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకులం చేసిన తుఫాను, ప్రకృతి ప్రతాపానికి నిదర్శనంగా మిగిలింది. ఈ తుఫాను అత్యంత శక్తిమంతమైనదిగా పరిగణించ బడుతుంది. అధిక వేగంతో వీచిన గాలులు, భారీ వర్షాలు, తీరప్రాంతాల్లో భారీ అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వేల మంది మృతి చెందగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వ్యవసాయ భూములు, ఇళ్ళు, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తీరప్రాంత వృక్షసంపద, జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, పునర్నిర్మాణానికి ఎంతో కాలం పట్టింది. ఆర్థిక నష్టం అంచనాకు అందనిది. 1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకుతలం చేసిన తుఫాను భారత దేశంలో ప్రకృతి వైపరీత్యాల ప్రతాపాన్ని చాటిచెప్పింది. ఈ తీవ్ర తుఫాను వల్ల ఊహాతీత విధ్వంసం జరిగింది. తుఫాను ఉప్పెన ఒడిశా తీరంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది, 10,000 మందికి పైగా మరణించారు. 50,000 పశువులు చని పోయాయి. వందల వేల చెట్లు నేలకూలాయి. తుఫాను 800,000 కంటే ఎక్కువ ఇళ్లను ధ్వంసం చేసింది. రోజుల తరబడి కమ్యూనికేషన్లు, విద్యుత్ లైన్లు తెగిపోవడంతో విపత్తు వార్త బయటి ప్రపంచానికి అందకుండా చేశారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయి, లక్షలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ తుఫానుతో భారీ వర్షాలు, 300 కి.మీ.ల వేగంతో వీచిన గాలులు, తీరప్రాంతాల్లో అతిపెద్ద అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వ్యవసాయ భూములు, ఇళ్ళు, తీరప్రాంతంలో ఉన్న వృక్ష సంపద, జీవవైవిధ్యం తీవ్రంగా నష్టపోయాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ ఈ తుఫాను ప్రభావం నుంచి కోలుకోవడానికి సంవత్సరాల సమయం పట్టింది. ఈ సంఘటన అనంతరం, విపత్తుల నిర్వహణలో ముందస్తు చర్యలు, అవగాహన,



పునర్నిర్మాణ ప్రణాళికలు ఎప్పటికప్పుడు మున్ముందుకు రావాల్సిన అవసరం స్పష్టమైంది. ప్రకృతి వైపరీత్యాలు అంటే ప్రకృతి సృష్టించే భారీ సంఘటనలు, ఇవి పర్యావరణాన్ని, జీవ సారాన్ని, ప్రజల ఆస్తి, ప్రాణాల్ని ప్రభావితం చేస్తాయి. తుపానులు, వరదలు, భూకంపాలు, సునామీలు, కరువు, అగ్నిపర్వతాలు వంటి విపత్తులు మనకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు కాకుండా మానవ చర్యల వల్ల కూడా విపత్తులు సంభవిస్తాయి. ఉగ్రవాదం, యుద్ధాలు, అణు బాంబులు, పరిశ్రమల కాలుష్యం వంటి మానవ నిర్మిత విపత్తులు మన భద్రత, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారడంతో పాటు, పర్యావరణాన్ని కూడా నాశనం చేస్తాయి. భారతదేశంలో ప్రకృతి వైపరీత్యాలు తరచూ సంభవిస్తూనే ఉన్నాయి. ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్ ప్రకారం గత మూడున్నర దశాబ్దాల్లో భారత్‌లో దాదాపు 431 రకాల ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఈ విపత్తుల వల్ల 1,43,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 15 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావానికి గురయ్యారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఈ విపత్తుల కారణంగా భారతదేశ జాతీయ ఆదాయంలో ఏటా సుమారు 2.25 శాతం నష్టం సంభవిస్తోంది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం, 20 సంవత్సరాల కాలంలో ప్రకృతి వైపరీత్యాలు భారతదేశంలో సుమారు 7,950 కోట్ల డాలర్ల నష్టాన్ని కలిగించాయి. ప్రకృతి విపత్తులను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు సన్నాహాలు మరియు విపత్తు నిర్వహణ ద్వారా వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చు. సహాయ చర్యలను మరింత సమర్థంగా అమలు చేయడానికి ప్రజలలో అవగాహన పెంపొందించాలి. విపత్తుల నిర్వహణ కోసం పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు కలిసి ముందడుగు వేయాలి. విపత్తులకు ముందుగానే పునరుద్ధరణ ప్రణాళికలు తయారు చేయడం, ప్రజలకు శిక్షణ ఇచ్చి అప్రమత్తం చేయడం వంటి చర్యలు అవసరం. ప్రపంచవ్యాప్తంగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలు ప్రకృతి పరిరక్షణకు అనేక విభాగాలను అమలు చేస్తుంది. 1991లో భారత ప్రభుత్వం ఈ నిబంధనలు అమలులోకి తెచ్చింది. ఈ నిబంధనలు తీరప్రాంతాలలో నిర్మాణం, పరిశ్రమలు వంటి కార్యక్రమాలకు నిరోధం కల్పిస్తాయి. కానీ, అభివృద్ధి పనుల పేరుతో మడ అడవులు, హరిత వనాలు వంటి ప్రకృతి వనరులను విచ్ఛిన్నం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిర్దిష్ట బడ్జెట్ కేటాయించి, నష్టం అంచనాలలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రకృతి వనరులను కాపాడవచ్చు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు విపత్తు నిర్వహణపై దృష్టి సారించాలి. తీరప్రాంతాలలోని మడ అడవులు, చిత్తడి నేలలు, హరిత వనాలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల నివారణకు తగిన నిధులను సమకూర్చడం, గ్రీన్ కవర్ ను పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం వంటి చర్యలు అత్యవసరం. **రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**


# అక్కినేనిని సినీ బాట పట్టించిన బలరామయ్య - అక్టోబర్ 29...ఘంటసాల బలరామయ్య వర్ధంతి



ఒక వ్యక్తిని చూడగానే మంచి నటునిగా ఎదిగగల లక్షణాలు ఉన్నాయని నిర్ణయించడంలో సిద్ధహస్తులు ఘంటసాల బలరామయ్య. అలా ఆయన తీసుకున్న నిర్ణయంతో తెలుగు సినిమా ప్రపంచం ఒక గొప్ప మహా నటుడిని పొంద గలిగిన నేపథ్యం మరువ లేనిది. ఆయనే నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. 1947లో బలరామయ్య ఒక రైల్వే ప్లాటిఫారం మీద కనిపించిన వ్యక్తిని చూసి చూడగానే ఆయనకు చిత్ర సీమలో బంగారు భవిష్యత్తు ఉందని ఊహించి, అందించిన ప్రోత్సాహం అక్కినేని జీవితాన్ని మలుపు తిప్పిన క్రమం అది. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించి చిరస్మరణీయ సంఘటనగా నిలిచి పోయింది. అలా అక్కినేని నాగేశ్వర రావు వంటి మహా నటుడి, నట జీవితానికి పునాది వేసిన వ్యక్తి ఘంటసాల బలరామయ్య. అక్కినేని నాగేశ్వరరావు క "సీతారామ జననం" (1944), ద్వారా తెరయోగం కలిగించడమే కాకుండా, ఎ.యన్.ఆర్ .కు వెంటనే రెండవ చిత్రం రావాలని పని గట్టు కొని వేరొక దర్శకుని చుట్టూ తిరిగిన సహృదయులు ఆయన. పౌరాణిక చిత్రాలతో మొదలుపెట్టి, జానపద, సాంఘిక చిత్రాలను, చారిత్రక చిత్రాలను, ఎంతో వ్యయ ప్రయాసలతో నిర్మించి, విజయ వంతమైన చిత్రాల నిర్మాతగా, దర్శకునిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ప్రత్యేకత సాధించిన ఘంటసాల బలరామయ్య. ఘంటసాల బలరామయ్య (జూలై 5, 1906 – అక్టోబరు 29, 1953) తెలుగు సినిమా నిర్మాత, దర్శకులు. 1906, జూలై 5న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, నెల్లూరు జిల్లా పొట్టెపాలెం గ్రామంలో జన్మించారు. నాటక రంగంలో ప్రసిద్ధులైన బలరామయ్య సోదరులు రాధాకృష్ణయ్య ప్రోత్సాహంతో వీరికి రంగస్థల అనుభవం కలిగింది. అన్నదమ్ములిద్దరూ 1933లో కలకత్తా వెళ్ళి చిత్రరంగంలో అడుగు పెట్టారు. శ్రీరామా ఫిల్మ్స్, కుబేరా పిక్చర్స్ అనే కంపెనీలు పెట్టి 1936లో సతీ తులసి, 1938లో మార్కండేయ, 1940లో మైరావణ చిత్రాల్ని నిర్మించారు. 1940లో ప్రతిభా పిక్చర్స్ సంస్థను నెలకొల్పి పార్వతీ కళ్యాణం సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తరువాతి కాలంలో చిత్ర నిర్మాణం, దర్శకత్వం రెండు నిర్వహిస్తూ గరుడ గర్వ భంగం (1943), సీతా రామ జననం (1944), ముగ్గురు మరాఠీలు (1946), బాలరాజు (1948), శ్రీ లక్ష్మమ్మ కథ, స్వప్న సుందరి, చిన్న కోడలు (1952) మొదలైనవి తయారు చేశారు. 1944లో నిర్మించిన సీతారామ జననం చిత్రం ద్వారా అక్కినేని నాగేశ్వరరావు, తర్వాత అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు లను తెలుగు చిత్రసీమకు పరిచయం చేశారు. 1948లో నిర్మించిన బాలరాజు సినిమా సాటిలేని విజయాన్ని అందించింది. ప్రతిభా పిక్చర్సు అధినేత ఘంట సాల బలరామయ్య ఎ.ఎన్. ఆర్. తో నిర్మించిన జానపద చిత్రం ముగ్గురు మరాఠీలు విజయవంతం కావడంతో తదుపరి ప్రయత్నంగా 1948 లో అక్కినేని, ఎస్.వరలక్ష్మి, అంజలీదేవి ప్రధాన భూమికలుగా నిర్మించిన చిత్రం బాలరాజు. అంతవరకు తన పాత్రలకు తనే పాడిన నాగేశ్వరరావు ఈ చిత్రం నుండీ ఘంటసాలనే తనకు నేపథ్య గాయకునిగా పాడమనటం జరిగింది. ఘంటసాల ఆయనకు పాడిన తొలిపాట "చెలియా కనరావా". తొలినాట ఎస్.వరలక్ష్మి నటిగానే కాక, నేపథ్యగాయనిగా ఉండేవారు. ఈ చిత్రంలో ఎక్కువ భాగం పాటలు ఆమెవే. అయితే, ఆ చిత్రంలో ఒకే ఒక పాట, అది ఘంట సాలతో "నవోదయం నవోదయం" అనే యుగళ గీతం పాడిన మరొక నేపథ్య గాయని వక్కలంక సరళ. తోటివారిలో పోటీపడి శ్రీ లక్ష్మమ్మ కథ చిత్రాన్ని కేవలం 19 రోజులలో నిర్మించి విడుదల చేశారు. తెలుగు సినీ రంగానికి వెలలేని సేవలందించిన అయన 1953, అక్టోబరు 29 అర్థరాత్రిన గుండె పోటుతో పరమ పదించారు. ఆ సమయంలో ఆయన రేచుక్క చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆ చిత్రాన్ని పి.పుల్లయ్య పూర్తి చేశారు. ఆయన అందరూ అభివృద్ధి చెందాలని, సుఖంగా జీవించాలని కోరుకొనే వారు. ఎన్నో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన మనుమడు ఎస్.ఎస్. తమన్ సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు. **రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# సరిహద్దులు లేని సామాజిక మాధ్యమాలు

సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ, నిత్య నూతన ఆవిష్కరణలు చోటు చేసుకుం టున్న తరుణంలో ప్రచార ప్రసార మాధ్యమాలలో విప్లవాత్మక మార్పులు క్షణక్షణం జరుగు తున్నాయి. వాటన్నిటి కన్నా ప్రస్తుతం నిరక్షర గ్రామీణుల నుండి నిరంతర పరిశోధకుల వరకు చేతిలో అందుబాటు లోకి వచ్చాయి. అధునాతన సెల్ ఫోన్లు, వాటి ద్వారా ప్రధాన స్రవంతిలోని మీడియాను మించి సోషల్ మీడియా పని చేయడం సర్వత్రా కనిపిస్తున్నది. చేతిలో సెల్ ఫోన్ లేకుండా, పొద్దున లేచింది లగాయతు, రాత్రి నిద్రించే వరకు, సోషల్ మీడియాలో నిమగ్నం కాని వారు ఉంటారా అన్నది సందేహాత్మకమే. సోషల్ మీడియా అంతగా ప్రభావం చూపుతున్న ఈ రోజులలో ఎన్నికల సంబంధ అంశాలు, వేగవంత ప్రచారాలకు, సమాచార చేరవేతలకు సామాజిక మాధ్యమాల పాత్ర ఆద్వితీయం, అపూర్వం, అసమానమైంది. గతంలో ఎన్నికలు వస్తున్నాయన గానే గ్రామ గ్రామాన గోడమీద రాతలు ప్రత్యక్ష మయ్యేవి. కాగితాలపైన, ఆపై ప్రింటింగ్ ప్రెస్ ద్వారా ముద్రితాలైన అభ్యర్థుల వివరాలు, వీలేతై ఫోటోలు, ఎన్నికల గుర్తులతో ఇంటింటికీ తలుపులపై, ఆపై జన సమ్మర్ద అనుకూల ప్రదేశాలలో అతికించ బడేవి. తర్వాతి కాలంలో బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, కటౌట్లు, కర పత్రాలు, గోడ పత్రికలు, ఎన్నికల వాగ్దానాల, హామీలతో కూడిన బ్రోచర్లు. అన్ని వనరుల వినియోగం ప్రచారానికి ఉపయోగించడం ఆచరణలోకి వచ్చింది, ఇటీవలి కాలంలో ఎన్నికలలో వీటికి తోడు రికార్డెడ్ వాయిస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలకు అభ్యర్థులు స్వయంగా తమ విజ్ఞప్తులను వినిపించడం జరిగింది. ప్రసార మాధ్యమాలలో స్క్రోలింగ్ లు, యాడ్స్, జన ప్రవంతిలో గల వివిధ పత్రికల పెయిడ్ ఆర్టికల్స్ ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహింప బడేవి. రానురాను ఎన్నికల కమిషన్ దృష్టి అధికమవు తుండడం, శాసన సభలో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల వ్యయంకు సంబంధించి ఖచ్చితమైన నిబంధన లుండడం, నిర్ణీత ఖర్చుకు సంబంధించి, లక్ష్మణ రేఖ దాటినట్లు రుజువైతే, గెలిచినా పదవి పోవడం ఖాయమని, ఖచ్చితమైన పాటింపులు ఉండడంతో అభ్యర్థులు, వారి అనుచరులు, అభిమానులు, ప్రత్యర్థులు, వారి అనుచర గణాలు, ప్రత్యామ్యాయాలపై దృష్టి పెడు తున్నారు. ఆ లోపునే ఖర్చు చేయడమే కాక నామినేషన్ వేసినప్పటి నుంచి ప్రతిపైసాకు తప్పని సరిగా లెక్క చూపాల్సిందే. అలాగని ఎక్కువ ఖర్చు చేసినా తక్కువ చూపితే సరిపోదు. అభ్యర్థులు వినియోగించే ప్రచార సామగ్రి, ప్రచారానికయ్యే ఖర్చులను, వెంట వచ్చే మద్దతు దారులు, కార్యకర్తలకు టీలు, టిఫిన్లు తదితరమైన వాటికి మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయిస్తారు. నేటి సమాజంలో ఎన్నికల్లో బాగా ఖర్చు పెట్టగల వ్యక్తులను మాత్రమే పార్టీ అభ్యర్థులుగా ఎంపిక అవుతున్నారు. అవినీతి కూడా కొలమానంలో లేకుండా పోతోంది. దీన్ని కప్పి పుచ్చెందుకు, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా క్షణాలలో వేలాది మందికి గ్రూపుల ద్వారా పోస్టులు శరవేగాన్ని సవాలు చేస్తూ వెళుతున్నాయి. ఎన్నికలకు 48 గంటలకు ముందుగా ప్రచారం చేయకూడదు. ప్రచార రూపంలో ఎస్ఎంఎస్‌లు కూడా నిషేధ మని నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అయినా ప్రధానంగా సాంప్రదాయక ప్రసార, ప్రచార సాధనాలకు పరిమితులు ఉండి, ఉన్నదున్నట్లు ప్రచురించే, ప్రసారం చేసే అవకాశాలు లేని, రాయడానికి, మాట్లాడడానికి వీల్లేని, నిఘంటువు లలో చోటు చేసుకోని, అసభ్య, అమానుష, అప్రజాస్వామిక భాష రాజ్య మేలుతున్న స్థితిలో సామాజిక మాధ్యమాలు అడ్డూ, అదుపూ లేని నేరుగా, వీడియో, ఆడియో రికార్డింగులు, మార్ఫింగులు, ఉ



న్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్టుగా, వెనువెంటనే సెల్ఫోన్ల ద్వారా గమ్యాలకు చేరుస్తున్నాయి. పొగడ్తలూ, తెగడ్తలూ, సత్, దుష్ప్రచారాలు తేడా లేకుండా, అస్మదీయుల, తస్మదీయులనే భేదాలు లేకుండా ఇష్టారాజ్యంగా వైరల్ అవుతున్నాయి. పైగా ఎవరి స్వాధీనంలో లేని, పైసా ఖర్చుకాని, నియంత్రణ ఊసే కానరాని సదరు మాద్యమాల ద్వారా జరుగుతున్న పోస్టింగుల ప్రచార పరంపరనే ప్రస్తుతం ఎన్నికలలో ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నాయి. తామే ఉద్యమాలను, ప్రభుత్వాలను నడిపిస్తున్నామని, ఎవరు గెలవాలో, ఎవరు ఓడలో తమ నిర్ణయానుసారమే జరుగుతుందని భావించే, భ్రమించే, ఆత్మ వంచన చేసుకునే పార్టీల మానస పుత్రికలైన పత్రికలకు, ఛానళ్ళకు సమాంతరాలుగా సామాజిక మాధ్యమాలు పని చేస్తున్నాయి.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# సేవ సమ్మేళనాలు

జమ్మికుంట : ప్రస్తుతం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ట్రెండ్‌గా మారాయి. చదువు పూర్తిచేసుకుని జీవితంలో స్థిరపడిన వారు ఒక చోట చేరి గురువులను సన్మానిస్తున్నారు. కానీ వీరు మాత్రం ఒక అడుగు ముందుకేసి పాఠాలు నేర్పిన బడులు, కళాశాలల్లో సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఓ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తుండగా.. ఓ పూర్వ విద్యార్థి పాఠశాలకు నేనున్నానని అండగా నిలుస్తున్నారు.

**ఆర్థిక సాయం అందజేస్తూ..**

మూడేళ్లుగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థులు ఆటల్లో రాణించేలా సుమారు రూ.లక్షకు పైగా వ్యయంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కచ్చుకాయల మహేశ్. రెండేళ్ల క్రితం విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల మాదిరి ఏకరూప దుస్తులకు రూ.35 వేల ఆర్థికసాయం చేశారు. స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాల సమయాల్లో ఆటలు, సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నారు. ఇటీవల రూ.20 వేల విలువ చేసే క్రీడా దుస్తులు అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారానికి రెండు పర్యాయాలు రూ.7 వేలతో పాటు.. బడికి వాలీబాల్ సామగ్రి ఇచ్చారు. తరగతి గదులలో విద్యుత్తు సరఫరా వైరింగ్ చేయించారు. ముమ్ముందు విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాననే హామీ ఇసున్నారు.



**మధ్యాహ్న భోజనం అమలు చేస్తూ..**

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పూర్వ విద్యార్థి బచ్చు భాస్కర్ దాతృత్వాన్ని చాటుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వచ్చేవారికి చేయూత ఇచ్చేందుకు రోజూ మధ్యాహ్న భోజనం పెట్టేందుకు ముందుకొచ్చారు. గత విద్యా సంవత్సరంలో అమలు చేసిన ఈ కార్యక్రమం నేటికి కొనసాగుతోంది. కళాశాలకు చెందిన మరో పూర్వ విద్యార్థి ముక్కా శివకుమార్ చేయూతతో ఏర్పాటుచేసిన నీటి ప్లాంట్, శీతలీకరణ యంత్రంతో తాగునీటి సౌకర్యం ఏర్పడింది. మధ్యాహ్న భోజనం పథకంలో రోజూ విభిన్న రకాల ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించడం విశేషం. నెలకు రూ.60వేలు ఖర్చు అవుతుందని దాత చెప్పారు.

# అప్రమత్తతే రక్ష

తిమ్మాపూర్ : గ్రామీణ ప్రాంతాలలో నిర్లక్ష్యం, అజాగ్రత్తలతో చాలా మంది పాము కాటుకు బలవుతున్నారు. పొలం పనుల్లో ఎందరో అన్నదాతలు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇంటి ఆవరణల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, పాత సామాన్లను అస్తవ్యస్తంగా పడేసి, పట్టించుకోకపోతే పాములు, కీటకాలు, విష పురుగులు చేరి వాటిని ఆవాసంగా మార్చుకుంటాయి. మనం అజాగ్రత్తగా ఉన్న సమయంలో దాడి చేస్తాయి. చిన్నచిన్న పురుగులు కూడా ఇంట్లోకి ప్రవేశించకుండా జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం ప్రమాదాలకు ఓ కారణమే. వీటిని అరికట్టాలంటే అప్రమత్తత, జాగ్రత్త చర్యలే కీలకం.

**కాటు వేసిన వెంటనే చేయాల్సింది..**

కరిచిన భాగాన్ని కదిలించకూడదు

కాటు పైభాగాన మెత్తటి వస్త్రంతో కొంచెం బిగువుగా, నెమ్మదిగా కట్టాలి బాధితుడి ఒంటిపై బిగువుగా ఉండే ఆభరణాలు తేసేయాలి

కరిచిన చోట నోటితో రక్తాన్ని పీల్చకూడదు. పీల్చిన వారికి హాని కలిగే అవకాశం ఉంది

బాధితుడితోపాటు పక్కనున్న వారు కూడా ఆందోళన చెందకూడదు. అలా చేస్తే రక్తపోటు పెరిగి విషం త్వరగా శరీరమంతా వ్యాపిస్తుంది. కుట్టిన వెంటనే 20 నిమిషాల్లోపు సమీప ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సనందించాలి విష పురుగులు ఇంట్లోకి రావడానికి కారణాలు..

ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు, పనికి రాని సామాన్లు, రాళ్లురప్పలు, చెత్తాచెదారాలు ఉండటం

ఇంట్లో ఎలుకలు, కప్పలు, క్రిమికీటకాలు లేకుండా చర్యలు తీసుకోకపోవడం (వాటి కోసం పాములు వస్తాయి)

ఇంటి తలుపులకు రక్షణ జాలీలు ఏర్పాటు చేసుకోకపోవడం

చెరువులు, జలాశయాలకు సమీపంలో జాగ్రత్త చర్యలు తీసుకోకుండా జీవించడం (పాములు, కీటకాల ఆవాసాలు)

ఇళ్ల సమీపంలో పుట్టలు, తదితరాలు ఉండటం

పొలాల్లో, గట్లపై, ఇంటి ఆవరణలో, పెరట్లో ఎక్కువగా ఉండే గడ్డి

## కట్టు కాలువ.. మాయమవుతోంది గుట్టుగా!

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో ఇళ్ల స్థలాల ధరలు రోజురోజుకు పెరిగిపోవడంతో కొందరు కాలువను కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో విశాలమైన కాలువ కుంచించుకుపోతోంది. భారీ వర్షాల సందర్భంలో వరదనీరు ముందుకు సాఫీగా వెళ్లలేని దుస్థితి ఏర్పడి సమీప ఇళ్లను, ఖాళీ స్థలాలను ముంచెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్, నీటి పారుదల శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

**ఇదీ సంగతి**వేములవాడ పట్టణ శివారులోని మల్లారం రోడ్డులోని కట్టుకాలువ కోనాయిపల్లి శివారు నుంచి మల్లారం రోడ్డు దాటుతూ వంకలు తిరుగుతూ మాజీ ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్ సమీపం వరకు వెళ్లి మూలవాగులో కలుస్తుంది. ఈ కాలువ పట్టణానికి సమీపంలో ఉండటంతో కాలువ వెంబడి ప్లాట్ల యజమానులు కాలువను కబ్జా చేస్తూ ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు.

పట్టణ శివారు ప్రాంతాల్లో గుంట స్థలానికి రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు ధర పలుకుతోంది. దీంతో కాలువ స్థలాన్ని ఆక్రమిస్తూ రాయితో, సిమెంటు మిక్సర్‌తో గోడలు నిర్మించి కబ్జా చేస్తున్నారు. ఫలితంగా దాదాపు పది గజాలకు పైగా వెడల్పున్న కాలువ ఇరువైపులా ఆక్రమణలతో సగానికిపైగా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**గతంలో తొలగించినప్పటికీ..**మల్లారం రోడ్డులోని కాలువ వద్ద గతంలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించి నిర్మాణాలకు తొలగించారు. కట్టుకాలువ వద్ద సిమెంట్ పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపడితే ఆ పిల్లర్లతోపాటు ఇతర నిర్మాణాలను సైతం తొలగించారు. కానీ రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు పూర్తి చేసి విలువైన స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. దాదాపు ఐదారు ప్రాంతాల్లో కాలువను ఇళ్ల యజమానులు ఆక్రమించి భారీ గోడలు నిర్మించినా పట్టించుకునే నాథుడే లేడని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు కాలువ వెంబడి ఆక్రమణలను తొలగించి విలువైన స్థలాన్ని రక్షించాలని కోరుతున్నారు.

**పరిశీలించి చర్యలు– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ**

కాలువ కబ్జా చేసి చేపట్టిన అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తాం. విచారణ అనంతరం అక్రమ నిర్మాణాలుగా తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలోనే అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగించాం.

# కట్టెల పొయ్యి.. బోరు నీరు!




కరీంనగర్ : జిల్లాలోని సర్కారు బడుల్లోని మధ్యాహ్న భోజనం చాలా చోట్ల మెరుగైనా.. వసతుల లేమితో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంట గదులున్నా చోట అవి ఇరుకుగా ఉండటం, మరికొన్ని చోట్ల లేకపోవడంతో ఆరుబయట వండుతున్నారు. విద్యాశాఖ సూచించిన మెనూ కొన్ని చోట్ల మాత్రం అమలు కావడం లేదు. ట్యాంకుల్లో నిల్వ చేసిన నీటిని, బోరు నీటిని వంటలకు ఉపయోగిస్తున్నారు. కట్టెల పొయ్యిలపై వంట చేస్తుండటంతో నిర్వాహకులు, విద్యార్థులు పొగతో ఇబ్బందిపడుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు అందించాలనే విషయం ప్రతిపాదన దశలోనే ఉండిపోయింది. మెస్ బిల్లులు పెంచని కారణంగా నాణ్యత కొరవడుతోంది.

**కూరగాయలతో సాంబారు**

1. పేరు : చొప్పదండి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల
2. బియ్యం ఎలా ఉన్నాయి: బాగున్నాయి
3. వంటకు ఏ నీటిని ఉపయోగించారు: బోరు నీటిని వాడుతున్నారు.
4. వంట గది ఉందా. పరిసరాలు ఎలా ఉన్నాయి: వంట గది ఇరుకుగా ఉండటంతో ఆరు బయట చెట్ల కింద వంట చేశారు.
5. మెనూ పాటించారా : కూరగాయలతో సాంబారు చేశారు. కోడి గుడ్డు వడ్డించారు.
6. గ్యాస్ ఉపయోగించారా? : కట్టెల పొయ్యి మీద వండారు. వంట గ్యాస్ కనెక్షన్ లేదు.

**రేకుల షెడ్డులో వంటలు**

1. వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
2. నాణ్యమైన బియ్యం
3. చేతిపంపు నీరు ఉపయోగించారు.
4. వంటగది లేదు. పరిసరాలు అపరిశుభ్రంగా కనిపించాయి.
5. బెండకాయ కూర, గుడ్డు పెట్టారు.
6. కట్టెల పొయ్యి మీద వండారు.

**పొట్టు తీయకుండా గుడ్ల పంపిణీ**

1. హుజూరాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల
2. బియ్యం బాగానే ఉన్నాయి.
3. బోరు, ట్యాంకు నీటిని ఉపయోగించారు.
4. వంట గది శుభ్రంగా ఉంది.
5. సాంబారు, కూరగాయలతో కూర వడ్డించారు. గుడ్డు పొట్టు తీయకపోవడంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు.
6. గ్యాస్, కట్టెల పొయ్యి రెండింటిని ఉపయోగించారు.

**ఎప్పటికప్పుడు పర్యవేక్షణ–** శ్రీరాం మొండయ్య, డీఈవో, కరీంనగర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్, తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ పాటించాల్సిందే. భోజనం విషయంలో ఏమైనా సమస్యలుంటే తనకు, స్థానిక ఎంఈవోల దృష్టికి తీసుకెళితే చర్యలు తీసుకుంటాం.

# సాగు పేరిట.. అక్రమాల బాట



కోరుట్ల ఆర్టీయే పరిధిలో ఇలా..

| అవసరం | ట్రాక్టర్లు | ట్రాలీలు |
|---|---|---|
| వ్యవసాయం | 10,116 | 5,477 |
| వాణిజ్య | 3,336 | 3,086 |

మెట్‌పల్లి : వ్యవసాయ అవసరాల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లను కొందరు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇసుక, మట్టి తరలించే 90 శాతం ఇలాంటివే. సాగు కోసం కొనుగోలు చేసే ట్రాక్టర్లు, ట్రాలీలకు ప్రభుత్వం రహదారి పన్ను(రోడ్ ట్యాక్స్) మినహాయింపునిస్తోంది. వీటిని వ్యవసాయేతర పనులకు వాడటం నిబంధనలకు విరుద్ధం. కొందరు అక్రమ వ్యాపారాలకు వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**పన్ను తప్పించుకునేందుకే..**

వ్యవసాయ అవసరాలకు కొనుగోలు చేసే ట్రాక్టర్లను దున్నడంతో పాటు విత్తనాలు, ఎరువులు, పంట ఉత్పత్తుల తరలింపునకు వినియోగించవచ్చు. ఇతర పనులకు వాడటం నిబంధనలకు విరుద్ధం. వాణిజ్య అవసరాలకు వాడే ట్రాక్టర్, ట్రాలీలకు కలిపి మూడు నెలలకు రూ.950 చొప్పున రహదారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ ట్రాక్టర్లకు తెలుపు, ఇతర వాహనాలకు పసుపు రంగు నంబర్ల ప్లేట్లు జారీ చేస్తారు. అలాగే ఫిట్‌నెస్, బీమా రుసుం కూడా వేర్వేరుగా ఉంటాయి. ఈ పన్నులు తప్పించుకొనేందుకు ఇసుక, మట్టి వ్యాపారులు వ్యవసాయం పేరిట ట్రాక్టర్లు కొనుగోలు చేసి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు.

**పట్టుబడుతున్నా.. చర్యలేవీ?**

ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టుకొని జరిమానా విధిస్తున్నారు. అలా పట్టుబడుతున్న వాటిలో కొన్ని తెలుపు రంగు నంబరు ప్లేట్లవి ఉంటున్నాయి.

ఇలాంటి వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగించాల్సి ఉండగా కొన్ని సందర్భాల్లో తప్ప సమాచారం ఇవ్వడం లేదు. ఆయా శాఖలు జరిమానా వేసి వదిలేస్తున్నాయి.

రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తే డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్‌నెస్, బీమా, రహదారి పన్ను, రిజిస్ట్రేషన్ తదితర పత్రాలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకునే అవకాశముంటుంది. రవాణా శాఖ తనిఖీలూ నామమాత్రంగానే ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ట్రాక్టర్లపై ఇప్పటికైనా దృష్టి సారిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగనుంది. వ్యవసాయం పేరిట కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీలను సాగు అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని కోరుట్ల ఎంవీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. అక్రమ ఇసుక, మట్టి రవాణాకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# పరిధుల వ్యత్యాసం.. ప్రమాదాలకు కారణం


ధర్మపురి : 2024 సెప్టెంబరు 15న జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై పొలాస వద్ద ఓ ప్రైవేట్ బస్సు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొనగా ఓ వ్యక్తి, బాలిక మృతి చెందారు.అదే ఏడాది అక్టోబరులో తుమ్మెనాల స్టేజీ వద్ద కారు, టాటాఏస్ వాహనం ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. వారానికి రెండు మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

తమ పరిధి కాదంటే తమది కాదని రోడ్డు, భవనాలశాఖ వారు కాలయాపన చేస్తుండగా ధర్మపురి– జగిత్యాల–రాయపట్నం రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం 29 కి.మీలు అయినా ఆర్అండ్‌బీ నుంచి నేషనల్ హైవేకి మారడం, తమ పరిధిలో లేదని ఆర్అండ్‌బీ వారు, మరోవైపు తాము కొత్తగా గ్రీన్‌ఫీల్డు దారి వేస్తున్నామని తమకు దీంతో సంబంధం లేదని జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ వారు చెబుతుండటంతో నిర్లక్ష్యానికి గురవుతోంది.

**ప్రస్తుత పరిస్థితి**

మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరికల సిగ్నల్ పూర్తి స్థాయిలో లేవు. అనంతారం, నేరెళ్లగుట్టల వద్ద గత వానాకాలంలో పూర్తి స్థాయిలో లోలెవల్ వంతెనలకు మరమ్మతులు చేపట్టలేదు. నేరెళ్లగుట్ట వద్ద పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ రెండింటినీ ఎత్తైన వంతెనలుగా మార్చడానికి నిధులు విడుదల చేస్తే ప్రమాదాలు తప్పే వీలుంటుందని స్థానికులు భావిస్తున్నారు.

**నిధులు వచ్చి.. వెనక్కి వెళ్లి**



2010లో గ్రీన్‌ఫీల్డు రహదారి ప్రతిపాదనలకు ముందు నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయ రహదారి 63(అప్పుడు ఉండే)ని జగిత్యాల నుంచి మంచిర్యాల వరకు విస్తరించడానికి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదే సమయంలో జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ వారు తాము ఈ రహదారిని స్వాధీనపరుచుకుని ప్రత్యేక రహదారిగా ప్రతిపాదిస్తామని సమ్మతి వ్యక్తం చేయడంతో జాతీయ రహదారి–63 అధికారులు ఆ నిధులను మళ్లించారు. దీంతో వచ్చిన నిధులు వెళ్లిపోయాయి. 2010 నుంచి 2025 మధ్య పలు సర్వేల ద్వారా జాతీయ రహదారి నుంచి గ్రీన్‌ఫీల్డు అలైన్‌మెంట్ మార్చడంతో ఈ రహదారి నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. ఆర్అండ్‌బీశాఖ వారి పరిధిలో ఈ రహదారి లేకపోవడం, జాతీయ రహదారి సంస్థ కొత్త దారిని నిర్మిస్తున్నందున ఇది తమ పరిధిలోనిది కాదని పట్టించుకోవడం లేదు.

# అయిదు తరగతులకు ఒకే పాఠం!

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేట మండలం రాఘవానితండా ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కరే ఉపాధ్యాయురాలు. అయిదు తరగతులకు బోధన చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో ఆమె సెలవు కూడా పెట్టలేని పరిస్థితి. ఇక ఒకే పాఠం అయిదు తరగతుల వారు వినాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 234 పాఠశాలల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది.జిల్లా వ్యాప్తంగా: మెదక్ జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 623. వీటిలోనే అధికంగా 234 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీటిల్లో విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉండడంతో బోధనకు ఒక్కరినే కేటాయించారు. వీటిలో 51 పాఠశాలల్లో పదిలోపే విద్యార్థులు ఉండటం గమనార్హం. మారుమూల ప్రాంతాల్లో ఈబడులు కొనసాగుతుండటం వల్ల విద్యార్థుల సంఖ్య లేకపోవడం వల్ల ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. అయితే ఉన్న విద్యార్థులకు



మాత్రం సరిగా బోధన అందడం లేదు. ఉన్న ఒక్క ఉపాధ్యాయులపై పాఠశాల నిర్వహణ బాధ్యత పడటంతో బోధనకు పూర్తి స్థాయి సమయం దొరకడం లేదు.

**తప్పని ఇబ్బందులు**

ఉపాధ్యాయులకు యూడైస్ ఆన్‌లైన్ పని, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, హాజరు, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు వంటి పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాలలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. బోధన సరిగా సాగక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఉన్న ఒక్క ఉపాధ్యాయులు అన్ని తామై నడిపించడం భారంగా మారుతోంది. ఉపాధ్యాయులకు అత్యవసర పరిస్థితిలో సెలవుపై వెళ్లాలంటే ప్రత్నామ్నాయంగా ఒక ఉపాధ్యాయులైనా, సీఆర్పీ అయినా పాఠశాలకు రావాల్సిందే. పాఠశాల మూసేయకుండా ఉండేలా ఆదేశాలు ఉండడంతో సెలవు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యావాలంటీర్లు ఉన్న సమయంలో వెసులుబాటు ఉండేది. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలు, దృశ్యసమీక్షలు వంటి ఇతర సమావేశాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తోంది. ఇలా ఇబ్బందులు నడుమ ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగక తప్పడం లేదు.

**మూతపడకుండా చర్యలు**

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇబ్బందులు నడుమ కొనసాగుతున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తున్నాం. వాటిని మూసివేయకుండా ప్రత్యామ్నాయంగా అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సంఖ్య పెరిగితే ఉపాధ్యాయుల సర్దుబాటు, పోస్టుల మంజూరు చేసే అవకాశం ఉంటుంది. రాధాకిషన్ జిల్లా విద్యాధికారి

## తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో!

సిద్దిపేట : మారిన పరిస్థితుల్లో చరవాణి తోడుగా.. ఆన్‌లైన్ వేదికగా లావాదేవీలకు ప్రాధాన్యం పెరిగింది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ నమోదు.. నవీకరణ పేరిట.. గాలం వేసి బురిడీ కొట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి సందర్భాల్లో ఈ కేవైసీ(నో యువర్ కస్టమర్) అవసరం.. ప్రక్రియను ఎక్కడ.. ఎలా చేపట్టాలనే సమాచారం మీకోసం..

**పథకాల లబ్ధిదారులకు..**

ప్రభుత్వ రాయితీ, వివిధ పథకాల కింద లబ్ధి పొందాలంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కింద బ్యాంకులు ఆధార్, మొబైల్ నంబరు, ఇతర వివరాలు(కేవైసీ) జత చేయాలని సూచిస్తుంటాయి. ప్రధానంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు, చేయూత పింఛనర్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నగదు జమ క్రమంలో ప్రత్యేకంగా అడుగుతుంటాయి. ఖాతాకి ఆధార్, పాన్ కార్డును లింకు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తుంటారు.

**మూడు విభాగాల్లో పరిశీలన**

బ్యాంకు వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. లో రిస్క్ (చిరువ్యాపారులు, ఉద్యోగులు) పదేళ్లకోసారి, మీడియం రిస్క్(స్థిరాస్తి, ఉన్నత స్థాయి వ్యాపారులు, కంపెనీలు నిర్వహించే వారు) ఎనిమిదేళ్లకోసారి, హైరిస్క్(ఎగుమతి–దిగుమతి వ్యాపారులు, అధిక రిస్కు దేశాల్లో ఉండేవారు, నేర చరితులు) రెండేళ్లకోసారి రీ–కేవైసీ చేయాలి.



**వీరు బ్యాంకుకు వెళ్లాల్సిందే..**

సంతకాలు, ముఖ కదలికలు, వివిధ రకాల వివరాల మార్పు సహజంగా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఖాతాదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా బ్యాంకులు ఆహ్వానిస్తుంటాయి. లావాదేవీలు సక్రమంగా చేపట్టేందుకు, నవీకరణకు పునః ప్రక్రియ దోహదం చేస్తుంది. ఖాతా ఏడాది నుంచి రెండేళ్ల పాటు వినియోగించకుంటే ఇన్‌యాక్టివ్ దశలోకి వెళ్తుంది. బ్యాంకు ద్వారా వడ్డీ లాంటివి జమ అయినా.. ఖాతాదారుల లావాదేవీలు మాత్రం స్తంభిస్తాయి. రీ–కేవైసీ, ఈ–కేవైసీ పత్రాల సమర్పణను బ్యాంకుల్లో నేరుగా ఖాతాదారు చేపట్టడం ఉత్తమం. **నేరుగా సంప్రదించాలి**హరిబాబు, ఎల్‌డీఎం, సిద్దిపేట

రెండేళ్లుగా ఖాతాను వినియోగించని వారు సంబంధిత బ్యాంకుల్లో అధికారులను నేరుగా సంప్రదించాలి. నిర్దేశిత ధ్రువపత్రాలతో కేవైసీ ఫారాన్ని పూరించి సమర్పించాలి. గుర్తుతెలియని, అనుమానిత నంబర్ల నుంచి వచ్చే లింకులు, ఫోన్లకు స్పందించవద్దు.

# గుత్తేదారులకే పండగ

హైదరాబాద్: పండగలు అయిపోయాక తీరుగ్గా అధికారులు ఇప్పుడు టెండర్లు పిలుస్తున్నారు. దసరా, బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లు, వర్షాల సమయంలో సహాయక చర్యలకు గుత్తేదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో జరుగుతోన్న అవినీతి బాగోతమిది. నాకింత, నీకింత అని పంచుకునేందుకు ఇంజినీర్లు, గుత్తేదారులు కలిసి ప్రజధనానికి 'టెండరు' వేస్తున్నారని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

**ఇవిగో ఉదాహరణలు..:** బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా బడంగ్‌పేట్ మున్సిపాలిటీలోని 17వ డివిజన్ నుంచి 32వ డివిజన్ వరకు.. ప్రధాన రహదారులు, కూడళ్లలో విద్యుద్దీపాలను అలంకరించేందుకు రూ. 4. 9లక్షల అంచనా వ్యయంతో ఈనెల 11న టెండరు నోటిఫికేషన్ విడుదలైంది.

జీహెచ్ఎంసీ ఇంజినీర్లు జూన్, జులై నెలల్లో వర్షాకాల అత్యవసర బృందాల నియామకానికి టెండర్లు పిలుస్తారు. ఆయా కార్యక్రమాలకు బడంగ్‌పేట్ మున్సిపాలిటీ అధికారులు ఈనెల 13న రూ. 4. 8లక్షల అంచనా వ్యయంతో టెండరు పిలవడం అశ్చర్యం కలిగిస్తోంది.

**ఇష్టారాజ్యం..:** నిబంధనల ప్రకారం.. పండగలకు నెల ముందే ఏర్పాట్లు చేసేందుకు ఇంజినీర్లు అంచనాలు రూపొందించాలి. కమిషనర్ నుంచి ఆయా పనులకు నిధులు కేటాయింపు చేయించుకుని,



టెండరు నోటిఫికేషన్ ఇవ్వాలి. తక్కువ ఖర్చుతో పని చేస్తామంటూ ముందుకొచ్చే గుత్తేదారుకు పని అప్పగించాలి. పనులు ఏమేరకు చేశారనే తనిఖీలు ఎప్పటికప్పుడు జరగాలి. చేసిన పనికి సంబంధిత ఇంజినీర్లు ఏ రోజుకారోజు రికార్డు చేస్తారు. వాటికి తగ్గట్టు బిల్లులను ఆమోదించాల్సి ఉంటుంది. శివారు మున్సిపాలిటీల్లోని ఇంజినీర్లు.. ముగిసిన కార్యక్రమాలకు రెండు,మూడు నెలల తర్వాత టెండర్లు పిలుస్తున్నారు. వ్యవహారాన్ని పరిశీలిస్తే.. నకిలీ బిల్లులతో ప్రజాధనాన్ని దోచుకోవడమే అక్రమార్కుల లక్ష్యమని స్పష్టంగా అర్థమవుతోంది. ఒకవేళ.. ఈ టెండర్లకు బినామీ కాంట్రాక్టర్లతోపాటు ఇతరులు దరఖాస్తు చేసుకుంటే.. వాళ్లను బెదిరించి ఇంటికి పంపించడం అధికారుల వంతు. బెదిరింపులకు లొంగకుండా పోటీలో కొనసాగితే.. ఆ టెండరును రద్దు చేసి.. ఆయా పనులకు నామినేషన్ల కింద బిల్లులు చెల్లిస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆరోగ్య సౌధం.. ఆధునిక వైద్యం

హైదరాబాద్: ఎర్రగడ్డలోని ఛాతీ ఆసుపత్రి ఆవరణలో రూ. 1,100 కోట్లతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని డిసెంబరు 9న ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 1000 పడకలతో ఆధునిక వైద్య సేవల విభాగాలతో నిర్మించినట్లు రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా తెలిపారు. 2022 ఏప్రిల్‌లో ఆసుపత్రి నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వర్షాల కారణంగా పనులు కొంత ఆలస్యమయ్యాయని, 15 రోజుల్లో ఆసుపత్రిని పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.

**22.6 ఎకరాలు.. 4 బ్లాకుల్లో..**

22.6 ఎకరాల స్థలంలో 11,68,344 చదరపు అడుగుల్లో టిమ్స్ నిర్మాణం పూర్తికావచ్చింది. తొలుత జి౦9 పద్ధతిలో నిర్మించాలని అనుకున్నప్పటికీ నిర్మాణ స్థలం ఫ్లైయింగ్ జోన్(విమానాలు ఎగిరే ప్రాంతం)లో ఉన్నందున జి౦5కు కుదించారు. నాలుగు బ్లాకులుగా నిర్మించిన ఆసుపత్రిలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రధాన భవనంలోని బ్లాక్–ఎలో అత్యవసర సేవల విభాగం, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ విభాగాలు ఉన్నాయి. బ్లాక్–బిలో ఓపీడీ నమోదు విభాగం, సెంట్రలైజ్డ్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, క్యాథ్ ల్యాబ్, బ్లాక్–సిలో రేడియాలజీ విభాగం, పాథలాజికల్ ల్యాబ్స్, బ్లాక్–డిలో పరిపాలన, అకడమిక్ బ్లాక్, ఆడిటోరియం ఏర్పాటు చేయనున్నారు.

**అవయవమార్పిడి శస్త్ర చికిత్సల కోసం..**

తొలిసారిగా సనత్‌నగర్ టిమ్స్‌లో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ కార్డియాక్ సైన్సెస్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగాన్ని కూడా ప్రారంభించనున్నారు. అవయవమార్పిడి శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక విభాగం పనిచేయనుంది. రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది రాకపోకలు సాగించేలా 30 వరకు లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు. ఆసుపత్రి ఆవరణలో మూడెకరాలను పార్కింగ్‌కు కేటాయించనున్నారు.

# రక్షణశాఖ భూములకు సై



హైదరాబాద్: సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి ఉత్తర తెలంగాణ వైపు నిర్మించతలపెట్టిన రెండు ఎలివేటెడ్ కారిడార్లకు భూ సమస్య తీరింది. రక్షణ శాఖ పరిధిలో ఉన్న పలు భూములను హెచ్ఎండీఏకు అప్పగించేందుకు మార్గం సుగమమైంది. ఆయా మండలాల్లో అంతే విలువైన భూములను రక్షణకు శాఖకు ఇచ్చేందుకు ఇటీవల క్యాబినెట్‌లో నిర్ణయించారు. ఆ భూముల విలువ రూ. 1,018 కోట్లు వరకు ఉన్నట్లు తేల్చారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ అవుటర్ రింగ్‌రోడ్డు వరకు 18 కిలోమీటర్ల మేర ఒకటి, మరోవైపు ప్యారడైజ్ నుంచి ఎన్‌హెచ్44లో డెయిరీఫాం వరకు 5 కిలోమీటర్ల వరకు మరొక ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఈ మేరకు అల్వాల్ మండలంలో కౌకూర్, శామీర్‌పేట మండలంలోని సింగాయిపల్లి, తూంకుంట, కాప్రా మండలంలో జవహర్‌నగర్‌లో భూములు అవసరం కానున్నాయి. అంతే విలువైన భూములను ఆయా మండలాల్లో వేరే చోట ప్రభుత్వం రక్షణశాఖకు కేటాయించింది. పనులు షురూ కానున్నాయి. కాగా బేగంపేట్ ఎయిర్‌పోర్టు వద్ద 600 మీటర్ల భారీ టన్నెల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. డెయిరీఫాం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. శామీర్‌పేట కారిడార్‌కు ఈ నెలాఖరులోగా టెండర్లు పిలవనున్నారు.

# గురువులూ.. ఈ మరకలేంటి?



తాండూరు : మండలంలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి తల్లిదండ్రులు దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారు. ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బషీరాబాద్ మండలంలోని జీవన్గీ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు బోధన విస్మరించి తరచూ చరవాణిలో కాలక్షేపం చేస్తున్నారని గ్రామస్థులు హెచ్చరించారు. ఫలితం లేకపోవడంతో పాఠశాలకు వెళ్లి రెండోసారి హెచ్చరించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నంబర్–1 పాఠశాలలో ప్రత్యేక తరగతులకు రాలేదని హెచ్ఎం విద్యార్థులను కొద్దిసేపు గోడకుర్చీ వేయిస్తే.. తోటి ఉపాధ్యాయుడే చాటుగా వీడియో చిత్రీకరించి ఉన్నతాధికారులకు పంపినట్లు ఎంఈఓ విచారణలో తేలింది. పిల్లలకు ఆదర్శంగా ఉండాల్సిన గురువులు నిత్యం ఏదో ఒక పాఠశాలలో తరచూ వివాదాస్పదమవుతున్నారు. గురుతర బాధ్యతలు, విద్యాశాఖ నిబంధనలను పక్కనబెట్టి సమయం ఎప్పుడు గడిచిపోతుందా.. అని కొందరు ఎదురు చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి వారితో చక్కగా విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులకూ చెడ్డ పేరు వస్తోందని పలువురు అంటున్నారు. విద్యార్థుల ఎదుటే కొందరు గొడవలు పడుతుండడంతో అది చదువులపై ప్రభావం చూపుతోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు చొరవ చూపి ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధనతీరు మెరుగుపర్చాలని కోరుతున్నారు.

**పర్యవేక్షణ లేకపోవడంతోనే..**

ఉన్నతాధికారులు పాఠశాలలను పర్యవేక్షించకపోవడంతో కొందరు ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఒకరంటే ఒకరికి పడకపోవడం, ఎవరికి వారే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు ఇచ్చుకోవడం, ఎవరూ ఏం చేయలేరన్న ధీమాతో బడుల్లో బోధనను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థుల చదువులు రోజురోజుకూ కునారిల్లుతున్నాయి. ఉన్నతాధికారులు, ఎంఈఓలు తనిఖీలు, పర్యవేక్షణకు వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలున్నాయి.


**మార్గనిర్దేశకులుగానే ఉండాలి..: నర్సింహారెడ్డి, విశ్రాంత, సీనియర్ ఉపాధ్యాయుడు, తాండూరు**

ఉపాధ్యాయులపై ఎంతో నమ్మకం, విశ్వాసంతో తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపిస్తారు. నాణ్యమైన చదువు చెప్పి.. తోటివారికి ఆదర్శంగా ఉండేలా నడుచుకోవాలి. నడవడికతోనే ఉపాధ్యాయుడికి మంచి పేరొస్తుంది. పాఠశాల సమయంలో చరవాణులు, వ్యక్తిగత, సంఘ సంబంధ సంభాషణలకు దూరంగా ఉండాలి.

**చరవాణులు తరగతి గదుల్లోకి తీసుకెళ్లొద్దు...: శ్రీనివాస్, విద్యాకమిటీ అధ్యక్షుడు, తాండూరు**

ప్రైవేటు ఉపాధ్యాయులు తరగతికి వెళ్లే సమయంలో ప్రత్యేక గదిలో చరవాణి అప్పగించి వెళుతున్నారు. అలాగే ప్రభుత్వ బడుల్లోనూ అమలు చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నా. బోధన పక్కనబెట్టి ఫోన్ చాటింగ్‌లతో కాలం వెళ్లదీస్తున్నారని పలువురు విద్యార్థులు ఫిర్యాదు చేస్తున్నారు. గురువులు జాగ్రత్తగా ఉంటే మంచిది.

# రాళ్లు వెనకేసుకొంటున్నారు..



బషీరాబాద్: మండలంలోని నాలుగు గ్రామాల్లో నాపరాయి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా యంత్రాలను వినియోగించి మట్టిని తోడేసి నాపరాళ్లను వెలికి తీస్తున్నారు. ఈ విషయం గనులు, భూగర్భ, రెవెన్యూ శాఖల అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అక్రమ తవ్వకాలను కొందరు వ్యక్తులు పోటాపోటీగా సాగిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఎక్మాయి గట్టుపై దాడులు చేసి లారీని పట్టుకున్నారు. హెచ్చరించినా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు.

**మండలంలో ఎక్కడెక్కడంటే..**

మండల పరిధి ఎక్మాయి గట్టు, క్యాద్గిర, జీవన్గీ, కొర్విచేడ్‌లో వందల ఎకరాల ప్రభుత్వ భూముల్లో నాపరాయి గనులున్నాయి. ఎక్మాయి గట్టుపై, క్యాద్గిర భూముల్లో నాపరాళ్లు నాణ్యంగా ఉంటాయన్న పేరుంది. గతంలో కొందరికి ఇచ్చిన అనుమతుల గడువు ముగిసినా.. అవే పత్రాలను పట్టుకొని నేతల అండతో గనులు తోడేస్తున్నారు. మరికొందరు ఎలాంటి అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపి లారీల్లో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి..**

రాయల్టీ లేకుండా తరలిస్తుండడంతో రూ. లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఆయా గ్రామాల ప్రజలు, యువకులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప గనులు, రెవెన్యూ శాఖల అధికారులు దాడులు నిర్వహించడం లేదు. దాడులు చేసినా పూర్తిస్థాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఆయా గ్రామాల్లో నాపరాళ్లను కోత కోసేందుకు విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నారని, అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

గ్రామాలు: 5మొత్తం గనులు: 180

నాపరాళ్లు తరలించే లారీలు: 30 (రోజువారీగా)

దాడులు నిర్వహిస్తాం..: షాహిదాబేగం, తహసీల్దార్, బషీరాబాద్

ప్రభుత్వ భూముల్లో అనుమతుల్లేకుండా ఎలాంటి పనులు చేయొద్దు. రెవెన్యూ, గనులశాఖ అనుమతులు తీసుకొని నాపరాళ్లను తవ్వాలి. లేదంటే దాడులు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# తప్పులు పఢావో.. అక్రమాలు బచావో!



కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో 2015–2022 మధ్యకాలంలో 'బేటీ బచావో.. బేటీ పఢావో' పథకానికి వచ్చిన నిధులు పెద్దమొత్తంలో పక్కదారి పట్టాయి. మొదట్లో ప్రతి ఆర్థిక సంవత్సరానికి రూ. 15 లక్షల చొప్పున వచ్చాయి. తరువాత క్రమంగా రూ. 30 లక్షల చొప్పున ఏటా అందిస్తున్నారు. అయితే 2020–2022 వ్యవధిలో చేయని పనులకు లెక్కలు రాసినందుకు అప్పుడు పని చేసిన అధికారిణితోపాటు మరో ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడింది. నగరంలో గోడలకు పెయింటింగ్ వేసిన వాటి వివరాలను తక్కువగా నమోదు చేశారు. విచారణ జరిపిన అధికారులు రూ. 5 లక్షలు రికవరీకి ఆదేశించారు.

'బాలికల విద్యా ప్రగతికి, వికాసానికి వాడాల్సిన 'బేటీ బచావో.. బేటీ పఢావో'నిధుల్లో దాదాపు 80 శాతం కేవలం ప్రచారాలకే ఖర్చు చేస్తున్నారు.' ఈ తీరు మారాలి. విద్య, ఆరోగ్యం వారికి ఉపయుక్తమైన వాటికి వెచ్చించాలి.'

**పార్లమెంటరీ కమిటీ అభిప్రాయమిలా..**

'మీరిచ్చిన నివేదికలు చూస్తే కాగితాల్లో కాకి లెక్కలే నింపారనిపిస్తుంది. బాలికల ఉన్నతికి వచ్చే నిధులను పక్కదారి పట్టిస్తే ఊరుకోను. ప్రతి పైసా ఎందుకు ఖర్చు చేశారనే సమగ్ర వివరాలు అందించాలి. లేకుంటే చర్యలు తప్పవు.'

**గతేదాది దిశా సమావేశంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలు**

'ఎవరేమి చెప్పినా.. తమ పంథా ఒక్కటే'.. అనే విధంగా మహిళా శిశు సంక్షేమ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారు. బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమం ద్వారా జిల్లాకు వచ్చిన లక్షలాది రూపాయలను మంచి నీళ్ల ప్రాయంలా ఖర్చు చేస్తున్నారు. 2015 నుంచి 2025 వరకు ఒక్కో జిల్లాకు రూ. 1.90 కోట్లు విడుదలయ్యాయి. చెప్పుకోదగిన పనులకు వీటిని ఖర్చు చేయలేదు. ఆడిట్‌లో తప్పిదాలు బయటపడినా.. అక్రమాల నుంచి బయటపడకుండా తప్పుడు రశీదులను పెట్టి పక్కదారి పట్టిన నిధుల వివరాలను సక్రమం చేశారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షణ పక్కాగా లేకపోవడంతో ఈ విభాగాన్ని చూసే వారు ఇష్టానుసారంగా డబ్బులను ఖర్చు చేస్తున్నారు. ఇటీవల ఎంపీ బండి సంజయ్ చొరవ చూపించి కరీంనగర్‌లో 70 మంది బాలికలకు ఈ పథకం నిధులతో సైకిళ్లను ఇప్పించారు.

**ఇలా ఇష్టానుసారమే..**

ఫ్లెక్సీలు, అవగాహన కార్యక్రమాలు, కరపత్రాలు, టీ, అల్పాహారాలు, భోజనాలు, జిరాక్స్‌లు, స్టేషనరీల లెక్కలు రాశారు.

బాలిక, మహిళా దినోత్సవం నిర్వహణకు రూ. 20–30 వేల వరకు ఖర్చయినట్లు రికార్డుల్లో పొందుపర్చారు.

ఇటీవల 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 45 రోజుల కార్యక్రమాల నిర్వహణకు వేలాది రూపాయలు వెచ్చించారు.


మహిళలు వేధింపుల నుంచి తప్పించుకునే అవగాహన కార్యక్రమాలకు ఈ నిధులను దండిగానే ఉపయోగించారు.

రోడ్లపై బాలికల చైతన్యానికి సంబంధించి సూచనలతో కూడిన ప్రచార బోర్డులను పలుచోట్ల ఏర్పాటు చేశారు.

# చనిపోయినా.. బతికే ఉన్నారు

హైదరాబాద్: ఎల్బీనగర్‌లో ఓ ఆస్పత్రిలో చేస్తున్న యువ వైద్యురాలుగా నంగి భూమికారెడ్డి ఓఆర్ఆర్‌పై కారు అదుపుతప్పడంతో ప్రమాదంలో మృతిచెందారు. కుటుంబసభ్యులు ఆమె ఊపిరితిత్తులు, గుండె, కాలేయం, కిడ్నీలను వేర్వేరు ఆస్పత్రులకు అందజేసి ఐదుగురికి పునర్జన్మనిచ్చారు. సికింద్రాబాద్ రిసాలాబజార్‌కు చెందిన మల్లికార్జున్ యాదవ్ బేగంపేటలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కొందరికి జీవం పోయాలని భావించిన కుటుంబ సభ్యులు.. కాలేయం, ఉపిరితిత్తులు, గుండె, కిడ్నీలు దానం చేసి నలుగురి ప్రాణాలు నిలిపారు. కళ్లముందే అయినవారిని కోల్పోతున్నామన్న దుఃఖం గుండెల్ని బద్దలు చేస్తున్నా.. మరికొందరి జీవితాల్లో వెలుగు ప్రసాదించేందుకు ముందుకు రావడం అంత సులువు కాదు. తమవారు లేరని తెలిసినా పుట్టెడు దుఃఖంలోనూ కొందరూ మానవత్వాన్ని చాటుతున్నారు. ఎలాంటి సంబంధం లేనివారికి అవయవదానం చేసి మరి కొందరి జీవితాల్లో వెలుగులు నింపుతూ స్ఫూర్తిని కలిగిస్తున్నారు.

**ఎలా నమోదు చేసుకోవాలి..**



అవయవదానం చేయాలనుకున్న వారు %www.jeevandan.gov.in% వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. సంస్థ తరపున డోనర్‌కార్డును కూడా ఆన్‌లైన్లో అందిస్తారు. అవయవాలు అవసరమైన వారు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఏమైనా సందేహాలుంటే నిమ్స్ ఆసుపత్రిలో జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు అందుబాటులో ఉంటారు. 040 23489494, 63006 25242 నంబర్లను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

ఒకరి ఊపిరితో ఎనిమిది మందికి ప్రాణం..

ఒకరు తమ తదనంతరం ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. శరీర భాగాల్లోని మూత్రపిండాలు, కాలేయం, గుండె, గుండె వాల్వ్, కార్నియా, ఊపిరితిత్తులు దానం ఇవ్వవచ్చు.

సాధారణ మరణం సంభవిస్తే ఆరు గంటల్లోపు కార్నియా దానం చేయవచ్చు. **అవగాహన కల్పిస్తూ..** గ్రేటర్‌లో అవయవ లోపాలున్న వారు దాతల కోసం ఎదురు చూస్తున్నారు. వారికి మోహన్ ఫౌండేషన్, జీవన్‌దాన్, షఫీ ఫౌండేషన్ ఇతర సంఘాలు అండగా నిలుస్తున్నాయి. ఇప్పటివరకు జీవన్‌దాన్‌లో సుమారు 26,854 మంది దాతలుగా పేర్లు నమోదు చేసుకున్నారు.

# మహిళా శక్తి.. వ్యాపార యుక్తి

సంగారెడ్డి : మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక ఉన్నతికి బాటలు వేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార యూనిట్లకు రుణాలు మంజూరు చేస్తోంది. బ్యాంకు లింకేజీతోపాటు స్త్రీనిధి రుణాలతో ఉమ్మడి మెదక్, వికారాబాద్‌లో యూనిట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. సులభ వాయిదాల పద్ధతిలో రుణాల తిరిగి చెల్లింపునకు అవకాశం కల్పిస్తున్నారు.

**యూనిట్ల ఎంపిక, రాణించేలా శిక్షణ**

రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పర్‌ఫార్మెన్స్(ర్యాంపు) పథకంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు వ్యాపారంలో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 350 మందికి ఈ ప్రక్రియ చేపట్టారు. శిక్షణలో భాగంగా ఇప్పటికే స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పిన వారికి వ్యాపార అభివృద్ధికి మెలకువలు నేర్పిస్తున్నారు. ఏయే యూనిట్లను ఎంచుకుంటే డిమాండ్ ఉంటుందన్న అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

**రూ. 20లక్షల వరకు అవకాశం**

పొదుపు సంఘానికి చెందిన సభ్యులంతా కలిసి వ్యాపార యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకు వస్తే గరిష్ఠంగా రూ. 20లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు.

టెంట్ హౌజ్, అన్ని రకాల పిండి గిర్నీలు, డిమాండ్‌కు తగినట్లుగా వివిధ రకాల యూనిట్లను ఎంచుకునే అవకాశం సభ్యులకు ఉంటుంది. వ్యక్తిగతంగా యూనిట్లు నెలకొల్పానుకునే వారికి రూ. 50వేల నుంచి రూ. 2లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు.

న్యూ ఎంటర్‌ప్రైజెస్ పథకంలో భాగంగా ఇప్పటికే ఉన్న యూనిట్ల విస్తరణ, కొత్తగా యూనిట్లు ఏర్పాటు చేసేందుకు రుణాలు మంజూరు చేస్తున్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఎంపికైన వారికి ఆహార శుద్ధి యూనిట్లు మంజూరుచేసి 35 శాతం రాయితీ అందిస్తున్నారు.

**సద్వినియోగంతో సత్ఫలితాలు**

జ్యోతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి, సంగారెడ్డి

మహిళా సంఘాల సభ్యులు న్యూ ఎంటర్‌ప్రైజెస్ పథకంలో భాగంగా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రుణాలను మహిళా శక్తి పథకం ద్వారా మంజూరు చేస్తారు. ఇంటివద్దే ఉండి స్వయం ఉపాధికి బాటలు వేసుకునేందుకు వీలుంటుంది.

# 3.5 కి.మీ. దూరంలో 30 వేల ఎకరాలకు జలం

దుబ్బాక : పొలాలకు సాగునీరు అందిస్తే పంటలతో సస్యశ్యామలం చేద్దామని మల్లన్నసాగర్ ప్రాజెక్టు పరిధి ఉపకాలువ ప్రాంతంలోని కర్షకులు ఎదురుచూస్తున్నారు. ఉప కాలువ 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ నిర్మాణ పనులు దుబ్బాక మండలంలోని పలు గ్రామాల మీదుగా 2020లో ప్రారంభమైనా పూర్తి కాలేదు. నర్లేన్‌గడ్డ, బల్వంతాపూర్, చెల్లాపూర్, మల్లయ్యపల్లి, కమ్మర్‌పల్లి, అచ్చుమాయిపల్లి, పోతారం, గంభీర్‌పూర్ గ్రామాల వరకు 30,826 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని అందించవచ్చు. 14.5 కి.మీ మేర కాలువ నిర్మించారు. 11 కి.మీ. పూర్తయింది. 3.5 కి.మీ. పూర్తి చేయాల్సి ఉంది.

మంజూరు కాని బిల్లులు!

నిర్మాణ పనుల్లో భాగంగా ఆరు చోట్ల డబుల్ లైన్ రోడ్ వంతెన , 7 చోట్ల సింగిల్ లైన్ రోడ్ వంతెన నిర్మించారు. మల్లయ్యపల్లి, కమ్మర్‌పల్లి, పోతారం గ్రామాల మధ్య సీసీ లైనింగ్ పనులు పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్నాయి. భూసేకరణ సమస్యలున్నాయి. పోతారం, అచ్చుమాయిపల్లి మధ్య బ్లాస్టింగ్ పనులు జరగాల్సి ఉంది. పూడికతీత, సీసీ లైనింగ్ పనులను గుత్తేదారు మధ్యలో ఆపివేశారు. గుత్తేదారు చేసిన నిర్మాణ పనులకు నేటికీ పూర్తి స్థాయిలో బిల్లులు మంజూరు కాలేదని సమాచారం. ఏడాది కాలంగా డిస్ట్రిబ్యూటరీ కాలువ పనులు అటకెక్కాయి. ఇప్పటికే నిర్మించిన కాలువలన్నీ పూడికతో.. మొక్కలతో నిండిపోయాయి. పెండింగ్ పనులు పూర్తి చేయిస్తామని నీటి పారుదల శాఖ డీఈ శ్రీకాంత్ తెలిపారు.

చురకలు



## చిన్నారులకేదీ ఏకరూపం!

తాండూరు : అంగన్‌వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు ఇంకా అందలేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటినా వాటి ఊసే లేదు. ఎప్పుడు పంపిణీ చేస్తారోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. గతేడాది త్వరగా ఇచ్చినా, ఈ సారి ఆలస్యం చేయడం ఏమిటని చిన్నారుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. చిన్నారులు ఆసక్తిగా కేంద్రానికి రావాలంటే వెంటనే దుస్తులను అందించాలని కోరుతున్నారు.మహిళా సంఘాలకు బాధ్యత : జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 32,583 మంది ఉన్నారు. 3-6 సంవత్సరాల నిండి, కేంద్రానికి వచ్చే వారికి ఏకరూపం పంపిణీ చేయనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు వస్త్రం అందించి కుట్టించనున్నారు. ఆకర్షణీయంగా బాలురకు చొక్కా, నిక్కర్, బాలికలకు గౌను ఇవ్వనున్నారు. ఒక జత కుట్టేందుకు రూ.80-100 చెల్లించనున్నారు. వస్త్రం పూర్తిగా రాకపోవడంతో ఆలస్యం



అవుతోందని అధికారులు చెబుతున్నారు.

**రంగులతోనే** పాత ఏకరూప దుస్తులు, వివిధ రకాల రంగుల దుస్తులతోనే ఈఏడాది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నారు. ఏకరూపం ఉంటే చిన్నారులు ఆసక్తిగా, ఉత్సాహంగా వచ్చేవారని.. ప్రైవేటు వలే కేంద్రానికి వస్తున్నామనే ఆలోచనతో తల్లిదండ్రులు పంపించేవారని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు.

**వస్త్రం వచ్చింది..**

చిన్నారులకు ఏకరూప దుస్తులు కుట్టంచేందుకు జిల్లా కేంద్రానికి వస్త్రం వచ్చింది. త్వరలో మండలాలకు పంపిణీ చేయనున్నారు. మహిళా సంఘాలకు కుట్టే బాధ్యతలివ్వనున్నారు. ఒకరికి రెండు జతల ఏకరూప దుస్తులు అందజేస్తాం.శ్రీలక్ష్మి, సీడీపీఓ తాండూరు

## ఏటా ముంపు .. పరిహారానికి ఎదురుచూపు

గంగాధర: ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటలకు నీరందించేందుకు గంగాధర, నారాయణపూర్ జలాశయాలను ఎల్లంపల్లి ప్రాజెక్టుతో నింపుతారు. అయితే ఏడాది పొడవునా నీటి నిల్వతో ముంపు పొంచి ఉంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఈ సమస్య ఏ ఒక్క ఏడాదో కాదు.. కొన్నేళ్లుగా పడుతున్న ఇబ్బందులు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ పరిస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ నారాయణపూర్ గ్రామాన్ని సందర్శించినా అడుగు ముందుకు పడలేదని ఆవేదన చెందుతున్నారు.

**ఇళ్లలోని సరకులు తడిసిపోతూ..**

ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాలకు గంగాధర, నారాయణపూర్ జలాశయాలు ప్రధాన నీటి వనరుగా నిలిచాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఈ రెండింటిని నింపి ఇక్కడి నుంచి జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నారు. అయితే 0.3 టీఎంసీ సామర్థ్యంగల ఈ చెరువుల కట్టలను అభివృద్ధి చేయకుండా ఏళ్లుగా నీటిని నింపుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారాయణపూర్ చెరువు నిండుకుండలా మారి దిగువకు ప్రవహించగా.. ఇళ్లలోకి నీటిఊటలు వచ్చి గోడలు తడిసిపోయాయి. సరకులు తడిసి ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.పది లక్షలు.. ప్రకటనకే పరిమితం**

నారాయణపూర్, గంగాధర చెరువుల కింద 236 ఎకరాల వ్యవసాయ



భూములతోపాటు బావులు, పైపులైన్లకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. పదేళ్ల కిందటే రూ.10 లక్షల చొప్పున అవార్డు ప్రకటించినా.. ఇంతవరకు మంజూరు చేయలేదు. మంగపేటలో 11 ఇళ్లు, నారాయణపూర్ చెరువు కట్ట కింద 32 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని గతంలో అధికారులు గుర్తించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకు ఒక్క పైసా ఇవ్వలేదు.

**బాధితులను ఆదుకుంటాం** ముంపునకు గురవుతున్న గ్రామాల్లో ఇళ్లను సర్వే చేసి పరిహారం చెల్లిస్తాం. మొదటి విడతలో రూ.23 కోట్ల నిధులకు ప్రభుత్వం అంగీక రించింది. చర్లపల్లి ఎన్, ఇస్తారుపల్లిలో ముంపు సమస్యలు తీరుస్తాం. ఏ ఇళ్లకు నష్టం జరుగుతుందో వారికి న్యాయం చేస్తాం. ప్రాజెక్టు కింద కోల్పోయిన వ్యవసాయ భూములు, బావులు, పైపులైన్లకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిం చనుంది. నారాయణపూర్ ప్రాజెక్టును విస్తరిస్తాం.మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే

## కలిసొచ్చిన కాలం.. ఉబికివచ్చిన జలం

జగిత్యాల : వానాకాలం చివరి దశకు రాగా జిల్లాలోని చాలా మండలాల్లో భూగర్భ జలాలు తక్కువ లోతులోనే ఉన్నాయి. ఈ సీజన్‌లో సాధారణం కన్నా అధిక వర్షం కురవడంతో వానాకాలంలో అంచనాకు మించి 4.40 లక్షల ఎకరాల్లో(102 శాతం) పంటలు సాగయ్యాయి. వరి సాగు విస్తీర్ణం 3.16 లక్షల ఎకరాలు దాటడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. పసుపు సాగు విస్తీర్ణంలో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలోనే ఉండటంతో వానాకాలం పంటలను ఇబ్బంది లేకుండా చేతికొస్తున్నాయి. మొక్కజొన్న, పెసర, సోయా తదితర పంటలు పూర్తవుతుండగా వరి కోతలు ప్రారంభం కానున్నాయి. అందుబాటులోని భూగర్భ జలాలతో బావులు, బోర్ల ఆధారంగా, ఎస్సారెస్పీ నీరు యాసంగి సాగుకు ఉపకరిస్తుందని భూగర్భ జలవనరులఅధికారి నాగరాజు పేర్కొన్నారు.

## ఆహార వ్యర్థాలతో బయో ఇంధనం




హైదరాబాద్: విద్యార్థులకు పాఠాలు చెబుతూ... వారితో పరిశోధనలు చేయిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో ఆహార వ్యర్థాలను బయో ఇంధనంగా మార్చుతున్నారు. వసతి గృహాల్లోని ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్‌ను తయారుచేస్తున్నారు. వర్సిటీలోని మహిళా వసతి గృహంలో రోజుకు రెండు టన్నుల ఆహార వ్యర్థాలను ఇంధనంగా మార్చే ప్లాంట్‌ను కొద్దినెలల క్రితం ఏర్పాటు చేశారు. దీని వెనుక వసతిగృహాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్యులు ఉన్నారు. విశ్వవిద్యాలయంలో వంట చేసేందుకు ఎల్పీజీ గ్యాస్ రోజుకు పది సిలిండర్లు అవసరం. వాటిని వాణిజ్య కేటగిరీలో తీసుకోవాలి. ఒక సిలిండర్ రూ.1800 అనుకున్నా.. రోజుకు పది సిలిండర్లకు రూ.18 వేలు ఖర్చవుతుంది. నెలకు రూ.5.40 లక్షలు.. ఏటా రూ.64.80 లక్షల బిల్లు అవుతుంది. ఇది కేవలం ఒక్క వసతిగృహానికే. విద్యార్థులకు భోజనం, అల్పాహారం చేసిపెట్టాలంటే అధికంగా ఖర్చవుతుందని అంచనా వేశారు. మిగిలిపోయిన అన్నం, కూరలు, అల్పాహారాన్ని పారవేసే బదులు ఇంధనంగా మార్చాలనుకున్నారు. బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం నిపుణులతో చర్చించారు. ప్లాంటు ఏర్పాటుకు కనీసం రూ.కోటి నుంచి రూ.1.25 కోట్లు అవసరమని భావించారు.

**దాతల సహకారంతో సాకారం**

ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరిస్తున్న కొందరు దాతలను వర్సిటీ ఉన్నతాధికారులు, ఆచార్యులు గతేడాది సంప్రదించారు. కేఎంపీజీ సంస్థ, సాహస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.90 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. యంత్రాలు, పరికరాలను కొనుగోలు చేశాక మహిళా వసతిగృహంలో రోజుకు రెండు టన్నుల ఆహార వ్యర్థాలను శుద్ధిచేసి బయోగ్యాస్‌గా మార్చే ప్లాంట్‌ను ప్రారంభించారు. వర్సిటీలోని విద్యార్థినీ, విద్యార్థుల వసతి గృహాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను రోజూ విద్యుత్తు వాహనాల ద్వారా సేకరించి ప్లాంట్‌కు సమీపానికి చేర్చుతున్నారు. ఆహార వ్యర్థాలు అన్నింటినీ ఒకచోటికి చేర్చి ప్లాంట్‌లో వేస్తున్నారు. పైపుల ద్వారా వసతిగృహంలోని వంటశాలకు బయోగ్యాస్‌ను అందిస్తున్నారు.

## మూసీ సరికొత్త సొబగుల అంచనా



వికారాబాద్ :మూసీ నదిలోకి చుక్క మురుగు చేరకుండా పటిష్ఠ కార్యాచరణకు ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నా సీవరేజీ నెట్‌వర్క్‌లేని ప్రాంతాల నుంచి శుద్ధి లేకుండానే మూసీ చేరుతోంది. 1450 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఓఆర్ఆర్ వరకు విస్తరించిన మహా నగరం నదికి ఇరువైపులా ఉంది. వందశాతం మూసీలోకి చేరుతున్న మురుగునీటిని సేకరించేలా ట్రంక్ మెయిన్‌లను ప్రతిపాదించారు. డీపీఆర్ సిద్ధమైన నేపథ్యంలో నిధుల సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం వివిధ అవకాశాలను అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది.

పథకం: మూసీ ప్రక్షాళన, పరివాహక ప్రాంత అభివృద్ధి

లక్ష్యం: శుద్ధి చేయని మురుగు మూసీలో చేరకుండా అరికట్టడం

సమస్య: ప్రధాన నగరంలో మిహహా మిగిలిన ప్రాంతాల నుంచి మూసీలోకి, స్థానిక చెరువుల్లోకి మురుగు చేరుతోంది.

ఏం చేస్తారంటే?: నదికి ఇరువైపులా 55 కి.మీ. ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు

మురుగు శుద్ధి ఇలా..

ప్రధాన నగరం: 100 %

ఓఆర్ఆర్ ప్రాంతాలు20 %

ఇతర ప్రాంతాలు: 70 %

గ్రేటర్ పరిధిలో ఇలా..రోజూ వచ్చే మురుగు 1950 ఎంఎల్‌డీలు

ఈ నెలలో పూర్తయ్యే ఎస్టీపీలు 45

నవంబరు నుంచి శుద్ధి అయ్యే మురుగు 1878 ఎంఎల్‌డీలు

2036 నాటికి నగరంలో ఏర్పడే మురుగు 2800 ఎంఎల్‌డీలు

అమృత్ 2.0లో ఇటీవల శంకుస్థాపన చేసిన ఎస్టీపీలు 39

## అతిగా ఆశించకు.. వంచనకు గురికాకు!




వికారాబాద్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం చరవాణి కాలర్ టోన్ సందేశం వినిపిస్తోంది. నకిలీ రుణ యాప్‌లు, సైబర్ నేరాలు జరిగే తీరుపై పోలీసులు కళాజాత బృందాలతో తరచూ ప్రదర్శనలు ఇస్తున్నారు. విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సైబర్ కాంగ్రెస్ ప్రాజెక్టు పేరిట శిక్షణ ఇచ్చి సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య పర్చాలని అంబాసిడర్లుగా నియమించారు. వీటితో పాటు సైబర్ నేరాల తీరుపై పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో 20 మంది స్టేషన్ రైటర్లను వారియర్లుగా నియమించి శిక్షణ ఇచ్చారు.

**వారియర్ల విధులు**

సైబర్ మోసాలను పసిగట్టడం

వాటిని ఎలా ఎదుర్కోవాలన్న వ్యూహం

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన

బాధితులకు సలహాలు, సూచనలు ఇవ్వడం

కారణాలు..సైబర్ నేరాలు, మోసాలు ఏలా జరుగుతాయన్నది పరిజ్ఞానం లోపించడం. అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తే వినిపించుకోకపోడం. స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నా ఆపరేట్ చేసేందుకు పరిజ్ఞానం లేకపోవడం

మోసపోతే ఎవరిని సంప్రదించాలనేది తెలియకపోవడం

కొన్ని సంఘటనలు తాండూరులో ఓ వ్యాపారికి అపరిచిత యువతి నుంచి ఫోన్ రావడంతో మాట్లాడాడు. తీయని మాటలు చెప్పడంతో ఆమె వలలో చిక్కి నగదు సమర్పించుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేధింపులు ఆగిపోయాయి.

వికారాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారికి తెలియని వ్యక్తి నుంచి డబ్బులు వచ్చాయి. వాటిని తిరిగి ఇవ్వమని అభ్యర్థించడంతో పంపించాడు. ఇంతలోనే అతని ఖాతానుంచి రూ.వేలల్లో డబ్బులు మాయమయ్యాయి.

అపరిచితులతో ఫోన్‌లో మాట్లాడొద్దు..

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు ఖాతా నంబర్లు చెప్పవద్దు. మోసపోతే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ)కు ఫిర్యాదు చేయాలి. వెంటనే ఆ నగదు ఇతర ఖాతాల్లోకి జమ కాకుండా నిలిపి వేస్తాం. జిల్లా పరిధిలో నెలకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. తెలియని లింక్‌లు, అపరిచితులతో ఫోన్ మాట్లాడవద్దు.

కాజల్ జైస్వాల్, డీఎస్పీ, సైబర్ నేరాల నియంత్రణ, వికారాబాద్

ఫిర్యాదు ఇలా: 1930 లేదా డయల్ 100కు ఫోన్ చేయాలి

పోలీసు ఠాణాలు: 20

అందిన ఫిర్యాదులు: 535 (ఇప్పటి వరకు)

నమోదు చేసిన కేసులు: 363

ఫ్రీజ్ చేసిన మొత్తం: రూ.54.1 లక్షలు

180 కేసుల్లో బాధితులకు అందజేసింది: రూ.28.56 లక్షలు

నష్టపోయింది: రూ.1.87 కోట్లు

## ప్రయాస ప్రాంగణాలు

కోరుట్ల : జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో అరకొర వసతులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చాక ప్రయాణికుల సంఖ్య పెరిగింది. సరిపడా బస్సులు సమకూర్చకపోగా, ప్రయాణ ప్రాంగణాలను ఆధునికీకరించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంస్థకు లాభాలను తీసుకొస్తున్న కార్గో సెంటర్లకు వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**వాహనాలు నిలిపే చోటేదీ!**

జగిత్యాల ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో స్థానిక డిపోతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న బస్సుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్లాట్‌ఫాంలు సరిపోవడం లేదు. ప్రాంగణం నుంచి మరుగుదొడ్ల వరకు పైకప్పు లేకపోవడంతో వర్షం కురిసినపుడు ప్రయాణికులు తడవాల్సి వస్తోంది. కార్గో కేంద్రం వద్దనే వాహనాల పార్కింగ్ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌కు వచ్చే ప్రైవేటు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలం లేకపోవడంతో సమస్యగా మారింది.

**అరకొర ప్లాట్‌ఫాంలు.. అపరిశుభ్రత**

కోరుట్ల ప్రాంగణంలో బస్సులు నిలిపేందుకు ప్లాట్‌ఫామ్‌లు సరిపడా లేకపోవడంతో బొమ్మెన, దేశాయిపేట మార్గాల్లో వెళ్లే బస్సులను మరుగుదొడ్ల ముందే నిలుపుతున్నారు. దుర్గంధంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి, వ్యర్థాలు పేరుకుపోవడంతో చిత్తడిగా మారింది. బస్టాండ్




ఆవరణలోని 6 సీసీ కెమెరాలకు అనుసంధానించిన కంప్యూటర్‌లో స్టోరేజీ నిండిపోవడంతో ఫుటేజీ నిక్షిప్తం చేసే వీల్లేకుండా పోయింది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీఎం కొన్ని నెలలుగా పని చేయడం లేదు. రెండు టీవీలు ఏర్పాటు చేసినా ఆరు నెలల క్రితం తొలగించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపైనే బస్టాండు ఉండటంతో ఖాళీ స్థలంలో దుకాణ సముదాయాలు నిర్మిస్తే ఆర్టీసీకి రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశమున్నా పట్టించుకోవడం లేదు.

**బస్సుల కోసం చెట్ల కింద నిరీక్షణ**

సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన మెట్‌పల్లి బస్టాండ్ నిర్మాణం శిథిలావస్థకు చేరింది. జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు కూడలిగా ఉండటంతో నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. కేవలం 5 ప్లాట్‌ఫాంలు ఉండటంతో ప్రయాణికులు చెట్ల కింద నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అసలే ప్లాట్‌ఫాంలు సరిపోకపోగా అదే చోట కార్గో కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూత్రశాలల మార్గంలో కార్గో పార్సిళ్లను అడ్డుగా పెడుతుండటం అసౌకర్యంగా మారింది. బస్టాండ్ ఆవరణలో మురుగు కాలువలు లేక చిన్నపాటి వర్షానికే బురదమయమవుతోంది.

## మాడవీధి స్థలం.. అప్పగింతకు రంగం సిద్ధం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ మాడవీధి స్థలాన్ని దేవస్థానానికి అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. భవిష్యత్తులో రూ.350 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వీలుగా ఈ జాగాను రామాలయానికి ఇచ్చేందుకు రెవెన్యూశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన దస్త్రాలను అధికారులు తయారుచేశారు. అన్నీ అనుకూలిస్తే ఈ స్థలం దస్త్రాలను రామాలయం ఈఓ దామోదర్‌రావుకు బుధవారం అందించనున్నారు. రామాలయానికి దక్షిణం, తూర్పు, పడమర వైపు 43 గృహాలు ఉండగా వీటిని తొలగించారు. పూర్తిస్థాయి ప్యాకేజీలకు రూ.60.20 కోట్లు అవసరమని అంచనా వేశారు. తొలి విడతగా రూ.34.45 కోట్లు కేటాయించారు. ఈ మొత్తాన్ని నిర్వాసితులకు చెల్లించి ఇళ్లను తొలగించి చదును చేశారు. ఇందులో 1.30 ఎకరాల స్థలం ఉండగా రహదారులు పోగా మిగతా స్థలం దేవస్థానం సొంతం కానుంది.

**నత్తనడకే నయం..!**

నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో సుమారు మూడున్నర ఎకరాల ఖరీదైన స్థలం కేటాయించారు. ఇందులో తుప్పలు, రాళ్లగుట్టలు ఉండటంతో సుమారు నాలుగు నెలలుగా యంత్రాల సాయంతో చదును చేసే పనులు కొనసాగిస్తున్నారు. ఎక్కువ యంత్రాలను ఉపయోగించే వీలున్నా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే వ్యవహరిస్తే



దసరా నాటికి కూడా పనులు పూర్తవుతాయో లేదో అంతు చిక్కటం లేదు. 43 కుటుంబాలకు సంబంధించి 72 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి. ఇందులోనే రహదారులకు కొంత జాగా వదులుతారు. విద్యుత్తు లైన్లు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. నిర్వాసితులకు రూ.7.50 లక్షల చొప్పున ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి. దేవస్థానం అభివృద్ధి కోసం అందరితో పాటు మా కుటుంబానికి చెందిన ఇంటి స్థలాన్ని అప్పగించాం. నష్టపరిహారం ఇచ్చారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ సత్వరం చెల్లిస్తామని అధికారులు చెప్పి మమ్మల్ని ఖాళీ చేయించారు. ఇప్పుడు దీని ఊసెత్తటం లేదు. కాలనీ నిర్మాణానికి బ్రిడ్జి సెంటర్‌లో స్థలం చూపించినా ఎప్పటికి అప్పగిస్తారో తెలియదు.

**కాకరాల శర్మ, నిర్వాసితుడు**

రామాలయం పక్కన ఇళ్లను తొలగించగా వచ్చిన స్థలాన్ని దేవస్థానం ఈఓకు అప్పగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ త్వరలోనే అందుతుంది. వారికి బ్రిడ్జి సెంటర్‌లో కేటాయించిన స్థలాన్ని నివాస యోగ్యంగా మార్చుతున్నాం.

ఎం.వెంకటేశ్వర్లు, తహసీల్దారు, భద్రాచలం

# ఇటు కొల్లేరు.. అటు ఉప్పుటేరు


ఆకివీడు: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు కొల్లేరు, ఉప్పుటేరుకు పెద్దఎత్తున వరద వచ్చి చేరుతోంది. తమ్మిలేరు, రామిలేరు, బుడమేరుతో పాటు మరో 24 డ్రెయిన్ల ద్వారా ఒకేసారి పెద్ద ఎత్తున నీరు కొల్లేరుకు చేరడంతో నిండు కుండలా తయారైంది. వరద ప్రవాహం అంతకంతకు పెరగడంతో పెనుమాకలంక - పెదఎడ్లగాడి రోడ్డుపై నుంచి రెండు చోట్ల 200 మీటర్ల వరకు నీరు ప్రవహిస్తోంది. పెనుమాక లంకకు వెళ్లే దారిని మూసివేశారు. మరోవైపు పెద ఎడ్లగాడి వంతెన వద్ద భారీఎత్తున గుర్రపు డెక్క తూడు వంతెనకు అడ్డంగా ఉండిపోవడంతో పెనుమాకలంక, నందిగామ లంక, ఇంగిలిపాక లంక, పులపర్రు, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు వరకు వరద చేరింది. ఇప్పటికే



పెనుమాకలంకకు వెళ్లాలంటే గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న యంత్రం పడవే గతి. ఉదయం ఒకసారి, సాయంత్రం మరోసారి ఈ పడవ అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉంటూ వరద పరిస్థితిని తెలియజేయాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు గోపాల్ ఆదేశించారు. కొల్లేరులో కలుస్తున్న వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి కలిసే ఏకైక మార్గం పశ్చిమ-ఏలూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని ఉప్పుటేరు మాత్రమే. అయితే ఇది ఆక్రమణలకు గురై, అనేక ఏళ్లుగా మట్టిపూడికతీత పనులు చేయక సామర్థ్యం తగ్గింది. దీంతో వేలాది ఎకరాల వరిచేలతో పాటు వందలాది ఎకరాల ఆక్వా చెరువులు ముంపు బారిన పడుతున్నాయి.

# వాగులు.. వంకలు ఏకమై

రాచర్ల : నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. పలు మండలాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రాచర్ల, అర్ధవీడు మండలాల్లోని వాగులతోపాటు గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె వద్ద నగిలేరు, ఒంగోలు మండలం గుత్తి కొండవారిపాలెం వద్ద ముదిగొండ, సంతనూతలపాడు, కొండపి మండలాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఒంగోలు-మంగమూరు మధ్య నల్ల కాలువ, మార్కాపురం మండలం పెద్ద నాగుల వరం సమీపంలోని గుండ్లకమ్మ, నాగులుప్పలపాడు మండలంలోని కొత్తకోట వాగు,



పొమూరు మండలం బోడవాడ సమీపంలో దుప్పలమంద వాగులు పరవళ్లు తొక్కుతున్నాయి.

ఒంగోలు నగరంలోని శివారు కాలనీలతోపాటు సముద్ర తీర గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది. వాగులు, వంకల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. పలుచోట్ల అత్యధిక వర్షపాతం నమోదవ్వడంతో లోతట్టు కాలనీల్లో సహాయక చర్యలు చేపట్టారు. సముద్రతీర మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు కొన సాగుతున్నాయి. పునరావస కాలనీల్లో పంచాయతీ, పురపాలక, రెవెన్యూశాఖలు సహాయక చర్యలు చేపట్టగా, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ రాజాబాబు సెలవు ప్రకటించారు.

# భక్తుల కోరిక కార్యరూపం

మద్రిపూడి : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చొరవతో రూ.4 కోట్లు మంజూరయ్యాయి. నిధులతో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు ప్రారంభించనున్నారు.

**2 కి.మీ. నడిచి కొండపైకి వస్తున్నారు**

దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ దేవాలయం ఎత్తయిన కొండలపైన ఉంటుంది. రహదారి సౌకర్యం లేకపోవటంతో భక్తులు నాటి పురాతనమైన మెట్లపై నుంచి సుమారు రెండు కిలోమీటర్లు నడిచి కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకునేవారు. దీంతో వృద్ధులు, వికలాం



గులు, భక్తులు ఇబ్బంది పడేవారు. కొనేళ్ల క్రితం కొండను తొలిచి చదును చేశారు. కొండపైకి ఘాట్‌రోడ్డును నిర్మించాలని భక్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామి, రాష్ట్రమారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తామని, గతంలో ఎమ్మెల్యే, తితిదే దేవస్థాన సభ్యునిగా ఉన్న సమయంలోనే తితిదే నుంచి దేవస్థాన అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. దాతల సహకారంతో దేవస్థాన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలోనే ఘాట్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఘాట్‌రోడ్డు నిర్మాణా నికి నిధులు మంజూరు కావటంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# స్కిట్ ఆశలపై నీళ్లు..!




శ్రీకాళహస్తి : స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల జేఎన్‌టీయూ అనంతపురంలో విలీనమైందని, విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ఆశలు పెంచుకున్నారు. స్కిట్ విలీన ప్రక్రియ పూర్తవడం, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు మళ్లీ స్కిట్‌కు పూర్వ వైభవం వస్తుందని ఆశపడ్డారు. తొలుత 68 మంది దరఖాస్తులు చేసుకోగా ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిన 25 మంది ప్రైవేటు కళాశాలల్లో చేరిపోయారు. తరగతులు నిర్వహిస్తారని ఇన్నాళ్లపాటు నిరీక్షించిన తల్లిదండ్రులు, విద్యార్థులకు యాజమాన్యం ఝలక్ ఇచ్చింది. ఇప్పట్లో తరగతులు నిర్వహించలేమని, కలికిరికి వెళ్లాల్సిందేనని జేఎన్‌టీయూఏ యాజమాన్యం స్పష్టం చేయడంతో విద్యార్థులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**కాలయాపనపై అనుమానాలు..**

మూడు నెలల క్రితం అన్ని ప్రైవేటు కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూఏ సొంత కళాశాలల్లోనూ రెండు నెలల క్రితమే ప్రారంభమైనా స్కిట్‌లో మాత్రం తరగతులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తుడటంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూనే వచ్చారు. ఐఐటీ, ఐసర్ వంటి విద్యా సంస్థలు శాశ్వతమైన భవనాలు, మౌలిక వసతులు లేకున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి కళాశాలలను నడిపారని, స్కిట్ విషయంలోనూ అదే జరుగుతుందని ఆశపడ్డారు.

**తల్లిదండ్రులు అవాక్కు..**

స్కిట్‌ను జేఎన్‌టీయూఏలో విలీనం చేస్తూ ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూఏ తరఫున కలికిరి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు ఇక్కడి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. కళాశాలకు మంచి రోజులు వచ్చాయని, విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం యాజమాన్యాన్ని కలసి తరగతులు ఎప్పుడు ప్రారంభిస్తారని అడగడం, మరో ఆరు నెలలు పడుతుందని, అప్పటి వరకు విద్యార్థులను కలికిరి కళాశాలకు పంపాలని చెప్పడంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారు. ఇన్నాళ్లపాటు వేచిచూసిన తర్వాత ఇప్పుడు ఇలా చేతులెత్తేయడంపై తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

'ప్రభుత్వ పరంగా స్పష్టమైన ఉత్తర్వులు రావాల్సి ఉంది. తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. తప్పనిసరిగా ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభిస్తాం".

సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూఏ

'స్కిట్‌ను జేఎన్‌టీయూఏలో విలీనం చేయాలన్నది తమ అభిమతం. అందుకు ప్రభుత్వ పరంగా ఎంతో శ్రమించి ఆ తంతును పూర్తి చేశాం. ఇక నిర్ణయాలన్నీ జేఎన్‌టీయూఏ అధికారులవే. ప్రభుత్వం స్కిట్ కొనసాగింపునకు అన్ని చర్యలు చేపట్టింది. ఇక విద్యార్థులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది నుంచి తరగతులు తప్పనిసరిగా జరుగుతాయి'బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

# శాంతినగరం.. కొలువుల గ్రామం



ఆళ్లగడ్డ : ఉద్యోగం సాధించడం ప్రతి ఒక్కరి కల. కుటుంబంలో ఒక్కరికైనా ఉద్యోగం వస్తే బాగుంటుందని తలుస్తుంటారు. ఆ ఊహను నిజం చేస్తూ ఆ ఊరిలో ప్రతి ఇంటా ఉద్యోగులు ఉన్నారు. అళ్లగడ్డ మండలంలోని శాంతినగరం గ్రామానికి ప్రత్యేకత ఉంది. బత్తలూరు మజారా గ్రామంగా 1962లో ఇది ఏర్పాటైంది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామం నుంచి కొన్ని కుటుంబాలు వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. అప్పట్లో మౌలిక సదుపాయాలు లేకపోయినా పిల్లలకు చదువు ముఖ్యమని పెద్దలు బడిబాట పట్టించారు. పాఠశాల 6 కి.మీ. దూరం ఉన్నప్పటికీ పశు పోషణ, వ్యవసాయం చేసుకుంటూ పిల్లలకు చదువులు చెప్పించారు. ఫలితంగా ప్రతి ఇంటా ఉద్యోగులు తయారయ్యారు.

**120 కుటుంబాలు.. 150 మంది ఉద్యోగులు**

శాంతినగరంలో 120 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఇంటికి ఒకరు, ఇద్దరు ఉద్యోగాలు సాధించడంతో 150 మంది ఉద్యోగులు ఉన్నారు. పోలీసుశాఖలో 4, సాఫ్ట్‌వేర్ రంగంలో 40 మంది, ఆడిటర్లు 18తో పాటు పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించారు. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో 10 కుటుంబాలు ఉండగా, మిగిలిన వారు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్నారు. ఊళ్లో మొట్టమొదటి సారి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా చిట్టెమ్మ ఉద్యోగం సాధించారు. ఆ తర్వాత వరుసగా ఆర్టీసీలో ముగ్గురు మహిళలకు ఉద్యోగాలు రావడంతో గ్రామస్థులు వారిని ఆదర్శంగా తీసుకొని విద్యకు పెద్దపీట వేశారు. క్రమంగా పిల్లలు ఉన్నత చదువులు చదివి పలు ఉద్యోగాలు స్థిరపడటంతో శాంతినగరం కాస్తా ఉద్యోగుల గ్రామంగా పేరు వచ్చింది.

**విద్యతోనే మార్పు: శ్రీనివాసరావు, గ్రామస్థుడు**

విద్య ప్రాధాన్యాన్ని గుర్తించిన గ్రామస్థులు వ్యవసాయం, పశుపోషణ సాగిస్తూనే పిల్లలకు ఉన్నత చదువులు చదివించారు. ప్రతి ఇంట్లో ఒకరు లేదా ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ కొందరు దూర ప్రాంతాల్లో స్థిర పడ్డారు. మౌలిక వసతులు లేకపోయినా పిల్లల అభ్యున్నతికి కృషి చేశారు.

# శ్రద్ధగా చదువుదాం.. ప్రోత్సాహం అందుకుందాం



నూజివీడు : ఎస్సీ విద్యార్థులు సీబీఎస్ఈ అనుబంధ ప్రైవేటు రెసిడెన్సియల్ పాఠశాలల్లో 9, 11 తరగతుల్లో ఉచిత ప్రవేశానికి కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ 'శ్రేష్ఠ' పథకాన్ని అమలు చేస్తోంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా మూడు వేల మందికి అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ ఎక్స్‌లెన్స్-2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన వారికి పాఠశాల, హాస్టల్ ఫీజులను మెస్ ఛార్జీలతో సహా ప్రభుత్వం చెల్లిస్తుంది.

**అర్హతలు..**

విద్యార్థి భారత దేశ పౌరుడై ఉండాలి.

ప్రస్తుతం ఎనిమిది, పదో తరగతి చదువుతున్నవారు అర్హులు.

తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలు మించకూడదు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అక్టోబర్ 30 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది.

**పరీక్ష విధానం..**

డిసెంబర్‌లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.

సమయం 3 గంటలు. మొత్తం 100 ప్రశ్నలు (ఆబ్జెక్టివ్) ఉంటాయి.

ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు చొప్పున మొత్తం 400 మార్కులుగా నిర్ణయించారు.

పరీక్ష ఆంగ్లం, హిందీ భాషల్లో ఉంటుంది.

ఇదీ సిలబస్..

తొమ్మిదో తరగతి పరీక్ష కోసం 8వ తరగతి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్, 11వ తరగతి పరీక్ష కోసం పదో తరగతి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఉంటుంది. గణితం, సైన్స్, సోషల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ నాలెడ్జ్ అంశాలు ఉంటాయి. దరఖాస్తుకు %https://exams.nta.nic.in/registrationforshreshta2026examination% వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

సద్వినియోగం చేసుకోవాలి.. అర్హులైన విద్యార్థులు శ్రేష్ఠ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై పాఠశాలల్లో ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి.

ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో

# రక్షణ గోడ..గడువుల గాథ!

నెల్లూరు : రెండు సాగునీటి కాలువల పటిష్ఠతకు చేపట్టిన రక్షణ గోడల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. మొదట్లో అంచనాలు, ఆ తరువాత బిల్లుల సమస్యతో పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం పట్టించుకోక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నెల్లూరు నగరంలోని పెన్నా వారధి నుంచి సర్వేపల్లి, కృష్ణపట్నం ప్రాంతాలకు సాగునీటిని తీసుకెళ్లే సర్వేపల్లి కాలువకు 0.6 కి.మీ. నుంచి 3.3 కి.మీ. హరనాథపురం వరకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి రూ.110 కోట్లతో అంచనాలు తయారు చేయగా... రూ.87కోట్ల అగ్రిమెంట్‌తో పనులు ప్రారంభమయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తికానంటున్నాయి. పనులకు 2022లో టెండర్లు పూర్తై 24నెలల కాలపరిమితితో గుత్తేదారుకు పనులు అప్పగించారు. నిర్మాణాలు పూర్తి చేయాల్సిన గడువు గతేడాది మొదటికే ముగిసింది. అనంతరం ఈవోటీ పేరుతో అక్టోబర్ వరకు పొడిగించారు. మళ్లీ ఏడాది కాలం జరిగింది. అయినా పనులు ముందుకు కదలడం లేదు. ఇప్పటి వరకు రెండు వైపులా గోడలతో కలిపి రెండున్నర కిలోమీటర్లు పూర్తి అయ్యాయి. సుమారు రూ.40కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. తర్వాత జరిగిన పనులకు బిల్లులు ఇవ్వలేదు.

**జాఫర్ సాహెబ్ కాలువ**



అలాగే తోటపల్లిగూడూరు మండలం, మైపాడు పరిధిలో ఆయకట్టుకు సాగునీరు తీసుకెళ్లే జాఫర్ సాహెబ్ కాలువకు సంబంధించి పాత చెక్ పోస్టు నుంచి మైపాడు గేటు వరకు 1.15 కిలోమీటర్లు, అక్కడి నుంచి జాతీయ రహదారి వరకు మరో 1.05 కిలోమీటర్లు మేర సుమారు రూ.94కోట్లతో అంచనాలు వేయగా.. రూ.74కోట్ల అగ్రిమెంట్‌తో పనులు మొదలయ్యాయి. 15శాతం వరకు పనులు జరగగా.. రూ.7కోట్లకు బిల్లులు పెట్టారు. సర్వేపల్లి కాలువ రక్షణ గోడ పనులు మొదలు పెట్టిన కొద్ది నెలలకే జాఫర్‌సాహెబ్ కాలువ పనులు గుత్తేదారులకు అప్పగించారు. ఇవి కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

**పూడిక తీతకు తప్పని తిప్పలు**

ప్రస్తుతం సర్వేపల్లి కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. భారీ పొక్లెయిన్లు తీసుకువచ్చి పనులు చేశారు. శెట్టిగుంట రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు పూడిక తీశారు. గోడ నిర్మాణాలు చేసిన చోట పూడిక తీత పనులకు కష్టాలు తప్పడం లేదు. అటు ఇటు గోడ నిర్మాణాలు.. గోడ వెంబడి ఆక్రమణల కారణంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో కొంతమేర మనుషులను పెట్టి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కుబడిగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

# మారనున్న పల్లె పాలనా రూపు

ఒంటిమిట్ట : పంచాయతీ పాలనలో మార్పులకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు నేరుగా చేరేలా అడుగులు వేస్తోంది. పథకాల అమలులో క్షేత్రస్థాయి యంత్రాంగం ముఖ్య భూమిక పోషించేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలుండగా.. అనుబంధంగా 423 చోట్ల గ్రామ సచివాలయాలు సేవలందిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ, మరికొన్ని గ్రామాల్లో తక్కువ మంది సిబ్బంది ఉన్నారు. అవసరం లేని చోట తగ్గించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి అదనంగా సిబ్బందిని నియమించనుంది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించిన అధికారులు.. సిబ్బంది సర్దుబాటుకు కసరత్తు చేస్తున్నారు.

ఇకపై ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు

ప్రస్తుతం మండలానికి ఒక డిప్యూటీ ఎంపీడీవో(ఈవోపీర్డీ) ఉన్నారు. ఇకపై ఇద్దరు రానున్నారు. ఒకరు తాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తారు. మరొకరు గ్రామ సచివాలయాల నిర్వహణ వ్యవహారాలను చూస్తారు.

**మొత్తం నాలుగు గ్రేడ్లు:** పది వేల జనాభా/ ఏడాదికి రూ.కోటి లేదా అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఆయా పంచాయతీలు ప్రత్యేక శ్రేణి(స్పెషల్ గ్రేడ్)గా పరిగణిస్తారు. కార్యదర్శి స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోను పరిపాలనా అధికారిగా నియమిస్తారు. ఇటువంటివి జిల్లాలో 11 ఉన్నాయి. పురపాలక తరహాలో వీటిలో సేవలు అందిస్తారు. 4 వేలు- 10 వేల మంది జనం, సంవత్సరానికి రూ. 50 లక్షల రాబడి, అంతకంటే ఎక్కువగా ఉంటే గ్రేడ్-1గా ఎంపిక చేస్తారు. జిల్లాలో ఇలాంటివి 59 ఉన్నాయి. కార్యదర్శుల చేతికి పాలనా పగ్గాలు అప్పగిస్తారు. ఇక్కడ 20 మంది సిబ్బందిని నియమించే అవకాశం ఉంది.

2- 4 వేల మంది జనాభా ఉంటే గ్రేడ్-2గా చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటివి 154 ఉన్నాయి. శ్రేణి-2లో మెరుగైన సేవలు అందించడానికి 12 మంది ఉద్యోగులను కేటాయిస్తారు.

జనాభా రెండు వేల లోపు ఉంటే గ్రేడ్-3గా పరిగణిస్తారు. ఇలాంటివి 227 చోట్ల ఏర్పాటు చేశారు. ఇక్కడ తొమ్మిది మంది సిబ్బంది సేవలు అందిస్తారు.

గ్రేడ్-4, 5 విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించి గ్రేడ్-3, 2కు బదిలీ చేస్తారు.

# పనులు పంచుకో.. ముడుపులు నంజుకో

కడప: వైకాపా హయాం నుంచి తంబళ్లపల్లెలో అరాచక పాలన సాగుతూనే ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సైతం తెదేపాలో చేరిన వైకాపా కోవర్టుల కారణంగా పరిస్థితులు దారికి రావడంలేదు. ఈ అనైక్యతను ఆసరాగా తీసుకుని అధికారులు సైతం ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. జలవనరులశాఖలో ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గంలో గుత్తేదారుల అవతారం ఎత్తారు. వీరికి వైకాపా కోవర్టులు వత్తాసు పలకడంతో చెలరేగిపోతున్నారు. ఈ శాఖలో ఓ అధికారి తమ్ముడిని రంగంలోకి దింపి గుత్త పనులు చేపట్టారు. వీరికి నియోజకవర్గంలో ఇద్దరు తెదేపా నేతలు అండగా నిలిచి కమీషన్లు తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నియోజకవర్గంలో హొదాను ఓ తెదేపా నేత స్థానికంగా సృష్టించుకుని చెలామణి అవుతున్నారు. ఈయన వైకాపా కోవర్టులకు అండగా నిలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కురబలకోట మండల నేత వైకాపా వర్గీయులు చెప్పినట్లుగా వింటూ అరాచకాలు సాగిస్తున్నారు. వైకాపా కీలక నేతకు అత్యంత సన్నిహితంగా ఉంటూ పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. రెండు పార్టీల అండతో భూదందాలు సాగిస్తున్నారు. ఈ పరిణామాలను తెదేపా శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంలోనూ వైకాపా నేతల పనులన్నీ సవ్యంగా సాగుతున్నాయి. తెదేపా శ్రేణులు ఇప్పుడూ బాధితులుగానే ఉన్నారు.

ఇంజినీరింగ్ అధికారులదే హవా

జలవనరులశాఖలో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గాన్ని పంచుకున్నారు. కాంట్రాక్టు పనులన్నీ తమ అనుచరులకు కట్టబెట్టి పరోక్షంగా పనుల్లో భాగస్వామ్యులయ్యారు. ఓ అధికారి అయితే ఏకంగా తమ్ముళ్నే రంగంలోకి దింపారు. పనులు నాణ్యతా ప్రమాణాల మేరకు జరగడంలేదు. పర్యవేక్షించాల్సిన అధికారులే పనులు చేయడంతో నాణ్యత గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. పెద్దమండ్యం మండలం గుడిసివారిపల్లె చెరువు కట్ట రూ.50 లక్షలతో చేపట్టగా నాణ్యత లేకుండా పోయింది. ఈ తరహాలోనే చిన్నపాటి మట్టి పనులు మరో 22 వరకు తూతూమంత్రంగా చేపట్టి రూ.కోటి వరకు బిల్లులు చేసుకున్నారు. 2021లో నియోజకవర్గానికి వచ్చిన ఇంజినీరింగ్ అధికారి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీ నిర్మించిన ముదివేడు రిజర్వాయర్‌లో అక్రమాలకు వత్తాసు పలికారనే ఆరోపణలున్నాయి. వైకాపాతో అంటకాగిన అధికారి ఇప్పుడూ చలామణి అవుతూ అక్రమాలు సాగిస్తున్నారు.

**నీరు- చెట్టు పనుల్లోనూ అక్రమాలు**

నీరు- చెట్టు కింద పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.12 కోట్లు వరకు విడుదల చేసింది. పెండింగ్ బిల్లులను తాజాగానూ అప్‌లోడ్ చేసే వెసులుబాటు కల్పించడంతో ఇందులోనే అక్రమాలకు తెరదీశారు.

చురకలు



# పనుల్లేక.. పస్తులుండలేక

నాగలాపురం : వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలుచేస్తుండటంతో మన రాష్ట్రంలో వలసల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కానీ పశ్చిమబంగ నుంచి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. మూడు సంవత్సరాలుగా జిల్లాలో వరినాట్లకు ఇతర రాష్ట్ర కూలీలే స్థానిక రైతులకు ఆసరాగా నిలుస్తున్నారు.

**వరినాట్లలో వారిదే జోరు..**

పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన 10 మంది కూలీలు ఒక రోజులో రెండున్నర ఎకరాల మేరా నారు పీకి, నాటే పనిని పూర్తిచేస్తున్నారు. ఈ పనికిగానూ ఎకరాకు కాంట్రాక్ట్ పద్ధతిలో రూ.4,500, రూ.600 విలువచేసే బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఇదే పనిని స్థానిక కూలీలతో చేయించాలంటే భోజనం ఖర్చులతో కలిపి రూ.7,450 అవుతోంది. దీంతో రూ.2,350 ఆదా అవుతుండటంతో బెంగాలీ కూలీల జోరు కొనసాగుతోంది.

**అక్కడ పనులు లేక..** – భీమోల్, వ్యవసాయ కూలీ, మహాపూర్ గ్రామం, పశ్చిమబంగ రాష్ట్రం

మా ప్రాంతంలో పనులు లేక ఏజెంట్ల సూచనలతో 80 మంది వరకు



నాగలాపురం మండలానికి వచ్చాం. బెంగాల్‌లోని మా జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతుండటంతో అక్కడ పనులు త్వరగా పూర్తైపోతాయి. ఖాళీగా ఉండలేక ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలకు వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం.

**ఒకే రోజులో.. మూడు ఎకరాలు**– దామునాయుడు, రైతు, జంబుకేశవపురం గ్రామం, నాగలాపురం మండలం.

గతేడాది మా ప్రాంతానికి వచ్చిన బెంగాలీ కూలీలు తక్కువ మొత్తానికే పని చేయటంతో పాటు వేగంగా పనులు పూర్తవుతుండటంతో ఈ దఫా వారిని పిలిపించాను. మూడు ఎకరాల పొలంలో ఒకే రోజులో వరినాట్లు పూర్తిచేశారు

# హైవేగం

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారి (బెంగళూరు–హైదరాబాద్) నిర్వహణ అధ్వానంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఈ రహదారి 84 కి.మీ. పొడవునా ఉంది. సగటున రోజుకు 150కిపైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, 300కుపైగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. చాలా ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతానికి 10 కి.మీ. దూరంలో 2021 ఫిబ్రవరి 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 మంది మదనపల్లివాసులు మృతి చెందారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం షరా మామూలైంది.

**డ్రైవరు నిర్లక్ష్యంతో..**

2019, మే 11న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన రహదారి ప్రమాదంలో 16 మంది మృత్యువాత పడ్డారు. ఏడాది కిందట డోన్ రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలో ఓ ప్రైవేటు బస్సు 140 కి.మీ. వేగంతో వెళుతూ డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు ఉన్న లారీపైకి దూసుకెళ్లింది. లారీలో ఉన్నవారు గాయపడగా.. బస్సు డ్రైవరు అక్కడికక్కడే మృతి చెందారు.

**140 కి.మీ.కు పైగా..**

బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై గంటకు 110 కి.మీ. వేగంతో మాత్రమే బస్సులు వెళ్లాలి. ప్రైవేట్ బస్సులు 140 కి.మీ.కు పైగా వేగంగా దూసుకెళ్తున్నాయి. రాత్రివేళలో ట్రాఫిక్ తక్కువగా ఉండడం.. త్వరగా గమ్యస్థానానికి చేరాలన్న ఆతృతతో మితిమీరిన వేగంతో వెళుతున్నాయి. మరోవైపు ప్రైవేటు బస్సులు పర్మిట్లు లేకున్నా రాకపోకలు సాగిస్తున్నాయి.

**బ్లాక్ స్పాట్లు ఇవే..**

బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై దత్తాత్రేయస్వామి ఆలయం, డోన్ రూరల్ పోలీసుస్టేషన్, దొరపల్లి బ్రిడ్జి, యు.కొత్తపల్లి క్రాస్‌రోడ్డు, ఓబులాపురం మెట్ట, క్రాస్ రోడ్డు, దేవరబండ, వెల్దుర్తి సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బ్లాక్ స్పాట్లు ఉన్నాయి.

**స్పీడ్‌గన్లు.. సూచికలు కరవు**

రెండేళ్ల కిందటివరకు ఈ మార్గంలో స్పీడ్‌గన్స్ ఉండేవి. ఆ తర్వాత దీనిపై అధికారులు దృష్టి సారించలేదు. ఆర్టీఏ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు వాహనాల వేగం మితిమీరింది. ప్రమాదకర మలుపులు, బ్లాక్‌స్పాట్ల వద్ద సూచికలు లేవు. రహదారిపై ఎక్కడా మొబైల్ పెట్రోలింగ్ కనిపించడం లేదు. హైవే అంబులెన్సులు అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

**గతంలో జరిగిన భారీ ప్రమాదాలు**

2019 మే 11న సైతం ఎస్‌ఆర్‌ఎస్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను తప్పించబోయి ఉన్నపళంగా ఓ వైపు తిప్పడంతో.. ఎదురుగా వస్తున్న క్రూజర్ వాహనాన్ని ఢీకొట్టింది. పెళ్లి నిశ్చయం చేసుకుని వెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన 15 మంది, వెల్దుర్తికి చెందిన ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

2021 ఫిబ్రవరి 14న తెల్లవారుజామున మదార్‌పురం గ్రామ సమీపంలోని ఉపరితల వంతెనపై క్రూజర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అక్కడికక్కడే సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

**నియంత్రణ లేని అతివేగం**

2019, 2021 సంవత్సరాల్లో వెల్దుర్తి, మదార్‌పురం గ్రామాల సమీపంలో జరిగిన ప్రమాదాలు సైతం అతివేగాన్ని నియంత్రించకపోవడంతో సంభవించాయి. ఎస్‌ఆర్‌ఎస్ ట్రావెల్స్ బస్సు వెల్దుర్తి కూడలి వద్ద అతివేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న క్రూజర్‌ను ఢీకొంది. మదార్‌పురం సమీపంలో సైతం వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో 12 మంది ప్రాణాలు వదిలారు.

# బడి సంచి.. బరువు తగ్గిందోచ్!



రాయదుర్గం : విద్యార్థుల పుస్తకాల బరువు తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం రెండు సెమిస్టర్ల విధానాన్ని అమలులోకి తేవడంతో ఇబ్బందులు తప్పుతున్నాయి. 1 నుంచి పదో తరగతి వరకు ఈ ఏడాది జూన్‌లో మొదటి సెమిస్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు ఈ నెలాఖరులోగా విద్యార్థులకు అందజేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

**ఒకే పుస్తకంలో..**

రెండో సెమిస్టర్ పుస్తకంలో మూడేసి సబ్జెక్టులు ముద్రించారు. 1, 2 తరగతులకు తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి మరో వర్క్‌బుక్ అందిస్తున్నారు. 3, 4, 5 తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒకటి.. గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి మరొక పుస్తకం ఇచ్చారు. 6, 7, 8, 9 తరగతుల వారికి తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒక పుస్తకం... జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలతో మరొకటి ఇచ్చారు. సాంఘిక శాస్త్రంలో చరిత్ర, భూగోళం, ఆర్థిక, పౌర శాస్త్రాలు కలిపి ఇంకో పుస్తకం ఇచ్చారు.పదో తరగతి విద్యార్థులకు ఇదే సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**ఇబ్బంది తప్పింది**

గతంలో ఒకటి నుంచి పదోతరగతి వరకు సబ్జెక్టుల వారీగా వేర్వేరు పుస్తకాలు ఉండటంతో వాటిని నిత్యం తీసుకెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. బరువు వల్ల చాలామంది వెన్నునొప్పితో బాధపడేవారు. తల్లిదండ్రులు సైతం గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విధానంతో మోత తగ్గిందని విద్యావేత్తలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎంతో ఉపయోగకరం**ప్రసాద్‌బాబు, డీఈవో, అనంతపురం

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సెమిస్టర్ విధానంతో విద్యార్థులకు మేలు జరుగుతోంది. ఈ విధానంతో సంచి బరువు తగ్గింది. విద్యార్థులకు సిలబస్ పరంగా ఇబ్బంది లేకుండా ఉంటుంది.

ఉమ్మడి అనంత జిల్లాలో..

పాఠశాలలు:3,840

విద్యార్థులు: 3.5 లక్షలు

# గాలి తుస్.. సదుపాయాలు తూచ్!




అనకాపల్లి: చోడవరానికి చెందిన రమేష్ అనకాపల్లి శివారులోని ఓ మాల్‌కు వస్తుండగా బంగారుమెట్ట సమీపంలోని ఓ బంకులో పెట్రోల్ కొట్టించుకున్నాడు. టైరులో గాలి కొట్టించుకోవాలని అడగగా సిబ్బంది లేరని చెప్పారు. బైక్ దిగి మూత్రశాలకు వెళ్లేసరికి తాళం వేసి ఉంది.ప్రతి పెట్రోల్ బంకులో వినియోగదారులకు తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి సౌకర్యం ఉండాలి. ప్రథమ చికిత్స కిట్లు, ధరల పట్టిక, ఇంధన నాణ్యత, కొలతల పరిశీలన చేసుకునే వెసులుబాటు కల్పించాలి. ఇవన్నీ కాగితాల్లోనే తప్ప.. క్షేత్రస్థాయిలో కనిపించట్లేదు. సౌకర్యాలు లేవని ప్రశ్నిస్తే సిబ్బంది బెదిరింపులకు దిగుతున్నారు. మండల స్థాయిలో తహసీల్దారు నుంచి జిల్లాస్థాయి అధికారులకు తనిఖీలు చేసే అధికారం ఉంది. ఆయిల్ కంపెనీలు తరచూ పరిశీలిస్తుండాలి. వినియోగదారులు సమస్యలు ఉన్నాయంటూ ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. సౌకర్యాలు కల్పించని బంకులకు జరిమానాలు విధించాల్సి ఉన్నా.. ఈ ఏడాది మొత్తంమీద ఎక్కడా ఒక్కచోటా చర్యలూ తీసుకోలేదు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం సుమారు 144 పెట్రోల్ బంకులున్నాయి. ఇందులో 80 శాతానికి పైగా బంకుల్లో కనీస సదుపాయాలు లేవు. గాలి యంత్రం పనిచేయకపోవడం.. అది ఉన్నా గాలి కొట్టేందుకు సిబ్బంది ఉండటంలేదు. కొన్ని బంకుల్లో ఫ్రీ–ఎయిర్ అని పెట్టినా గాలి కొట్టేందుకు సొమ్ము వసూలు చేస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల తాగునీరు ఉన్నా.. మరుగుదొడ్లు, గాలి యంత్రాలు పనిచేయడం లేదు. అనకాపల్లి నుంచి పాయకరావుపేట నడుమ జాతీయ రహదారిలో ఇదేంటని ప్రశ్నిస్తే గదమాయించి, బెదిరిస్తున్నారు.

జాతీయ రహదారిపై బంకుల్లో చాలాచోట్ల మరుగుదొడ్డి లేదు. ఒకటి, రెండుచోట్ల ఉన్నా.. తాళంవేసి ఉంది. ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల పరిధిలోని 34 బంకుల్లో దాదాపు సగానికిపైగా మంచినీరు, గాలిపంపు లేవు.

**ఫిర్యాదులు వస్తే చర్యలు..:** వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలు లేకుంటే సంబంధిత బంకు సంస్థల టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. తాజాగా జేసీ ఆధ్వర్యంలో జిల్లాలోని 32 బంకుల్లో తనిఖీలు నిర్వహించాం. నాణ్యత, సౌకర్యాలు పక్కాగా ఉండాలని సూచించాం. మాకు ఫిర్యాదు చేసినా.. పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

కె.వి.ఎన్.మూర్తి, డీఎస్ఓ, అనకాపల్లి

# అచేతన స్థితి.. ఆదుకుంటేనే ఆరోగ్యం



సోమందేపల్లి: సోమందేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి గౌతమ్ తలలో రక్తం(బ్లడ్ క్లాట్) గడ్డ కట్టడంతో బెంగళూరు ఆసుపత్రిలో అచేతనంగా ఉన్నాడు. తమ కుమారుడికి శస్త్ర చికిత్స కోసం డబ్బులు లేక తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోతున్నారు. హిందూపురం మున్సిపల్ పరిధిలోని సడ్లపల్లికి చెందిన చంద్రకళ, హరి దంపతుల కుమారుడు గౌతమ్. నిరుపేదలు కావడంతో ఉపాధి కోసం కొన్నేళ్ల కిందట సోమందేపల్లికి వచ్చారు. తల్లిదండ్రులు స్థానిక కియా అనుబంధ పరిశ్రమల్లో కార్మికులుగా పనులు చేస్తూ గీతానగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. గౌతమ్‌ను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదివిస్తున్నారు. 25 రోజుల కిందట గౌతమ్ అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. మాటలు రాకుండా, కాళ్లు, చేతులు కదలలేని స్థితికి చేరుకోవడంతో కన్నవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే బెంగళూరు ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. గతంలో ఎప్పుడో ఆడుకొంటూ కిందపడి తలలో రక్తం గడ్డ కట్టడంతోనే ప్రస్తుతం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడని, శస్త్ర చికిత్సల కోసం రూ.20 లక్షలు ఖర్చవుతుందని అక్కడి వైద్యులు చెప్పడంతో వారు నిశ్చేష్టులయ్యారు. కార్మికులుగా పనిచేస్తూ వచ్చే అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న తాము ఇంత సొమ్ము ఎలా చెల్లించి, శస్త్ర చికిత్స చేయించాలని కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ సొంతూరులో గృహం, బంగారు ఆభరణాలు విక్రయించడం ద్వారా రూ.10 లక్షల వరకు కుమారుడి వైద్య చికిత్సలకు ఇప్పటికే ఖర్చు చేశారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో బాధిత దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సోమందేపల్లి, హిందూపురం తదితర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమకు తోచిన సాయం అందించారు. మానవతావాదులు స్పందించి ఆర్థిక సాయం చేసి తమ కుమారుడి ప్రాణాలను కాపాడాలని చంద్రకళ, హరి చేతులెత్తి వేడుకొంటున్నారు.

# టోల్‌ప్లాజా మరుగుదొడ్లు శుభ్రంగా లేవా.. ఫిర్యాదు చేస్తే ఖాతాలోకి రూ.వెయ్యి

చిత్తూరు : జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద మరుగుదొడ్ల నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వినూత్న ఆలోచన చేసింది.టోల్‌ప్లాజాలో శుభ్రంగా లేని టాయిలెట్లపై ఫిర్యాదు చేస్తే రూ.వెయ్యి ఫాస్టాగ్ ద్వారా రివార్డ్ పాయింట్లు ఇవ్వనుంది. ఫిర్యాదు చేయడానికి ఈ నెల 31 వరకు అవకాశాన్ని కల్పించింది. ఎలా చేయాలంటే..? టోల్ రహదారుల్లో వెళ్లే వాహనదారులు రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. టోల్‌ప్లాజా వద్ద టాయిలెట్ అపరిశుభ్రంగా కనిపిస్తే ఫొటో తీసి, దాన్ని అప్‌లోడ్ చేయాలి. ఫొటోతోపాటు పంపిన వారి పేరు, వాహనం రిజిస్ట్రేషన్ నంబరు, ఫోన్ నంబర్, లోకేషన్ తదితర వివరాల్ని నమోదు చేయాలి.రోజూ వచ్చిన ఫొటోలో అర్హత ఉన్న వాటిని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఎంపిక చేస్తారు.ఎంపికైన ఫిర్యాదుదారుడి వాహన రిజిస్ట్రేషన్ నంబరుకు అనుసంధానమై ఉన్న ఫాస్టాగ్ ఖాతాకు రూ.వెయ్యి రీఛార్జి రూపంలో జమచేస్తారు.




జిల్లాలో టోల్ ప్లాజాలు

చెన్నై–బెంగళూరు హైవేలో మహాసముద్రం.

చిత్తూరు–తిరుపతి ఆరు వరుసల హైవేలో గాదంకి.

చిత్తూరు–కడప హైవేలో తేనేపల్లి.

# త్రిలింగ క్షేత్రం... నత్తారామేశ్వరం

పెనుమంట్ర : ఒకే ప్రాంగణంలో దక్షిణాభిముఖ, పశ్చిమాభిముఖ శివలింగాలు ఉండటం అరుదు. కానీ అటువంటి ప్రత్యేకత పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలోని శ్రీరామేశ్వరస్వామి దేవస్థానానికి ఉంది. రామేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, లక్ష్మణేశ్వరస్వామి వార్లతో త్రిలింగ క్షేత్రంగా గుర్తింపు పొందింది.

శ్రీరాముడు నత్తలతో కూడిన ఇసుకతో ప్రతిష్ఠించిన శివలింగం రామేశ్వరస్వామిగా పేరొందింది. నత్తలతో కూడిన రామేశ్వరుడు కావడంతో ఈ ప్రాంతాన్ని నత్తారామేశ్వరంగా పిలుస్తారు. పరుశురాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి ఏడాదిలో 11నెలలు నీటిలో ఉండి వైశాఖ మాసంలో మాత్రమే భక్తులకు దర్శనమిస్తాడు. గోస్తనీ నది అవతల వైపు లక్ష్మణుడు ప్రతిష్ఠించిన లక్ష్మణేశ్వరస్వామి ఆలయం ఉంది. కార్తిక మాసంలో ఎక్కువ సంఖ్యలో భక్తుల ఈ దేవస్థానానికి వస్తారు.

**భక్తులకిదే ప్రత్యేకం..** శ్రీరాముడు సీతాసమేతంగా గోస్తనీ నదిలోని నత్తలతో కూడిన ఇసుక మట్టితో శివలింగం తయారు చేసి పూజించారు. మిగిలిన కొంత శేషాన్ని సైతం అక్కడే వదిలేయడంతో దానిని పదిలంగా



చూసుకుంటూ వచ్చారు. అర్చకులు ఈ శేషం భక్తులకు చూపి నాటి చరిత్రను వివరిస్తున్నారు. ప్రతిష్ఠించిన శివలింగాన్ని తాకడానికి భక్తులకు అవకాశం లేకపోవడంతో ఈ శేషాన్ని తాకి పరవశమవుతున్నారు. ఇటీవల ఈ శేషాన్ని ఆలయం వెలుపల అద్దాల పెట్టెలో ఉంచి ప్రదర్శిస్తున్నారు.

**ఆలయానికి చేరేదిలా...** ప్రైవేటు వాహనాలపైనే ఆధార పడాలి. తణుకు పట్టణం నుంచి సుమారు 13 కిలోమీటర్ల దూరం ఉంటుంది. భీమవరం నుంచి 23, తాడేపల్లిగూడెం నుంచి 28, అత్తిలి నుంచి 7, మార్టేరు నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఈ దేవస్థానం ఉంది.

# కర్షకులు కోలుకునేనా !

పెద్దదోర్నాల : పశ్చిమ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో రైతన్నలు కుదేలయ్యారు. పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతినడంతో తాము గట్టెక్కేదెలా అని వేదన చెందుతున్నారు. దోర్నాల మండలంలో చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. కడపరాజుపల్లె చెరువు నిండి అలుగు పారి సమీపంలోని మిరప, పత్తి, కంది, అరటి పంటలను ముంచెత్తింది. రూ.లక్షల పెట్టుబడితో సాగుచేసిన పంటలు పాడవ్వడంతో కడపరాజుపల్లె, తిమ్మాపురం రైతులు ఆందోళన చెందుతున్నారు. పొదిలి పరిసర ప్రాంతాల్లో సాగుచేసిన పొగాకు పొలాల్లో నీరు చేరింది. ఇది ఎక్కువ రోజులు నిలబడితే మొక్కలన్నీ వడలిపోయే ప్రమాదం ఉంది. గత నెల రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో పశ్చిమ ప్రాంతంలో విస్తారంగా పొగనాట్లు వేస్తున్నారు. అయితే వారం రోజుల్లోనే పరిస్థితి తల్లకిందులైంది. పొలాలు నీట మునగడంతో వారికి



దిక్కుతోచడం లేదు.

తోకపల్లి సమీపంలో తీగలేరు వాగు పొంగిపొర్లుతోంది. చిన్నదోర్నాల, రామచంద్రకోట, వైడీపాడు మీదుగా వరద నీరు తోకపల్లికి చేరుతోంది.

భారీ వర్షంతో కంభం మండలంలోని పత్తి, మిరప, కంది, మొక్కజొన్న, అరటి, పసుపు తదితర పైర్లకు నష్టం వాటిల్లింది. పత్తి కాయలు నల్లగా మారి పాడైపోయాయి. మిరప మొక్కలు చనిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 50 ఎకరాల్లోని వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని వ్యవసాయాధికారి మహమ్మద్ తెలిపారు. నిలిచిన నీటిని బయటకు పంపాలన్నారు.

# తీర గ్రామాలకు బహుళార్థక వరం

పాయకరావుపేట: ఆక్వారంగం మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్యకారులు జీవన స్థితిగతులు మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా కేంద్ర మత్స్యశాఖ ప్రధాని మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా (పీఎంఎంఎస్‌వై) సుమారు రూ.నాలుగు కోట్లు వెచ్చించి జిల్లాలోని పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, పాయకరావుపేట మండలం పెంటకోట తీరాల్లో బహుళార్థక సాధక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఒక్కో కేంద్రానికి రూ.రెండు కోట్లు కేటాయిస్తున్నారు. వీటిని అత్యంత వెనుకబడిన, తీరానికి అతి సమీపంలో ఉండే గ్రామాల్లో నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా హోంమంత్రి అనిత ఈ పనులకు ఇటీవలే శంకుస్థాపన చేశారు. ప్రధానంగా సముద్రంపై వేటతో జీవనోపాధి పొందే మత్స్యకారులకు అన్ని రకాల సౌకర్యాలతోపాటు వాణిజ్య, ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేలా అందుబాటులోకి తెస్తున్నారు. తీరంలో పర్యావరణ హితంగా అన్ని వసతులు ఉండేలా ప్రణాళికలు చేపట్టారు.

**ప్రయోజనాలు ఇలా...**

ఈ కేంద్రాల వద్ద చేపలు ఎండబెట్టుకోవడానికి వీలుగా విశాలమైన పర్యావరణహితమైన ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టనున్నారు. మత్స్యసంపద శుభ్రంచేసి మార్కెట్ చేసుకునేందుకు అనుగుణంగా నీటి వసతి.. ఉత్పత్తులు నేరుగా తరలించేందుకు రవాణా సౌకర్యం అందుబాటులోకి తెస్తారు. వాతావరణంలో ముందుగానే తెలుసుకునే శాటిలైట్ పరికరాలు, సముద్రంలో చేపలు ఎక్కువగా లభించే ప్రాంతాలను గుర్తించే ఆధునిక సమాచార వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. చేపలు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఐస్ తయారీ కేంద్రంతోపాటు భారీ శీతల గది, వలలు భద్రపర్చుకునేందుకు అనువైన గదుల నిర్మాణం. తీరంలో నిరంతరం వాణిజ్యం జరిగేలా 250 హైమాస్ట్ సోలార్ దీపాలు అమర్చుస్తారు. మత్స్యకార యువత, మహిళలకు మత్స్య ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, హేచరీల నిర్వహణ, పెంపకం వంటి



అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. సముద్రంలో ప్రమాదాలు జరిగితే తక్షణ వైద్య సాయం అందించేందుకు ప్రాథమిక చికిత్స పరికరాలు ఉంటాయి.

**జనవరి నాటికి అందుబాటులోకి:** వచ్చే జనవరి నాటికి బహుళార్థక సాధక కేంద్రాలు జిల్లాలో అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందనేందుకు ఇదే నిదర్శనం. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్య ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు చేసేలా శిక్షణ కేంద్రంతోపాటు అన్ని సౌకర్యాలతో వీటిని నిర్మిస్తున్నాం. జిల్లాలో మరిన్ని పోర్టులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. వంగలపూడి అనిత, హోంమంత్రి

# ఆక్రమణదారుల అనుభవం

నంద్యాల: కొలిమిగుండ్ల మండల కేంద్రంలో రూ.లక్షల విలువైన ప్రభుత్వ భూములకు బేరం పెట్టారు. ఇటిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీకి ఆనుకొని వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. అవన్నీ కొండలు, గుట్టలతో కూడుకొని ఉన్నాయి. వాటిని చదును చేసి రెండున్నర సెంట్ల చొప్పున ప్లాట్లు వేశారు. ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.లక్ష లోపే విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండటంతో చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే 40 ప్లాట్ల వరకు అమ్మేశారు. వాటిని కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు. వెయ్యి వరకు ప్లాట్లు చేసి విక్రయించాలన్న ఆలోచనలో ఆక్రమణదారులు ఉన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

**పుట్టుకొస్తున్న పట్టాలు**

ఆక్రమణదారులు ఏకంగా అనుభవదారు పట్టాలు పుట్టించి ఇస్తున్నారు. అనుభవదారు పట్టాలు ఇవ్వాలంటే ముందుగా వీఆర్వో ఆ దరఖాస్తును పరిశీలించాలి.. దరఖాస్తుదారు అక్కడ ఉంటున్నారా? ఉంటే ఎంతకాలం నుంచి నివాసం ఉంటున్నారు? ఆ స్థలం ఎంత విస్తీర్ణంలో ఉంది? తదితర వివరాలతో తహసీల్దారుకు నివేదిక ఇవ్వాలి. దాని ప్రకారం పట్టాలు పంపిణీ చేస్తారు.. ఇక్కడ వీఆర్వోలు అందినకాడికి దండుకుని తప్పుడు నివేదికలు ఇస్తున్నారు.

ఉప్పలపాడు గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో పోలీసులు తనిఖీ చేయగా అక్కడ విక్రయించడానికి సిద్ధం చేసిన 80 అనుభవదారు పట్టాలు దొరికాయి. ఇటిక్యాల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని విక్రయించడానికి వీలుగా వాటిని సిద్ధం చేసి పెట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వాటిని స్వాధీనం చేసుకొన్న పోలీసులు



కొలిమిగుండ్ల మండల తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు.

**విచారణలో ఆలస్యం ఎందుకో**

ఇటిక్యాల వీఆర్వో చెన్నయ్య నిబంధనలకు విరుద్ధంగా పలువురికి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీలు) ఇవ్వడంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. మళ్లీ ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన సస్పెన్షన్‌కు దారితీసిన పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి అక్రమార్కులను గుర్తిస్తే భారీ భూకుంభకోణం వెలుగులోకి వచ్చేది. కానీ ఎలాంటి విచారణ చేయలేదు. అనుభవదారు పట్టాలకు సంబంధించి పోలీసులు సాక్ష్యాధారాలతో సహా కొలిమిగుండ్ల తహసీల్దారుకు ఇచ్చినా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తహసీల్దారు కార్యాలయ సీళ్లు, కొందరి సంతకాలు ఉన్నట్లు సమాచారం. నిగ్గుతేల్చాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కనీసం కేసులు కూడా పెట్టకుండా అంతులేని తాత్సారం చేస్తున్నారు. "ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. వారిచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని" తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

# మాగుడు గడ్డితో ఉపాధి




ఉరవకొండ: వారిద్దరూ సాధారణ రైతులు. పొట్టేళ్ల మేత కోసం గతంలో ఇతర ప్రాంతాల్లో మాగుడు గడ్డి కొనుగోలు చేయడానికి తిరిగి.. విసిగి వేసారిపోయారు. స్థానికంగా ఎందుకు ఉత్పత్తి చేయకూడదనే ఆలోచన.. వారిద్దరూ కలిసి ముందడుగు వేసేలా చేసింది. ప్రభుత్వం అందించే రాయితీతో యంత్రాలు సమకూర్చుకుని.. మొక్కజొన్న ఆధారిత మాగుడి గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరో 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

**కొనుగోలు చేసి.. బేల్స్‌గా మార్చి..**

మొక్కజొన్న కోతకు రాకముందే ఎకరా పంటను రూ.30 వేల నుంచి రూ.42 వేలతో రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. పాల కంకి దశలోనే నూతన సాంకేతిక విధానంలో, ఆధునిక యంత్రాలతో నూర్పిడి చేసి... కొన్ని పోషకాలు కలిపి మాగుడు గడ్డి బేల్స్‌గా సిద్ధం చేస్తారు. వీటిని పశువుల దాణాగా వినియోగిస్తారు. టన్ను రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తారు.

బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు తదితర ప్రాంతాల్లోని రైతులు పశువులు, జీవాల మేతకు.. ఆర్డర్ల మీద కొనుగోలు చేస్తుండటం గమనార్హం. గత నెలలో అనంత కలెక్టర్‌గా పనిచేసిన వినోద్‌కుమార్... ఉత్పత్తి కేంద్రం తీరును తెలుసుకుని.. ఇద్దరు రైతులను అభినందించారు.

**పది నెలలపాటు..**

విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన ఉమామహేష్, పాల్తూరుకు చెందిన నజీర్ మాగుడు గడ్డికి ఉన్న ప్రాధాన్యం గుర్తించారు. దశలవారీగా ఆరు యంత్రాలు, మూడు ట్రాక్టర్లు సమకూర్చుకొని.. ఏడాదిలో పది నెలలపాటు మాగుడు గడ్డిని ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.20 కోట్లు పెట్టుబడి పెట్టగా అందులో రూ.45 లక్షలు రాయితీ వచ్చింది. తద్వారా నెలకు రూ.1.20 లక్షల రుణ కంతు చెల్లింపుతోపాటు రూ.1.5 లక్షలు నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.

**రెండు నెలలకు పైగా నిల్వ**

– నజీర్, ఉమామహేశ్

మేము గతంలో పశువులు, జీవాల మేతకు చాలా అవస్థలు పడ్డాం. వాటిని అధిగమించడానికి కొత్త మార్గంలో నడవాలనే ఆలోచన వచ్చింది. మేము చేసిన ప్రయత్నం ఫలించింది. మాగుడు గడ్డికి సంబంధించి ఒక బేల్ రెండు నెలలకు పైగా నిల్వ ఉంటుంది. బేల్ విప్పితే వారం రోజుల వరకు వాడుకోవచ్చు.

# ఆక్రమణల్లో పెద్ద చెరువు



నంద్యాల : నంద్యాల పట్టణ శివారులోని పెద్ద చెరువు శిఖం భూమి పెద్దఎత్తున ఆక్రమణలకు గురైంది. జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు ఆయా భూముల్లో పంటలు సాగు చేపట్టారు. మరికొందరు దొంగ పట్టాలు సృష్టించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు.

**విస్తీర్ణం తగ్గుతూ..**

నంద్యాల శివారులోని పెద్ద చెరువు 126 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో ఎస్‌ఎస్ ట్యాంకును 20 ఏళ్ల కిందటే నిర్మించారు. సర్వే నంబరు 2331–ఏలో ఉన్న ఈ భూమి మహానంది రోడ్డు నుంచి ఎస్బీఐ కాలనీ శివారు వరకు విస్తరించి ఉంది. గతంలో వేలాది ఎకరాల ఆయకట్టు దీని పరిధిలో ఉండేది. రానురాను తగ్గుతూ వచ్చి ప్రస్తుతం 40 ఎకరాలకే పరిమితమైంది. ఇటీవల పెద్ద చెరువును నూతన ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి కేటాయించారు. కేసీ కాలువ పరిధిలోని ఈ చెరువును ఇటీవలే పురపాలక సంఘానికి బదలాయించారు. ఇక్కడే అసలు కథ ప్రారంభమైంది.

**ఉన్నదాంతో సరిపెట్టుకుని...**

ప్రస్తుతం పెద్ద చెరువును కేసీ కాలువ నుంచి పురపాలక సంఘానికి బదిలీ చేశారు. తమకు స్వాధీనం చేసిన భూమిలోనే నూతన ఎస్‌ఎస్ ట్యాంకును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చెరువు ఉన్న వరకే స్వాధీనం చేసుకోవాలని.. ఆక్రమిత భూముల జోలికి వెళ్లకుండా ఉండేలా అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపల్, కేసీ కాలువ అధికారులు సమన్వయంతో సర్వే జరిపించి బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ముందుగా రెవెన్యూ శాఖను సంప్రదించి సర్వేయర్లతో కొలతలు వేసి ఎంతవరకు భూమి ఉందో ఆ మేరకు స్వాధీనం చేసుకోవాలి. ఇవేమీ లేకుండా బదలాయింపు ప్రక్రియ పూర్తవడం గమనార్హం.

**ప్లాట్లుగా చేసి..**

ఆక్రమణలకు గురైన భూమి 20 ఎకరాలకు పైగా ఉంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి విలువ రూ.50 కోట్లకుపైగా ఉంది. దీనికి సంబంధించి ఏక్‌సాల్ పట్టాలను కొందరు పుట్టించారు. మరికొందరు దొంగ పట్టాలతో సాగు చేస్తున్నారు. ఎస్బీఐ కాలనీలో పెద్ద చెరువు శిఖం భూమిని గత ప్రభుత్వ హయాంలో కొందరు ఆక్రమించి చదును చేశారు. పక్క సర్వే నంబర్లు వేసి ఈ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించి సొమ్ము చేసుకున్నా వీరిపై కనీస చర్యలు లేవు. భూమి ఆక్రమణలకు గురైనట్లు గతంలోనే కేసీ కాలువ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్వే చేయించాలని రెవెన్యూ శాఖను కోరారు. అయినా తీసుకున్న చర్యలు శూన్యమే. ఈ నేపథ్యంలో భూమి ఆక్రమణలకు గురవుతూనే వచ్చింది.

**అక్రమాలు తొక్కిపెట్టి..** పెద్ద చెరువు పక్కనే మహానంది మార్గం నుంచి ఎస్బీఐ కాలనీకి వెళ్లేందుకు కొన్నేళ్ల కిందట మెటల్ రోడ్డు నిర్మించారు. పట్టణం నుంచి మహానందికి వెళ్లేందుకు ఇది దగ్గరి దారి అవుతుంది. చెరువు శిఖం భూమిలోనే ఈ మార్గం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మెటల్ రహదారి– చెరువు కట్ట మధ్య ఉన్న భూమిని కొందరు ఆక్రమించారు. ఆక్రమిత స్థలంలో దశాబ్దానికిపైగా పలువురు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. కొంత విస్తీర్ణంలో ఏకంగా మునగ తోట పెంచుతుండటం గమనార్హం. భూమి విస్తీర్ణానికి సంబంధించి జలవనరుల శాఖ వద్ద ఒక రకంగా, రెవెన్యూ దస్త్రాల్లో మరోలా ఉంది. ఇదే అవకాశంగా కొందరు అక్రమార్కులు గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల అండతో భూమిని ఆక్రమించారు.

# స్వచ్ఛతకు పట్టుగొమ్మలు

నరసరావుపేట : ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా కొన్ని గ్రామాల్లో స్వచ్ఛందంగా గ్రామస్థులే స్వచ్ఛతకు నడుం కట్టారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఏళ్లుగా మురుగు కాలువలను బాగు చేసుకుంటూ వీధులను పరిశుభ్రంగా ఉంచుకుంటూ రోగాలు దరిచేరనివ్వకుండా ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ విషయంలో ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లా రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో ఉంది. అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛత విషయంలో రాణిస్తున్న గ్రామాలపై ప్రత్యేక కథనం. **వీధులన్నీ శుభ్రం:** గురజాల మండలం పల్లెగుంత గ్రామంలోని వీధుల్లో చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుతున్నారు. ఇళ్లల్లో చెత్తను వీధుల్లోకి వచ్చే వాహనాల్లో మాత్రమే వేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించడం.. దానికి గ్రామస్థుల సహకారంతో ఇది సాధ్యమైంది. ఇదే మండలంలోని పులిపాడు గ్రామంలో విద్యావంతులు అధికం. వీళ్లూ స్వచ్ఛత విషయంలో సహకరిస్తున్నారు.

**గతంలో అవార్డు:** రొంపిచర్లలో నిత్యం హరితరాయబారులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపడుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా మారుస్తున్నారు. గతంలో రొంపిచర్లలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసిన నేపథ్యంలో ఉత్తమ స్వచ్ఛ పంచాయతీ అవార్డు దక్కింది. నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెం, ఉప్పలపాడు గ్రామాల వీధులు శుభ్రంగా ఉంటున్నాయి. నూజండ్ల మండలం జంగాలపల్లిలో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. వీధుల్లో మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకుంటున్నారు. దోమలకు ఫాగింగ్ ప్రతీరోజూ చేస్తున్నారు. ఘనవ్యర్థ నిర్వహణ కేంద్రం నడుస్తోంది. వీధుల్లో సోలార్ విద్యుద్దీపాలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసుకున్నారు. మైదానం, పార్కు కూడా అందుబాటులో ఉన్నాయి. చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం పెద్దదైనా ఊరంతా శుభ్రంగా ఉంటుంది. డ్రైనేజీ వ్యవస్థ ఉంది. దండమూడి పంచాయతీలో హరితరాయబారుల పనితీరు మెరుగ్గా ఉంది. చెత్త అనేది ఎక్కడా కనిపించదు. నకరికల్లు కండ్లకుంట గ్రామం కూడా స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తోంది.

# భూచోళ్ల 'ఎత్తు'గడలు

ఆదోని : డిమాండ్ ఉన్న భూములు గుర్తించడం.. వాటి చుట్టుపక్కల ఉన్నవి చౌకగా కొనుగోలు చేయడం.. సమస్య సృష్టించడం.. నయానో భయానో డిమాండ్ ఉన్న ఆ భూములను తక్కువ ధరకు దక్కించుకొంటున్నారు. నాడు 'అధికార' అండదండలతో రెచ్చిపోయిన వైకాపా 'భూ'తాలు నేడూ తమ పంథాను కొనసాగిస్తున్నాయి. ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో వైకాపా నాయకుడి నిర్వాకం వల్ల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయి.

**కర్షకుల గగ్గోలు**

"వ్యవసాయమే తమ జీవనాధారం.. పత్తి, వాము, శనగ, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేస్తున్నాం.. వచ్చిన దాంతో కుటుంబాలు పోషించుకుంటున్నాం. వైకాపా నాయకుడు పొలం కొనుగోలు చేశాక గత ఐదేళ్లుగా మా భూములు నీటిలో నానుతున్నాయి. ఫలితంగా పంటలు సాగు చేసుకోలేక అర్ధాకలితో జీవనం సాగిస్తున్నాం.. నీటి మళ్లింపునకు మేము ఏర్పాటు చేసిన పైపులు బలవంతంగా తొలగించారని" రైతులు రమేష్, మహబూబ్‌బాషా, విఠల్, గంగన్న, మల్లికార్జున తదితరులు వాపోయారు. ఆ నాయకుడిని ప్రశ్నిస్తే భూములు అమ్మాలని బెదిరింపులకు దిగుతున్నారు.. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో అక్కడ ఎకరా రూ.కోటి వరకు పలుకుతోంది.. తమకు న్యాయం చేయాలని రైతులు విన్నవిస్తున్నారు.



**వంక పూడ్చి.. రైతులను ముంచి**

ఆదోని పట్టణ శివారు మీదుగా 167వ జాతీయ రహదారి వెళ్తోంది. రహదారి నుంచి జగనన్న కాలనీ వైపు వెళ్లే మార్గంలో వైకాపా నాయకుడు ఒకరు సర్వే నంబరు 750లో రెండెకరాలు కొనుగోలు చేశారు. ఆ భూమి వంకకు ఆనుకుని ఉండటంతో అడ్డుగా ఎత్తుగా మట్టిపోశారు. అడ్డుకట్ట వేయడంతో వర్షం నీరు పారే దారిలేక వెనుకున్న వ్యవసాయ పొలాలు ముంపునకు గురవుతున్నాయి.

సర్వే నంబరు– 190, 191లో సుమారు 50 మంది రైతులకు సంబంధించి వంద ఎకరాల సాగు భూమి ఉంది. వర్షం నీరు పారేందుకు వీలుగా ఎప్పటినుంచో వంక ఉంది. ఆ వంకను వైకాపా నాయకుడు పూడ్చేసి తన భూమిలో కలిపేసుకోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. గతంలో జగనన్న కాలనీకి నిర్మించిన రహదారి ఆనవాళ్లు లేకుండా పోయింది.

# పట్టణాల్లో జలధార

పార్వతీపురం : రానున్న 30 ఏళ్లలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఏఐఐబీ ప్రాజెక్టు పనుల్లో కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చింది. ఇటీవల మిగులు పనుల ప్రారంభానికి అవసరమైన అంచనాలను ప్రజారోగ్య శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించింది. వీటికి అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లకు నివేదికలు సిద్ధం చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. అన్నీ సక్రమంగా జరిగితే నవంబరులో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. గత తెదేపా కాలంలో ప్రారంభమైన పనులకు తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మరోసారి భూమి పూజ చేసింది. గుత్తేదారులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆపేశారు. ప్రస్తుతం ఆ అంచనాలు భారీగా పెరిగాయి. బొబ్బిలిలో నామమాత్రంగా పనులు జరగ్గా, విజయనగరంలో ముషిడిపల్లి పథకం పైపులైను మార్చాల్సి ఉంది.

**కొత్తగా టెండర్లు..**

పార్వతీపురం, బొబ్బిలిలో పనులు చేసిన గుత్తేదారులకు గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించక పనులు అసంపూర్తిగా నిలిచాయి. అక్కడ జరిగిన పనుల మేరకు బిల్లులు చెల్లించి కొత్తగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు ప్రాజెక్టుల పూర్తికి పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి



నిధి (యూఐడీఎఫ్) బ్యాంకు రుణం మంజూరుకు అనుమతించింది.

**సవరించిన అంచనాలకు ఆమోదం..**

ఉమ్మడి జిల్లాలో సాలూరు, పాలకొండ, నెల్లిమర్ల పట్టణాల్లో పనులకు సంబంధించి అంచనాలు సవరించారు. ఈ మూడు పట్టణాల్లో రూ.46 కోట్ల మేర భారం పడనుంది. గతంలో రూ.171 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించగా ప్రస్తుతం రూ.217 కోట్లకు అంచనాలు చేరాయి. వీటిని ప్రభుత్వం ఆమోదించి డీపీఆర్‌లకు అనుమతులు మంజూరు చేసింది. ఇక్కడ ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి వచ్చిన నిధులతో పనులు చేయనున్నారు. విజయనగరం, రాజాంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా నిర్మించనున్నారు. త్వరలో పనుల ప్రారంభం..: జ్యోతి, ప్రజారోగ్య శాఖ, ఈఈ విజయనగరం తాజాగా పంపించిన డీపీఆర్‌లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పార్వతీపురం, బొబ్బిలి పట్టణాల్లోని పథకాలకు యూఐడీఎఫ్ నుంచి రుణం పొందేలా అనుమతులు వచ్చాయి. ఏఐఐబీ ప్రాజెక్టులకు త్వరలో టెండర్లు పిలుస్తాం.

# నిలువ నీడే కాదు.. నీరూ ఇస్తోంది!

బొబ్బిలి సాధారణంగా బస్టాప్ అంటే.. వాహనాలు వచ్చే వరకు నిరీక్షించడం, ఎండ, వానకు తడవకుండా ఉండటం. బొబ్బిలి పట్టణంలోని పాత బొబ్బిలి కూడలిలో ఈ బస్టాప్ మాత్రం ప్రత్యేకం. ఇక్కడ సేద తీరడమే కాకుండా 24 గంటలపాటు తాగునీటి వసతి కల్పించారు. అందుకే అంతా వాటర్ బస్టాప్ అని పిలుస్తుంటారు. ఈ దారిలో సుమారు 25 గ్రామాలున్నాయి. ముఖ్యమైన ఈ కూడలిలో ఎలాంటి బస్టాప్, నీటి వసతి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని గుర్తించిన పాత బొబ్బిలికి చెందిన పాల వ్యాపారి మోదీ శంకరరావు వినూత్నంగా ఆలోచించారు. సొంత నిధులు సుమారు రూ.2 లక్షలతో మూడు నెలల క్రితం బస్టాప్‌ను నిర్మించారు. 1,000 లీటర్ల ట్యాంకును పైన అమర్చారు. కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులే కాకుండా పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు దాహార్తి తీర్చుకుంటున్నారు. తీర్థయాత్రలు, దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఆగి స్నానాలు చేసి వెళ్తున్నారు. 'ట్యాంకును రోజుకు అయిదుసార్లు నింపుతున్నా. నెలకు రూ.వేయి విద్యుత్తు బిల్లు వస్తోంది. పదిమందికీ ప్రయోజనం కలుగుతోందనే సంతృప్తితో దీన్ని నిర్వహిస్తున్నా.' అని చెబుతున్నారు శంకరరావు.

# వరద ముంచింది.. నష్టం మిగిలింది

ఆదోని : ఆదోని పట్టణాన్ని వరద ముంచెత్తింది. వీధులన్నీ జలమయ మయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. రోజుల తరబడి నీరు నిల్వ ఉంది. ఆదోని పట్టణంలో వరద నష్టంపై బృందాలు సర్వే కార్యక్రమం చేపట్టాయి. ఇందుకు సంబంధించి పురపాలక యంత్రాంగం అధికార బృందాలను నియమించింది. వరద నీటి ప్రవాహంతో రహదారులు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, పురపాలక ఆస్తులకు సంబంధించి నష్టం వాటిల్లింది. దీంతో సర్వే చేపట్టి, నివేదికను ప్రభుత్వానికి అందించాలని భావిస్తోంది. కొంతవరకైనా వరద నివారణ నిధులు మంజూరైతే.. వాటి ద్వారా మౌలిక వసతుల కల్పన పనులు చేయాలని భావిస్తోంది. స్థానిక సంస్థల నిధులు తక్కువగా ఉండటంతో, అత్యవసరంగా చేపట్టాల్సిన వాటికి నిధులు సమకూర్చడం కష్టంగా మారుతోంది. దీంతో ప్రభుత్వం స్పందించి నిధులిచ్చి ఆదుకుంటే.. కొంతలో కొంతైనా ఉపశమనం చర్యలు చేపట్టి, ప్రజల ఇబ్బందులను దూరం చేయాలను కుంటున్నారు.ఎవరెవరు.. ఏపీ పనులు: నివాసాలకు సంబంధించి



నష్టం అంచనా వేసేందుకు వీఆర్వోలు, రహదారులు, నీటి సరఫరా, కాల్వల పరిశీలన బాధ్యతలను అమినిటీ కార్యదర్శులకు అప్పగించారు.

**పనులు.. నిధులు**

ప్రధానంగా రాంజల చెరువు నుంచి వచ్చే నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు సీసీ లైనింగ్ పనులు చేపట్టాలంటే రూ.3 కోట్లు అవుతుందని భావిస్తున్నారు. చెరువు ప్రాంతం నుంచి హౌసింగ్‌బోర్డు వరకు పనులు చేపట్టాల్సి ఉంది. వరద నీటి ప్రవాహం వెళ్లే మార్గంలో చాలా చోట్ల వంకర్లున్నాయి. హౌసింగ్ బోర్డు నుంచి ఆవుదూడ వంక మీదుగా సీసీ లైనింగ్ గతంలో నిర్మించారు. టీజీకే.నగర్ నుంచి శివారులోని రాయనగర్ వరకు లైనింగ్‌పనులు చేపట్టాల్సి ఉంది. పొడవు 750 మీటర్లు వరకు ఉంటుందని అంచనా. ఇక సుమారు వంద కి.మీ. వరకు మురుగు కాల్వలు దెబ్బతిన్నాయి. పది కి.మీ. వరకు వంకల ప్రాంతంలో నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది.

పట్టణంలో కార్వన్‌పేట, కౌడల్‌పేట, హవన్నపేట, బుద్దేకల్లు, బోయగేరి, పట్టణంలో ప్రధాన దారులు, ఫారెస్టలైన్ ప్రాంతం, వాల్మీకి నగర్ శివారు ప్రాంతాల్లో దెబ్బతిన్న మురుగు కాల్వలు, రహదారులు నిర్మించాల్సి ఉంది. కొన్ని చోట్ల వర్షాలకు దీపాలు పాడవడం, స్తంభాలు దెబ్బతినడం, తీగలు కాలిపోవడం వంటివి జరిగాయని సిబ్బంది చెబుతున్నారు. వరద ప్రభావిత వార్డుల్లో కనీసం రూ.2 కోట్ల చొప్పున పనులు చేపట్టాల్సి ఉంటుందని అంచనా. వీటిపై సమగ్ర నివేదిక తయారు చేసి.. బృందం ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందించి.. అక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదించే దిశగా యోచిస్తున్నారు.

**రాజకీయాలకు అతీతంగా**

పట్టణంలో వరద నివారణ పనులు చేపట్టేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని పట్టణ వాసులు భావిస్తున్నారు. పంతాలు పక్కన పెట్టి, పట్టణ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తద్వారా నిధులు రాబట్టేలా చేస్తే మేలు జరగుతుందంటున్నారు. ఇప్పటికే బసాపురం నీటి కుంట దెబ్బతింది. రహదారుల విస్తరణ లేక ట్రాఫిక్ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, అస్తవ్యస్తమైన మురుగు వ్యవస్థ, మౌలిక వసతుల లేమి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారం అందకపోవడంతో జనమంతా అసంతృప్తిగా ఉన్నారు. వరద సమయంలోనైనా సమష్టిగా నిధులు సాధించుకొస్తే.. సమస్యల పరిష్కారమవుతాయని పట్టణ వాసులు భావిస్తున్నారు.పురపాలిక: ఆదోని

వార్డులు: 47

నివాస గృహాలు: 36 వేలు

జనాభా: రెండు లక్షలు

# అడవికి అభయం.. అవనికి అందం

పెద్దదోర్నాల: జీవ వైవిధ్యానికి నిలయం నల్లమల. పచ్చదనంతో కళకళలాడే ఈ అరణ్యంలో అరుదైన వృక్షజాతులు ఉన్నాయి. వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యలు, ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించేందుకు అటవీశాఖ ప్రతి ఏడాది అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈసారికూడా ఈ కార్యక్రమం చేపట్టింది.ఆగని స్మగ్లర్ల బెడద: నల్లమల అభయారణ్యంలో పులులు, చిరుత పులులు, పంగోలిన్ వంటి జంతువుల అవయవాలకు విదేశీ మార్కెట్లో మంచి ధర ఉంది. దీంతో స్మగ్లర్లు వాటిని వేటాడి చంపేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి వలలో పడకుండా అటవీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మార్కాపురం డివిజన్ పరిధిలో అయిదేళ్లలో ఐదుకు పైగా పంగోలిన్ అక్రమ రవాణ కేసులు నమోదు కాగా 30కి పైగా ఇతర వన్యప్రాణులను వేటాడిన కేసులు నమోదయ్యాయి.

**నిబంధనలు గమనించండి**



వన్యప్రాణులను పెంచుకోవడం, వేటాడటం, వాటి మాంసం కలిగి ఉండటం నేరం. కేంద్ర ప్రభుత్వం 1972లో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టం తీసుకువచ్చింది. వన్యప్రాణులను వేటాడితే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.50,000 నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా, రెండోసారి పునరావృతమైతే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు.

**ఇవీ వివరాలు..**

తెలుగు రాష్ట్రాల్లో నల్లమల్ల విస్తీర్ణం 5,938 చ.కిమీ

జిల్లాలో.. 3,296.31 చ.కిమీ.

రాష్ట్ర పరిధి అటవీ ప్రాంతంలో పులుల అభయారణ్యం 1401.72 చ.కిమీ.ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

– హరి, అటవీ క్షేత్రాధికారి, పెద్దదోర్నాల

అటవీ ప్రాంతంలో జంతువుల సరంక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. చెంచు గిరిజన గూడేలు, అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం.

# అడ్డగోలుగా నిర్మాణాలు



అనకాపల్లి : అనకాపల్లి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. చుట్టూ ఉన్న గ్రామాల స్వరూపం మారుతోంది. పట్టణానికి దీటుగా గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో ఎటుచూసినా బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అడ్డగోలుగా పనులు చేపడుతున్నారు.

అనకాపల్లి మండల పరిధిలో 32 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 250కిపైగా గ్రామాలు ఉన్నాయి. జిల్లా ఏర్పడక ముందు గ్రామాల్లో పెంకుటిళ్లు మాత్రమే ఉండేవి. నేడు ఎటుచూసిన బహుళ అంతస్తుల నిర్మాణాలు పట్టణానికి ఆధునిక సాంకేతికతకు దీటుగా సాగుతున్నాయి. భవనాలు జీం ప్లస్ 2, 3, 4 అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. కొందరు పంచాయతీ అనుమతులు తీసుకోవడం లేదు. తుమ్మపాల, కొత్తూరుతో పాటు అక్కిరెడ్డిపాలెం, రేబాక, మారేడిపూడి, భట్లపూడి, కోడూరు, చింతనిప్పుల అగ్రహారం, గొలగాం, ఊడేరు తదితర గ్రామాల్లో జీం 3 పద్ధతిలో భవనాలు నిర్మిస్తున్నారు.

నీ సాధారణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే ముందుగా ప్లాన్ కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు ప్లాన్ పరిశీలించి చలానా కట్టించుకుని అనుమతులు ఇస్తారు. రెండు అంతస్తులకు మాత్రమే పంచాయతీకి అనుమతి ఉంటుంది. ఆపైన నిర్మాణాలు వీఎంఆర్‌డీఏ పరిధిలోకి వస్తాయి. గ్రామాల్లో అంతకు మించిన పైఅంతస్తులు, దుకాణ సముదాయాలు నిర్మిస్తున్నారు. అటు వీఎంఆర్‌డీఏ ఇటు పంచాయతీ అనుమతులకు దరఖాస్తు చేసుకోవడం లేదు. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

**కన్నెత్తి చూడని అధికారులు**

గ్రామాల్లో అడ్డగోలుగా పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల నిర్మాణాలు, దుకాణ సముదాయాలు కళ్లముందే చకచకా రూపుదిద్దుకుంటున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కాసులకు కక్కుర్తిపడి అటువైపు వెళ్లడం లేదు. దొడ్డిదారిన పనులు పూర్తవగానే పన్నులు వేస్తున్నారు. నేతల సిఫార్సులతో అధికారులు వీటి జోలికి వెళ్లడం లేదు.

**అనుమతులు తప్పనిసరి**

గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న బహుళ అంతస్తులు, దుకాణ సముదాయాలు గుర్తించి అందరికీ నోటీసులు జారీ చేస్తాం. పంచాయతీ పరిధిలో జీప్లస్–2 వరకే అనుమతి ఉంది. ముందుగా నిర్మాణదారులు పంచాయతీ అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే నిర్మాణానికి అనుమతులు ఇస్తాం. పంచాయతీల్లో పూర్తిగా కార్యదర్శులే పర్యవేక్షించాలి.

– ప్రసాద్, ఈవోఆర్డీ, అనకాపల్లి

# రావే నీళ్లు.. ఆగవే కన్నీళ్లు



పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పురపాలక సంఘాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి. ఏం చేద్దాం: రక్షిత పథకాలకు నిధులు కోరుతూ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు 2005లో ప్రజారోగ్య శాఖ ద్వారా ప్రతిపాదనలు.

ఓ వరం: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సుస్థిర తాగునీటి పథకం కింద 2007లో పుత్తూరు– రూ.56 కోట్లు, పుంగనూరు– రూ.33.33 కోట్లు, నగరి – రూ.35 కోట్లు, పలమనేరు కౌండిన్య వద్ద ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేసింది.


ఎక్కడ ఎలా?

పుత్తూరు: గాలేరు–నగరి ప్రాజెక్టు నీటితో ఎస్‌ఎస్ ట్యాంకు నింపి ప్రజల గొంతు తడపాలి. ప్రాజెక్టు పనులు ఆగిపోవడంతో 2010లో ట్యాంకు పూర్తయినా చుక్క ఇవ్వలేని దుస్థితి. గత తెదేపా పాలనలో ఏఐఐబీ నిధులు రూ.138.72 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. 2019లో వైకాపా ప్రభుత్వం పనులు ప్రారంభించినా, గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో అటకెక్కాయి. ప్రస్తుతం యూఐడీఎఫ్ నిధులతో పూర్తి చేసి నీరివ్వాలని యోచిస్తున్నారు.

పుంగనూరు: ఎస్‌ఎస్ ట్యాంకును రూ.33.33 కోట్లతో నిర్మించారు. 2010లో పూర్తయిన ఈ ట్యాంకులోకి హంద్రీ–నీవా ప్రాజెక్టు నీటిని నింపి ప్రజలకు అందించాలని అనుకున్నారు. హంద్రీ– నీవా పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ట్యాంకు నిరుపయోగంగా మారింది. కౌండిన్య వద్ద రూ.25 కోట్లతో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించి తాగునీరు ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టు నీరు కలుషితం అవుతోంది. దీనికి తోడు భవిష్యత్తులో ఎద్దడి తలెత్తకుండా రూ.25 కోట్లతో గంగన్న శిరస్సు వద్ద మరో ట్యాంకు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. నిధులు విడుదల కాలేదు.

నగరి: కొండల నడుమ ట్యాంకు నిర్మించడంతో ఏటా వర్షాకాలంలో నిండుతోంది. దీంతో ఇబ్బంది లేకుండా ప్రజలు గొంతు తడుపుకొంటున్నారు.

# రోడ్లపై స్తంభాలు.. ప్రమాదాలకు పిలుపులు



మడకశిర : జాతీయ రహదారులు, ప్రధాన గ్రామీణ రహదారులకు ఆనుకుని, రహదారులపై సైతం విద్యుత్తు స్తంభాలు ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకునేందుకు ఆస్కారముంది. ఆర్‌అండ్‌బీ, విద్యుత్తు శాఖల మధ్య సమన్వయం లోపించడంతో వాహనదారులకు శాపంగా మారింది. రోజురోజుకు వాహనాల రాకపోకలు అధికమై రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. ఇలాంటి తరుణంలో రోడ్లపై స్తంభాలు ఉండడం మరింత సమస్యగా మారుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

మడకశిర పట్టణానికి సమీపంలో వడ్రపాళ్యం వద్ద దానిమ్మతోట సమీపంలో రొళ్లకు వెళ్లే జాతీయ రహదారిపై 11కేవీ విద్యుత్తు స్తంభం ఉంది. ఇటీవల రోడ్డు నిర్మించిన ఆర్‌అండ్‌బీ అధికారులు అలాగే తారు వేశారు. అసలే జాతీయ రహదారి వేగంగా వచ్చే వాహనాలు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంటే పెద్ద ప్రమాదమే చోటుచేసుకుంటుంది. అమరాపురం మండలంలో హేమావతి, హాలుకూరు, కాచీకుంట, చిట్నడుకు గ్రామాలలో రహదారులకు ఆనుకుని విద్యుత్తు స్తంభాలను తొలగిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.గుడిబండ మండలం చిగతుర్పి, ఫళారం, జమ్మలబండ, మోపురుగుండు రహదారి మధ్యన విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి.

రొళ్ల, హెుసకెర రోడ్డులో దాదాపు 10 చోట్ల ఇలా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం కర్ణాటక, ఆంధ్రా గ్రామాలకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉంటుంది. సత్వరమే స్తంభాలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**విద్యుత్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

–మూర్తి, ఆర్‌అండ్‌బీ ఇంజినీరు, మడకశిర రోడ్లపై ఉన్న విద్యుత్తు స్తంభాలను వేరే చోటకు మార్చాలని ఆశాఖ అధికారులకు పలుమార్లు తెలియజేశాం. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టే సమయంలో ఇబ్బందిగా ఉంటుంది. స్తంభాలను మార్చితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

# ప్రమాదకరంగా గొట్టా బ్యారేజీ రహదారి

హిరమండలం: హిరమండలం మండల పరిధిలోని గొట్టా బ్యారేజీ నుంచి న్యూ బ్యారేజీ సెంటర్ వరకు ఉన్న రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇది సింగిల్ లైన్ రోడ్ కావడం, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత 20 ఏళ్లుగా పాలకులు మారుతూనే ఉన్నా వాగ్దానాలు ఇస్తున్నా మాటలకే పరిమితం అవుతున్నాయి. గొట్టా బ్యారేజీ రహదారి పరిసర గ్రామాల ప్రజలు రోడ్డు విస్తరణ చేయాలని కోరుతున్నారు. కూటమి ప్రభుతం స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్లాంట్ల ఊపిరి తీశారు

ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రాణవాయువు అందించాలంటే పైకం చెల్లించాల్సి వస్తోంది. కొవిడ్ సమయంలో ప్రాణవాయువు అత్యవసరంగా మారింది. వీటి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022లో పీఎస్‌ఏ ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఒక్కో ప్లాంటుకు రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించినట్లు సమాచారం. ప్రస్తుతం వీటి నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో మూలకు చేరాయి.

**వినియోగంలోకి తేవాలంటే..**

కొన్ని ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు పనిచేయక సుమారు నాలుగేళ్లవుతోంది. అందుబాటులోకి వస్తే సొంతంగా ఆక్సిజన్ ఉత్పత్తి చేసుకోవచ్చు. అత్యవసర సమయంలో నిరంతరాయంగా సరఫరా చేసుకునేందుకు వీలవుతుంది. మరమ్మతులు చేయకుంటే అవి ఎందుకూ పనికిరాకుండా పోతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

**గత ప్రభుత్వం పట్టించుకోక..**

కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు చొప్పున, ఆదోనిలోని మాతాశిశు ఆస్పత్రి, ఎమ్మిగనూరు, డోన్, బనగానపల్లి ప్రాంతీయ ఆస్పత్రుల్లో వంద పడకలకు సంబంధించి ప్లాంట్లు ఏర్పాటుచేశారు. ప్రారంభంలో కొన్నాళ్లపాటు వీటి సేవలందాయి.



నిర్వహణపై గత వైకాపా ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. నిర్వహణకు నిధులివ్వక.. సిబ్బందిని నియమించకపోవడంతో నెమ్మదిగా ఒక్కో ప్లాంటు పనిచేయకుండా పోయింది.

ప్లాంటు ఏర్పాటు సమయంలో నిర్వహణకు సంబంధించి నిపుణులను నియమించారు. ఆరు నెలల గడువు తీరడంతో వీరిని పట్టించుకోలేదు.

**ఎక్కడ ఎలా ఉందంటే..**

కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు ప్లాంట్లు పనిచేయకపోవడంతో బయటి నుంచి ట్యాంకర్ల ద్వారా ఆక్సిజన్ తెప్పించుకుంటున్నారు. వీటికోసం టెండర్లు పిలిచి పనులు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇక్కడి ఆస్పత్రికి రెండు రోజులకోసారి రెండు కేఎల్ (కిలో లీటరు) స్థాయిలో ఆక్సిజన్ అవసరం. దీనికోసం సుమారు నెలకు రూ.30 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.నంద్యాలలోనూ అదే పరిస్థితి. ఇక్కడా ప్రతి నెలా నాలుగైదు ట్యాంకర్ల వరకు ఆక్సిజన్ తెప్పించుకుంటున్నారు. నెలకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదోనిలోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో ప్లాంటు పనిచేయకపోవడంతో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల ద్వారా రోగులకు సేవలందిస్తున్నారు. విద్యుత్తు ఉంటేనే ఇవి పనిచేస్తాయి.. విద్యుత్తు లేని సమయంలో జనరేటర్లు వినియోగిస్తామని వైద్యులు చెబుతున్నా.. ఎంతవరకు సేవలందుతున్నాయో తెలియని పరిస్థితి. ఈ వైద్యాలయంలో నెలకు 450 ప్రసవాలు జరుగుతాయి. ఈ ఆస్పత్రిలోని మేడపై నవజాత శిశు సంరక్షణ వైద్య కేంద్రం ఉంది.. దీనికి ఆక్సిజన్ సమస్యలు వెంటాడుతున్నాయి. నాబార్డు ద్వారా కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనానికి ఆక్సిజన్ పైపులు ఏర్పాటుచేయాల్సి ఉంది. ఆదోని జీజీహెచ్‌లో రెండు ప్లాంట్లు పనిచేయడం లేదు. దీంతో ప్రతి నెలా డబ్బులు చెల్లించి ఒకటి రెండు ట్యాంకర్ల ఆక్సిజన్ తెప్పించుకుంటున్నారు. ఎమ్మిగనూరు ఆస్పత్రిలోనూ మరమ్మతులకు గురైంది. డోన్‌లో పాత భవనంలోని ఆస్పత్రిలో ప్లాంటు బిగించారు. కొత్త భవనంలోకి మార్చేందుకు సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో అలానే వదిలేశారు. బనగానపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రిలో ప్లాంటు మరమ్మతులకు గురైంది.

# కందిపప్పు.. ఉడికేదెన్నడో చెప్పు!

చిన్నమండెం: ఏ నెలకు ఆ నెల కంది పప్పు వస్తుందని ఎదురు చూస్తున్న పేదలకు ఈ నెలా నిరాశే మిగిలింది. ఈ సారి బియ్యం, పంచదారతో పాటు రాగులు పంపిణీ చేస్తున్నారు. గురువారం విజయ దశమి పండుగ కాగా ఇదే నెలలో దీపావళి కూడా రానుంది. ఈ తరుణంలో పేదింట కందిపప్పు ఉడకని స్థితి నెలకొంది. ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా తెల్లరేషను కార్డు లబ్ధిదారులకు బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి ఈ నెలలో మూడు కిలోలు తగ్గకుండా రాగులు అందిస్తున్నారు. బియ్యానికి బదులుగా రాగులు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇవి కూడా ఉచితమేనని వివరిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ప్రజలకు కందిపప్పు సరఫరా ఆగిపోయింది. చౌక దుకాణాల్లో కేవలం రూ.67లకే కిలో వచ్చేది. ఆ కిలో కూడా పేదలు భాగ్యంగా భావించేవారు. కారణం బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైనవి కిలో రూ.140 వరకు పలుకుతున్నాయి. గత నెల 25 నుంచి 65 ఏళ్ల పైబడిన వారికి డీలర్లు ఇంటి వద్దకే సరకులు సరఫరా చేశారు. బుధవారం నుంచి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. వచ్చిన ప్రతి లబ్ధిదారుడు కందిపప్పు వచ్చిందా అని డీలరును అడుగుతుండగా రాలేదని చెప్పడంతో నిరాశగా వెళ్లిపోతున్నారు. చౌకదుకాణాల ద్వారా బియ్యం, అర కిలో పంచదారతో పాటు



గోధుమపిండి, పామాయిల్, జొన్నలు, రాగులు వంటివి అందజేస్తే తమకు మేలు జరుగుతుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దా రు వెంకటరెడ్డిని వివరణ కోరగా కొన్ని నెలలుగా స్టాకు రాలేదని, అందుకే పంపిణీ చేయలేకపోతున్నామన్నారు.5 వేల కిలోల కందిపప్పు పంపిణీ: లక్కిరెడ్డిపల్లె గోదాంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన కందిపప్పు నిల్వలు ఎక్కువగా ఉండడంతో ఉన్నతాధికారుల అనుమతితో 5 వేల కిలోల కందిపప్పును కొన్ని దుకాణాలకు సరఫరా చేశామని చిన్నమండెం గోదాం ఇన్‌ఛార్జి మల్లికార్జునబాబు తెలిపారు. చిన్నమండెంలోని మూడు దుకాణాలకు వెయ్యి కిలోల వరకు, మిగతావి లక్కిరెడ్డిపల్లె పరిధిలోని కొన్ని దుకాణాలకు ఇచ్చామన్నారు.

జిల్లాలోని మండలాలు: 30

చౌక దుకాణాలు: 1123

మొత్తం కార్డులు: 5 లక్షలకు పైగా

జిల్లాకు వచ్చిన స్మార్టు కార్డులు: 4.87 లక్షలు

చురకలు



# బార్బీ బొమ్మలా మారిన జాన్వీ!

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో దివంగత నటీమణి శ్రీదేవి, ప్రముఖ బాలీవుడ్ నిర్మాత బోణీకపూర్ దంపతుల వారసురాలు జాన్వీకపూర్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. ఇండస్ట్రీలోకి హీరోయిన్ గా అడుగు పెట్టకు ముందు పలు ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించిన ఈమె.. పలు యాడ్స్ లో కూడా నటించి భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. హీరోయిన్ గా బాలీవుడ్ రంగ ప్రవేశం చేసిన జాన్వీ కపూర్ అతి తక్కువ సమయంలోనే అక్కడ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది అని చెప్పవచ్చు. ఇక నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన గ్లామర్ తో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది . ఇన్స్టాగ్రామ్ లో భారీ ఫాలోవర్స్ ను కలిగి వున్న జాన్వీ కపూర్ దీనిద్వారా బాగానే ఆర్జిస్తోందని చెప్పవచ్చు. ఒకానొక సమయంలో ఇన్స్టాగ్రామ్ ద్వారా వచ్చే ఆదాయంతోనే ఈఎంఐలు కడుతున్నానని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది కూడా. ఇప్పుడు బాలీవుడ్ లోనే కాదు టాలీవుడ్ లో కూడా అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది.. ఇదిలా ఉండగా తాజాగా ఇన్స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫోటోలు షేర్ చేసిన జాన్వీ కపూర్ అందులో ఎల్లో కలర్ మినీ ఫ్రాక్ ధరించి అచ్చం బార్బీ బొమ్మలా కనిపించింది. అమ్మడి అందానికి అభిమానులే కాదు ఫాలోవర్స్, నెటిజన్స్ కూడా ఫిదా అవుతున్నారు.



జాన్వీకపూర్ ఎలాంటి డ్రెస్ వేసినా మరింత అందంగా కనిపిస్తుందని కామెంట్లు చేస్తున్నారు. ఒకవైపు సాంప్రదాయంగా కనిపిస్తూనే.. మరొకవైపు గ్లామర్ లుక్కుతో ఆకట్టుకునే ఈమె ఇప్పుడు ఏకంగా బార్బీ లుక్ లో కనిపించేసరికి ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ కి చెందిన ఈ ఇన్స్టాగ్రామ్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. జాన్వీ కపూర్ విషయానికి వస్తే.. బాలీవుడ్ లో వరుస సినిమాలు చేసి ప్రేక్షకులను అలరించిన ఈమె.. ఇటీవల టాలీవుడ్ లో కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా వచ్చిన దేవర సినిమాతో అడుగుపెట్టి.. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. అంతేకాదు ఈ సినిమా కోసం ఏకంగా 5 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకొని అందర్నీ ఆశ్చర్యపరిచింది. అలాగే బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న విడుదల కాబోతోంది. అలాగే నాని ది ప్యారడైజ్ సినిమాలో కూడా హీరోయిన్గా అవకాశం అందుకుంది జాన్వి కపూర్. ఇటు బాలీవుడ్ విషయానికి వస్తే.. పరమ్ సుందరి, సన్నీ సంస్కారికీ తులసీ కుమారి , హోమ్ బౌండ్ అంటే వరుసగా మూడు చిత్రాలు చేసింది. కానీ ఏ చిత్రం కూడా ప్రేక్షకులను మెప్పించ లేకపోయింది. ఇప్పుడు థక్త్ అనే మరో చిత్రంలో నటిస్తోంది. మరి ఈ సినిమా నైనా ఈమెకు బాలీవుడ్లో మంచి విజయాన్ని అందిస్తుందో ఏమో చూడాలి.

# ప్రియాంక వారియర్ లో ఈ టాలెంట్ కూడా ఉందా.. అదరగొట్టేసిందిగా?

ప్రియా ప్రకాష్ వారియర్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. గత కొన్ని సంవత్సరాల క్రితం జాతీయస్థాయిలో సంచలనంగా మారింది ఈ ముద్దుగుమ్మ. ఒక్క కన్ను గీటుతో అబ్బాయిల మనసులను దోచుకుంది. అడపాదడపా సినిమాలలో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. మరొకసారి వార్తల్లో నిలిచింది అని చెప్పవచ్చు. తాజాగా తనలో దాగి ఉన్న మరో టాలెంట్ ని బయటపెట్టి అందరినీ ఆకర్షించింది. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా ప్రదీప్ రంగనాథన్ , మమిత బైజు జంటగా నటించిన చిత్రం డ్యూడ్. ఈ సినిమాల్లో భారీ హిట్ గా నిలిచిన ఊరం బ్లడ్ అనే కవర్ పాటను చాలా క్యాజువల్ గా పాడి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా మనోహరమైన స్వరంతో పాట పాడి



అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో సింపుల్ లుక్ లో కనిపిస్తూనే తన మధురమైన గాత్రంతో అందరి దృష్టిని ఆకట్టుకుంది.. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. మైత్రి మూవీ మేకర్స్ కూడా ఈమె వీడియోని తిరిగి షేర్ చేస్తూ.. "ది చార్ట్ బస్టర్ ఊరం బ్లడ్ ఫ్రమ్ డ్యూడ్ ఇన్ వాయిస్ ఆఫ్ ప్రియా వారియర్" అంటూ లవ్ ఎమోజిని కూడా షేర్ చేశారు. మొత్తానికైతే "టైం లెస్ బ్యూటీ" అంటూ అభిమానుల చేత ప్రశంసలు పొందుతోంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ప్రియాలో ఈ టాలెంట్ కూడా ఉందా అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రియా ప్రకాష్ వారియర్ విషయానికి వస్తే.. ఒరు ఆధార్ లవ్ అనే చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ఈ ముద్దుగుమ్మ.. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇకపోతే ఈ సినిమా తర్వాత పోలీస్ కేసు కూడా ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలోని ఒక పాటలోని అంశాలు ముస్లిం మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయి అంటూ ఫిర్యాదు చేశారు. దీంతో ఆ చిత్ర దర్శకుడిపై కూడా హైదరాబాదులో కేసు నమోదు అయింది. వివిధ రాష్ట్రాలలో కూడా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తనదైన స్టైల్ లో ఈ పాటపై వివరణ ఇచ్చినా.. ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు. ముఖ్యంగా 1978 నాటి ఒక పాత జానపద గీతం నుంచే ఈ పాటను తీసుకున్నామని అందులో భావాలను అర్థం చేసుకోకుండా.. లోతుల్లోకి వెళ్ళకుండా.. వక్రీకరించి ఎవరో ఫిర్యాదు చేశారని ఆమె తెలిపింది.




# మొదట్లో ఐరన్ లెగ్.. కట్ చేస్తే స్టార్ హీరోయిన్స్.. ఎవరంటే?



సినిమా ఇండస్ట్రీలోకి రావడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. హీరోయిన్లు మాత్రమే కాదు హీరోలు కూడా చాలా ఇబ్బందులు పడతారు. అయితే హీరోయిన్లు ఇండస్ట్రీలో స్టార్స్ గా రాణించాలి అంటే కమిట్మెంట్లు, క్యాస్టింగ్ కౌచ్ లు ఇలా ఎన్నో ఉంటాయి. ఇవన్నీ దాటుకొని ఇండస్ట్రీలో రాణిస్తేనే ముందుకు వెళ్తారు. అయితే సినిమాల్లోకి వచ్చిన మొదట్లోనే అందరికీ హిట్స్ పడిపోవు. ఎన్నో ఫ్లాప్ సినిమాలను, అవమానాలు ఎదుర్కొన్నాకే హిట్ సినిమాలు పడతాయి. అలా కొత్త హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చి రెండు మూడు సినిమాలు హిట్ కొడితే ఓకే.. లేకపోతే మాత్రం ఐరన్ లెగ్ అనే ముద్ర వేస్తారు. అలా ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఐరెన్ లెగ్ ముద్ర వేసుకొని ఆ తర్వాత సినిమాల్లో స్టార్ హీరోయిన్స్ గా రాణించిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం..


**విద్యాబాలన్:** బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ విద్యాబాలన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. అయితే ఈ హీరోయిన్ సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ అనే ముద్ర వేసుకుంది. దానికి కారణం మోహన్ లాల్ తో ఆగిపోయిన చక్రం మూవీ..ఈ సినిమా డైరెక్టర్ కి – హీరో కి మధ్య గొడవలు రావడంతో ఆగిపోయింది. ఈ సినిమాలో హీరోయిన్ గా తీసుకున్న విద్యాబాలన్ కి బిగ్ షాక్ తగిలింది. ఎందుకంటే మోహన్ లాల్ తో సినిమా అనగానే విద్యాబాలన్ కి దాదాపు 8,9 సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి.కానీ ఎప్పుడైతే చక్రం మూవీ ఆగిపోయిందని తెలిసిందో ఆ తర్వాత రాత్రికి రాత్రే ఏకంగా 8,9 సినిమాల నుండి విద్యాబాలన్ ని తీసేసారట. దాంతో విద్యాబాలన్ పై ఐరన్ లెగ్ ట్యాగ్ వేశారు. కానీ ఆ తర్వాత డర్టీ పిక్చర్ అనే మూవీ తో విద్యాబాలన్ ఇండస్ట్రీని షేక్ చేసింది.

**రమ్యకృష్ణ:** సౌత్ స్టార్ హీరోయిన్ రమ్యకృష్ణ కూడా సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ ముద్ర వేసుకుంది. ఈ ముద్దుగుమ్మ మొదట తమిళ సినిమా ద్వారా సినిమాల్లోకి వచ్చింది. ఆ తర్వాత తెలుగులో భలే మిత్రులు మూవీతో ఎంట్రీ ఇచ్చింది. అయితే 1984లో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రమ్యకృష్ణకి దాదాపు ఏడు సంవత్సరాలు గడ్డుకాలం నడిచిందట. ఆమె చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అవ్వడంతో ఐరన్ లెగ్ అనే ట్యాగ్ ని తగిలించారు. కానీ విశ్వనాథ శాస్త్రి దర్శకత్వంలో వచ్చిన సూత్రధారులు సినిమా రమ్యకృష్ణ కెరియర్ ని మార్చేసింది. ఈ సినిమాతో ఆమెకు వరుస సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి. అలా సినిమాల్లోకి వచ్చాక దాదాపు 7 సంవత్సరాలు ఐరన్ లెగ్ అనే ముద్రతోనే రమ్యకృష్ణ ఇండస్ట్రీలో రాణించింది. ఆ తర్వాత ఈమెకు తెలుగు, తమిళ భాషల్లో బ్రహ్మరథం పట్టారు.

**నయనతార:** ఈ హీరోయిన్ మలయాళ సినిమాలతో ఇండస్ట్రీలోకి వచ్చినప్పటికీ ఆ సినిమాలు ఏవి అంత గుర్తింపు తెచ్చిపెట్టలేదు. కానీ తెలుగు, తమిళ భాషలో విడుదలైన చంద్రముఖి సినిమా నయనతారకి మంచి క్రేజ్ తెచ్చింది.ఆ తర్వాత వచ్చిన గజిని కూడా నయన్ కెరీర్ ని మార్చేసింది.అలా తెలుగు, తమిళ భాషల్లో ఇప్పటికి స్టార్ హీరోయిన్ గా రాణించింది.

**శృతిహాసన్ :** కమల్ హాసన్ కూతురు అయినప్పటికీ శృతిహాసన్ కి వరుస డిజాస్టర్స్ తప్పలేదు. అలా ఇండస్ట్రీ లోకి వచ్చిన కొత్తలో లక్, అనగనగా ఓ ధీరుడు, 3, ఓ మై ఫ్రెండ్,7 ఓం అరివు వంటి వరుస సినిమాలు ఫ్లాప్స్ అయ్యాయి. కానీ ఎప్పుడైతే పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ మూవీలో చేసిందో. ఆ తర్వాత ఈమె దశ తిరిగిపోయింది. ఈ మూవీతో ఐరన్ లెగ్ హీరోయిన్ కాస్తా స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఇక ఈ మధ్యకాలంలో శృతిహాసన్ ఫ్లాపుల్లో ఉన్న హీరోలకు గోల్డెన్ హీరోయిన్ గా మారిపోయింది.

# మల్టీస్టారర్ సినిమాకు డైరెక్టర్ కష్టాలు..?




కోలీవుడ్ స్టార్స్ మాత్రమే కాదు పాన్ ఇండియా లెవెల్ లో సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉన్న కథానాయకులు సూపర్ స్టార్ రజినీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్. ఇద్దరు వారి వారి సినిమాలతో కొన్ని దశాబ్దాలుగా సినీ లవర్స్ ని అలరిస్తూ వస్తున్నారు. కోలీవుడ్ పరిశ్రమకు ఈ ఇద్దరు ఇచ్చిన కాంట్రిబ్యూషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇప్పటికీ అక్కడ స్టార్స్ కి ధీటుగా సినిమాలు చేస్తూ వస్తున్నారు ఈ ఇద్దరు స్టార్స్.

**రజనీ, కమల్ ఇద్దరు కెరీర్ మొదట్లో..** ఐతే రజనీ, కమల్ ఇద్దరు కెరీర్ మొదట్లో కలిసి నటించారు. ఇద్దరికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఏర్పడి.. సూపర్ స్టార్స్ అయ్యాక కలిసి నటించలేదు. కనీసం స్క్రీన్ షేర్ చేసుకోలేదు. అందుకే ఇన్నాళ్లకు ఆ కాంబినేషన్ పై గురి కుదిరింది. కమల్, రజనీ ఇద్దరు కూడా కలిసి నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వేరు వేరు సందర్భాల్లో రజనీతో సినిమా ఉంటుందని కమల్.. కమల్ హాసన్ తో సినిమా చేస్తున్నా అని రజనీ చెప్పారు. ఈ ఇద్దరు హీరోలను కలిసి సినిమా తీసే డైరెక్టర్ ఎవరన్నది మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. అసైతే లోకేష్ కనకరాజ్ డైరెక్షన్ లో ఈ సినిమా వస్తుందని అనుకున్నారు. కానీ కూలీ ఇచ్చిన షాక్ వల్ల ఆ ఛాన్స్ మిస్ చేసుకున్నాడు లోకేష్. మరోపక్క యువ దర్శకుడు, హీరో ప్రదీప్ రంగనాథన్ కి ఈ ఛాన్స్ ఇస్తున్నారంటూ వార్తలు వచ్చాయి. కానీ అందులో ఏమాత్రం నిజం లేదని క్లారిటీ వచ్చింది.

**ఈ కాంబినేషన్ సినిమా హ్యాండిల్ చేసే ఛాన్స్..** కార్తీక్ సుబ్బరాజ్ కూడా డిస్కషన్ లో ఉన్నా రెట్రో ఫ్లాప్ తర్వాత అతను కూడా ఈ మల్టీస్టారర్ కు రెడీగా ఉన్నట్టు కనిపించట్లేదు. ఐతే ఫైనల్ గా ఒక డైరెక్టర్ ఈ కాంబినేషన్ సినిమా హ్యాండిల్ చేసే ఛాన్స్ ఉందని అంటున్నారు. అతను ఎవరో కాదు నెల్సన్ దిలీప్ కుమార్. సూపర్ స్టార్ రజినీతో జైలర్ సినిమా తీసి సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు నెల్సన్. ప్రస్తుతం రజినీతో జైలర్ 2 చేస్తున్నాడు నెల్సన్. ఈ సినిమా తర్వాత రజనీ, కమల్ మల్టీస్టారర్ కూడా ఆయనే డైరెక్ట్ చేసే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. లోకేష్, కార్తీ, ప్రదీప్ ఇలా వీళ్లందరి కన్నా నెల్సన్ తోనే ఈ మల్టీస్టారర్ చేయాలని అనుకుంటున్నారట. నెక్స్ట్ అనౌన్స్ మెంట్ రావడమే లేట్ అంటున్నారు. ఐతే రజనీ, కమల్ సినిమాను నెల్సన్ తీస్తే ఎన్టీఆర్ తో తను చేసే సినిమా ఇంకా లేట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఐతే ఎలాగు ఎన్టీఆర్ నీల్ తో చేసే సినిమా తర్వాత త్రివిక్రం సినిమా ఉంటుంది కాబట్టి సమస్య ఉండకపోవచ్చని తెలుస్తుంది.

# గార్జియస్ లుక్ లో అమృత!

అమృత అయ్యర్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ముఖ్యంగా ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమాతో ఓవర్ నైట్ లోనే లైమ్ లైట్ లోకి వచ్చేసింది. ఆ తర్వాత ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో యంగ్ హీరో తేజ సజ్జ నటించిన హనుమాన్ సినిమాలో హీరోయిన్గా నటించి మరోసారి ప్రేక్షకులను అబ్బురపరిచింది. ఈ సినిమాలో ఈమె నటనకు విమర్శకుల ప్రశంసలు కూడా లభించాయి. అంతేకాదు ఈ సినిమా తర్వాత ఆఫర్లు వరుసగా తలుపు తడతాయని అందరూ అనుకున్నారు. కానీ అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అయితే రాలేదు. ఇక బచ్చల మిల్లి సినిమాలో అల్లరి నరేష్ సరసన హీరోయిన్గా నటించినా కానీ ఈ సినిమా కూడా ఈమెకు కలిసి రాలేదని చెప్పాలి. ఇకపోతే అటు సినిమాలకు ఇటు సోషల్ మీడియాకి కూడా కాస్త దూరంగా ఉన్న ఈమె తాజాగా తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపిన క్షణాలను ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసుకుంది..ఆ ఫోటోలలో



చాలా గార్జియస్ లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది అమృత అయ్యర్. తాజాగా స్లీవ్ లెస్ ముదురు నీలం రంగు దుస్తులు ధరించిన ఈమె.. ఆ దుస్తులలో తన ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించింది. బోల్డ్ స్లిట్ తో కప్పబడిన స్కర్ట్ ఆమెకు క్లాసీ లుక్కును అందించింది. ఈ గ్లామర్ లుక్కులో చాలా రిలాక్స్ గా కనిపించి సరికొత్త వైబ్ క్రియేట్ చేసింది అమృత అయ్యర్. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి చాలా రోజుల తర్వాత ఇలాంటి లుక్కులో చూసేసరికి అభిమానులు ఈ ఫోటోలను తెగ లైక్, షేర్ చేస్తున్నారు. అమృత అయ్యర్ విషయానికి వస్తే.. 1994 మే 14న తమిళనాడులోని చెన్నైలో తమిళ్ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. కర్ణాటకలోని బెంగళూరులో పెరిగిన ఈమె అక్కడే ఎన్ హెచ్ ఆర్ పాఠశాలలో స్కూల్ విద్యాభ్యాసం పూర్తి చేసి, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో డిగ్రీ పూర్తి చేసింది. 2018లో తమిళ చిత్రం పడైవీరన్ సినిమాతో తొలిసారి హీరోయిన్ గా అడుగుపెట్టిన ఈమె ఆ తర్వాత బిగిల్, లిఫ్ట్ వంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది.. రెడ్ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత 30 రోజుల్లో ప్రేమించడం ఎలా అనే సినిమా చేసి ఆకట్టుకుంది. హనుమాన్ సినిమాతో వంద కోట్ల క్లబ్లో చేరిన ఈమె బచ్చల మిల్లి , అర్జున ఫాల్గుణ సినిమాలు చేసింది..

# ఆ బాధ నాకు నిద్ర పట్టనివ్వడం లేదు..

హైదరాబాదు నుండి బెంగళూరు బయలుదేరిన వేమూరి కావేరి ట్రావెల్ బస్ కర్నూలుకి 10 కిలోమీటర్ల దూరంలో బైక్ ను ఢీ కొట్టి అత్యంత దారుణంగా దగ్ధమైన విషయం తెలిసిందే. ఇందులో 42 మంది ప్రయాణికులు ఉండగా ఇద్దరు డ్రైవర్లు ఘటన సమయంలో అక్కడి నుండి పారిపోగా.. 42 మందిలో 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతి అయ్యారు. ఇక మిగతావారు కిటికీ అద్దాలు పగలగొట్టుకొని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బస్సు నుండి దూకేసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటన దేశం మొత్తాన్ని ఆశ్చర్యపరిచింది. ప్రతి ఒక్కరూ కూడా ఈ విషాదకర ఘటనపై విచారణ వ్యక్తం చేస్తున్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సహా పలువురు ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు కేంద్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రభుత్వం కూడా మృతులకు, ఈ ఘటనలో



గాయపడిన వారికి ఎక్స్గ్రేషియా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఈ ఘటనపై సినీ సెలబ్రిటీలు కూడా స్పందిస్తున్నారు. ముఖ్యంగా సినీ నటి రష్మిక మందన్న ఎమోషనల్ కామెంట్లు చేశారు. రష్మిక ఈ ప్రమాదం గురించి మాట్లాడుతూ.. కాలిపోయే ముందు ప్రయాణికులు అనుభవించిన భాధ తలుచుకుంటేనే భయంకరంగా ఉంది. ఆ బాధ నాకు నిద్ర కూడా పట్టనివ్వడం లేదు అంటూ ఎమోషనల్ కామెంట్లు చేసింది. ఈ ఘటనపై రష్మిక మాట్లాడుతూ.. "కర్నూలు ప్రమాదవార్త నా హృదయాన్ని ముక్కలు చేసింది. ఎంతో బాధపడ్డాను. మండుతున్న బస్సు లోపల ఆ ప్రయాణికులు అనుభవించిన బాధ వర్ణించలేనిది. ముఖ్యంగా మంటలకు తమ శరీరం కాలిపోతున్నప్పుడు వాళ్ళు ఆ బాధ ఎంత అనుభవించారో ఊహిస్తేనే భయంకరంగా ఉంది. ఇందులో చిన్నపిల్లలతో సహా ఒక కుటుంబమంతా ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను" అంటూ రష్మిక ఎమోషనల్ కామెంట్లు చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536